www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

భారతీయ కళా మహోత్సవం..
పశ్చిమ భారత వైభవానికి వేదిక
ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
రాష్ట్రపతి నిలయంలో 9 రోజుల పాటు ప్రదర్శన
నేటి నుంచి ప్రజలకు ఉచిత ప్రవేశం 3


బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్, సీఎం

శనివారం | 22-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 234 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: విదియ సా.5:12 తదియ; నక్షత్రం: జ్యేష్ఠ సా.4:47 తదుపరి మూల; వర్జ్యం: రా.1:40-3:27; దుర్ముహూర్తం: ఉ.6:27-7:56; అమృతఘడియలు: ఉ.6:56-8:43; రాహుకాలం: ఉ.9:00-10:30; సూర్యోదయం: 6:27; సూర్యాస్తమయం: 5:34 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కార్మికులందరికీ
సామాజిక భద్రత!
4 కార్మిక స్మృతులు అమల్లోకి.. కేంద్ర ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయం



ప్రగతిశీల సంస్కరణలు..
దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి కార్మికుల సాధికారత కోసం తీసుకొచ్చిన గొప్ప సంస్కరణలు ఇవి. సులభతర వాణిజ్య విధానానికి ప్రోత్సాహకం కల్పిస్తాయి. సార్వత్రిక సామాజిక భద్రతకు బలమైన పునాది వేస్తాయి. నారీ శక్తి, యువ శక్తికి మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తాయి.
\- ప్రధాని మోదీ

కార్మిక చట్టాల్లో భారీ సంస్కరణలు
29 చట్టాల స్థానంలో నాలుగు కొత్త కోడ్‌లు
ఉద్యోగులందరికీ నియామక పత్రాలు
అందరికీ కనీస వేతనాలు తప్పనిసరి
గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు తొలిసారి నిర్వచనం
ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు ఏడాది సర్వీసుకే గ్రాట్యుటీ
40 ఏళ్లు పైబడిన ఉద్యోగులకు ఏటా వైద్య పరీక్షలు
అన్ని షిఫ్టుల్లో, అన్ని రకాల పనుల్లో మహిళలు
కొత్త కోడ్‌లతో ఉపాధి సంఘటితం: మాండవీయ

న్యూఢిల్లీ, నవంబరు 21: కార్మిక చట్టాల విషయంలో కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి కార్మిక చట్టాల్లో భారీ సంస్కరణలను తీసుకొచ్చింది. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న నాలుగు కార్మిక కోడ్ (స్మృతి)లను తక్షణమే అమల్లోకి తెస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. గిగ్ వర్కర్లకు కూడా సామాజిక భద్రత కల్పించడం, ఉద్యోగులందరికీ తప్పనిసరిగా నియామక పత్రాలు అందించడం, అన్ని రంగాల్లో ఉద్యోగులకు కనీస వేతనాలు.. క్రమం తప్పకుండా అందించడం వంటి భారీ సంస్కరణలు ఉన్నాయి. వేతనాల కోడ్ (2019); పారిశ్రామిక

మిగతా 2వ పేజీలో...



'టీశాక్'లో కలెక్షన్ కింగ్!
ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో వసూళ్ల పర్వం
హెచ్‌ఐవీ ఎయిడ్స్ ఎన్జీవోలే టార్గెట్
ఎంవోయూలు రద్దు చేస్తామంటూ
బెదిరించి కమీషన్లు వసూలు చేసిన వైనం
రెండునెలల్లో రూ.3 కోట్లకు పైగా..
ఓ కాంట్రాక్ట్ ఉద్యోగికి వసూళ్ల బాధ్యత
ఆ ఉద్యోగికి బదిలీ.. దాంతో వెలుగులోకి

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(టీశాక్)లో వసూళ్ల పర్వం చోటు చేసుకుంది. ఎయిడ్స్ రోగులకు సేవలందించే స్వచ్ఛంద సంస్థల(ఎన్‌జీవో) నుంచి టీశాక్‌అధికారులు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. తాము అడిగినంత ఇవ్వకుంటే టీశాక్‌తో చేసుకున్న అవగాహన ఒప్పందాలు(ఎంవోయూ) రద్దు చేస్తామని బెదిరిస్తూ రాష్ట్రంలోని వివిధ ఎన్జీవోల నుంచి రెండు నెలల్లో రూ.3కోట్లకు పైగా వసూళ్లు చేశారు. ఈ వసూళ్ల వెనుక టీశాక్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి ఉన్నారని విశ్వసనీయ

మిగతా 13వ పేజీలో...

దానం నాగేందర్..
రాజీనామా బాటలో?
కాంగ్రెస్ అధిష్ఠానం అనుమతి కోసమే ఢిల్లీకి!
పార్టీ పెద్దలు అంగీకరిస్తే పదవికి రాజీనామా
ఫిరాయింపుపై విచారణ జరిగితే వేటే!
అందుకే రాజీనామా యోచనలో నాగేందర్
మళ్లీ ఖైరతాబాద్ టికెట్ ఇవ్వాలని వినతి!
గెలిచొస్తా.. మంత్రి పదవివ్వాలని ప్రతిపాదన?
అధిష్ఠానానికి మరో 3 ప్రతిపాదనలు కూడా..
కడియం శ్రీహరి విషయంలో తర్జనభర్జనలు
ఆయనతోనూ రాజీనామా చేయించే యోచన?
స్పీకర్‌ను కలిసి మరింత గడువు కోరిన కడియం





హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడమే మంచిదని దానం నాగేందర్ భావిస్తున్నారా? పార్టీ ఫిరాయింపు పిటిషన్‌పై విచారణ దాకా వెళ్లకూడదని అనుకుంటున్నారా? అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకొని, ఖైరతాబాద్ టికెట్‌పై హామీ తీసుకునేందుకే ఢిల్లీ వెళ్లారా? కాంగ్రెస్ పెద్దలు అనుమతి ఇవ్వగానే రాజీనామా చేస్తారా? కడియం శ్రీహరి సైతం అదే బాటలో ఉన్నారా..? అంటే కాంగ్రెస్ వర్గాలు అవుననే అంటున్నాయి. ఈ అంశంపై పార్టీలో జోరుగా చర్చ నడుస్తోంది. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై

మిగతా 13వ పేజీలో...

సర్పంచ్, వార్డు సభ్యుల
రిజర్వేషన్లు ఖరారు
కలెక్టర్లకు డెడికేటెడ్ కమిషన్ నివేదిక
రిజర్వేషన్ల ఖరారుకు
నేడు మార్గదర్శకాలు జారీ 12

ఏకగ్రీవ పంచాయతీలకు
10 లక్షల ప్రోత్సాహకం
ఏకగ్రీవ ఎన్నికలతో పల్లెల అభివృద్ధి
ఏడాదిన్నరలో చేనేత రంగానికి
వెయ్యి కోట్లు: మంత్రి తుమ్మల 13
25న క్యాబినెట్.. విద్యుత్తు అంశాలే ఎజెండా



దుబాయ్ ఎయిర్‌షోలో
కూలిన తేజస్
పెద్ద ఎత్తున మంటలు..
పైలట్ దుర్మరణం
ప్రదర్శన చివరిరోజు ఘటన
పైలట్ తప్పించుకోలేక?.. 2
ప్రత్యేక బృందంతో దర్యాప్తు
తేజస్ జెట్ విమానం
కూలడం ఇది రెండోసారి

రూ.700 కోట్ల స్థలాన్ని
కాపాడిన హైడ్రా
హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో
నాలుగు ఎకరాలు కబ్జా
స్థానికుల ఫిర్యాదుతో 13
రంగంలోకి హైడ్రా అధికారులు
ఫెన్సింగ్ వేసి స్థలం స్వాధీనం

కర్ణాటకలో
హైడ్రామా!
ఢిల్లీకి డీకే వర్గం ఎమ్మెల్యేలు
ఆ విషయం తనకు
తెలియదన్న డీకే శివకుమార్
'మార్పు'పై నిర్ణయం 2
అధిష్ఠానానిదే: సిద్దరామయ్య
నేడు బెంగళూరుకు ఖర్గే

రూ.5 లక్షల కోట్ల భూ
కుంభకోణం!



పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ
ముసుగులో రేవంత్‌రెడ్డి గ్యాంగ్ స్కాం
9,292 ఎకరాలను అతి తక్కువ ధరకు
కట్టబెట్టి రియల్ ఎస్టేట్ చేసే ప్రయత్నం
సీఎం సోదరులు, సన్నిహితులు
ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్నారు
వచ్చేది మా ప్రభుత్వమే.. భూముల్ని
తిరిగి వెనక్కి తీసుకొంటాం: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ పేరుతో రేవంత్ ప్రభుత్వం భారీ భూ కుంభకోణానికి తెర లేపిందని కేటీఆర్ ఆరోపించారు. పరిశ్రమల కోసం గతంలో ప్రభుత్వాలు కేటాయించిన వేలాది ఎకరాల భూముల్ని అతి తక్కువ ధరకు తీసుకొని.. తమ రియల్ ఎస్టేట్ కోసం వినియోగించే యత్నం

మిగతా 12వ పేజీలో...



సర్కారుపై కేటీఆర్ దుష్ప్రచారం
రాష్ట్ర ఆదాయానికి గండికొట్టే ప్రయత్నం
'ఫ్రీహోల్డ్ రైట్స్'కు వారే 3 జీవోలిచ్చారు
పరిశ్రమలకు లీజుకిచ్చిన భూములపై
యాజమాన్య హక్కులు కల్పించారు
వారికి భూ వినియోగ మార్పిడి చేసుకునే
అవకాశం మాత్రమే మేం కల్పించాం
జూబ్లీహిల్స్ ఓటమితో చుక్కలు: దుద్దిళ్ల

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పారిశ్రామిక విధానంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండిపడ్డారు. పారిశ్రామిక భూముల కన్వర్షన్ కోసం ప్రభుత్వం ఇంపాక్ట్ ఫీజు వసూలు చేయాలని నిర్ణయిస్తే.. దానిని 5 లక్షల కోట్ల కుంభకోణమంటూ కేటీఆర్

మిగతా 12వ పేజీలో...

హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం
15న విజయవాడలో ఆస్పత్రి నుంచి ఆయనతోపాటు
మరికొందరిని ఏపీ ఎస్ఐబీ పోలీసులు తీసుకెళ్లారు
కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు
చిత్రహింసలు పెట్టి చంపి కట్టుకథ అల్లారు
టెక్ శంకర్ సహా మరికొందరిని అలాగే హత్య చేశారు
భగత్‌సింగ్, అల్లూరిలాగా హిడ్మా చరిత్ర నిలుస్తుంది
ఫాసిస్టు ఆర్ఎస్ఎస్, బీజేపీ మనువాదుల దమనకాండ
ఖనిజ దోపిడీ కోసమే నక్సల్స్ హత్యలు: మావోయిస్టు పార్టీ
రేపు దేశవ్యాప్తంగా నిరసన దినం పాటించాలని పిలుపు
వీలైతే సరెండర్లు.. లేదంటే ఎన్‌కౌంటర్లు
28న డీజీపీలతో మోదీ సమావేశానికి ముందే చర్యలు
అడవుల్లో ముగ్గురు తెలంగాణ అగ్రనేతలు?
బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపి.. శాంతి చర్చలు జరపాలి
సుప్రీంకోర్టు మౌనంగా ఉండటం బాధాకరం: కూనంనేని
ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్ అవుతారా..?: హరగోపాల్



హైదరాబాద్/మంథని/చర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, అయన భార్య రాజేతోపాటు పలువురిని పోలీసులు పట్టుకొని తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టి బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల

మిగతా 10వ పేజీలో...



మిస్‌యూనివర్స్‌గా మెక్సికో సుందరి ఫాతిమా బాష్

బ్యాంకాక్, నవంబరు 21: థాయ్‌లాండ్‌లో జరిగిన 74వ మిస్ యూనివర్స్ పోటీల్లో మెక్సికో అందగత్తె ఫాతిమా ఫెర్నాండెజ్ బాష్ విశ్వ సుందరి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. తన అందం, తెలివితేటలతో న్యాయనిర్ణేతలను మెప్పించి విజేతగా నిలిచారు. పోటీ మధ్యలో ఆతిథ్య దేశానికి చెందిన ఓ హోస్ట్ ఆమెను అవమానించినా వెనకడుగు వేయకుండా ధైర్యంగా ఎదురు నిలిచి అందరి మన్ననలు పొందారు. గతేడాది మిస్ యూనివర్స్‌గా నిలిచిన అందాల భామ విక్టోరియా హెల్విగ్.. ఫాతిమాకు అందాల కిరీటం అందజేశారు. దాదాపు 120 దేశాల సుందరీమణులు ఈ పోటీల్లో పాల్గొనగా.. వారందరినీ కాదని 25ఏళ్ల ఫాతిమాను విజయం వరించింది. థాయ్‌లాండ్ భామ మొదటి రన్నరప్‌గా నిలవగా, వెనెజువెలా సుందరి రెండో రన్నరప్‌తో సరిపెట్టుకున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకే 'సర్': అమిత్‌షా

భుజ్(గుజరాత్), నవంబరు 21: దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకే ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్-సర్)ను దేశవ్యాప్తంగా చేపట్టామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్పష్టంచేశారు. ఓటర్ల జాబితాలో ఒక్క చొరబాటుదారునూ ఉండనివ్వబోమన్నారు. ఒక్కో చొరబాటుదారుడిని వెంటాడి వెంటాడి మరీ దేశం నుంచి తరిమివేస్తామని, ఇది తమ శపథమని తేల్చిచెప్పారు. బీఎస్ఎఫ్ 61వ వ్యవస్థాపక దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం గుజరాత్ భుజ్‌లోని హరిపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఇండీ కూటమి పార్టీల పేరెత్తకుండా.. కొన్ని పార్టీలు చొరబాటుదార్ల ఏరివేతను బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని.. సర్ ప్రక్రియను, ఓటర్ల జాబితా ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు.

జీ20 సదస్సు కోసం దక్షిణాఫ్రికాకు మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 21: ప్రధాని మోదీ శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జీ-20 శిఖరాగ్ర సదస్సు కోసం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌కు చేరుకున్నారు. అక్కడి విమానాశ్రయంలో సాంస్కృతిక ప్రదర్శన బృందం మోదీకి ఘన స్వాగతం పలికింది. 'ఐక్యత, సమానత్వం, స్థిరత్వం' అనే ఇతివృత్తంతో ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు. ప్రపంచ సమస్యలను చర్చించడానికి ఈ శిఖరాగ్ర సదస్సు ఓ కీలక వేదిక అని దక్షిణాఫ్రికా వెళ్లే ముందు మోదీ పేర్కొన్నారు. 'వసుధైవ కుటుంబకం, ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అనే మా దార్శనికతకు అనుగుణంగా భారత్ దృక్పథాన్ని సదస్సులో ప్రసంగిస్తా. ఆఫ్రికా గడ్డపై జరుగుతున్న తొలి జీ-20 సదస్సు కాబట్టి ఇది చాలా ప్రత్యేకం అవుతుంది. ఈ సదస్సు సందర్భంగా జరగనున్న 6వ ఐబీఎస్ఏ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు, భాగస్వామ్య దేశాల నేతలతో చర్చించేందుకు ఆసక్తితో ఎదురుచూస్తున్నా' అని వ్యాఖ్యానించారు.

'గవర్నర్లకు గడువు'పై న్యాయపోరాటం: స్టాలిన్

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఆమోదించిన ముసాయిదా బిల్లులపై నిర్ణయాలు తీసుకోవడానికి గవర్నర్లకు గడువు నిర్దేశించే దిశగా రాజ్యాంగాన్ని సవరించే దాకా విశ్రమించబోమని తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటించారు. రాష్ట్ర హక్కులను కాపాడేందుకు, నిజమైన సమాఖ్యవాదాన్ని నిలబెట్టేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్టాలిన్ పేర్కొన్నారు. బిల్లుల ఆమోదానికి సంబంధించి రాష్ట్రపతి అడిగిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన వివరణలు తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో గత ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పుపై ఎలాంటి ప్రభావం చూపబోదని తెలిపారు. రాష్ట్రంలో ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వమే పరిపాలించాలని, రాజ్యంగ పదవుల్లో ఉన్నవారు (గవర్నర్లు) రాజ్యాంగాన్ని ఉల్లఘించేలా వ్యవహరించకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని స్టాలిన్ తెలిపారు.

మృతభాష సంస్కృతానికి రూ.2400 కోట్లా?

» తమిళానికి మాత్రం రూ.150 కోట్లేనా: ఉదయనిధి

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంస్కృతాన్ని మృత భాషగా పేర్కొన్న తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇటీవల ఓ పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఉదయనిధి స్టాలిన్ ప్రస్తుతం ఎవరూ మాట్లాడని మృతభాష సంస్కృతం కోసం రూ.2,400 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. కోట్లాదిమంది మాట్లాడే తమిళ భాషాభివృద్ధికి మాత్రం కేవలం రూ.150 కోట్లు కేటాయించిందని వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ తమిళనాడు మాజీ అధ్యక్షురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. ఒక భాష మృతి చెందిందని చెప్పడానికి ఎవ్వరికీ హక్కు లేదని, దేశం మొత్తం పూజా కార్యక్రమాలను సంస్కృతంలోనే నిర్వర్తిస్తోందని తెలిపారు. భాష-సంస్కృతి గురించి మాట్లాడేటప్పుడు నేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

సోషల్ మీడియాలో ఇళయరాజా ఫొటో వాడొద్దు

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత స్వరకర్త 'ఇసైజ్ఞాని' ఇళయరాజా ఫొటోను సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి నెట్‌వర్కింగ్ సైట్లలో ఉపయోగించడంపై మద్రాస్ హైకోర్టు తాత్కాలిక నిషేధం విధించింది. ఈ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో తన అనుమతి లేకుండా తన ఫొటోను ఉపయోగించడాన్ని నిషేధించాలని కోరుతూ ఇళయరాజా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీ సాయంతో తన ఫొటోను మార్ఫింగ్ చేసి వాణిజ్యపరంగా వినియోగిస్తూ ఆదాయాన్ని అర్జిస్తున్నారని, ఇది తన వ్యక్తిగత హక్కులను హరించే చర్య అని పేర్కొన్న ఇళయరాజా..ఇకపై తన అనుమతి లేకుండా ఎవ్వరూ ఉపయోగించకుండా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు.

రెస్టారెంట్లకు జొమాటో కస్టమర్ల డేటా

న్యూఢిల్లీ, నవంబరు 21: ఫుడ్ డెలివరీ జెయింట్ జొమాటో తన కస్టమర్ల డేటాను రెస్టారెంట్లకు ఇవ్వడానికి సిద్ధమైంది. దీంతో రెస్టారెంట్లకు, జొమాటోకి మధ్య చాలాకాలంగా కొనసాగుతున్న వివాదానికి తెరపడింది. అయితే జొమాటో నిర్ణయంపై వినియోగదారుల్లో కలకలం రేగింది. డేటా రక్షణకు భంగం కలుగుతుందని, వినియోగదారుల సమాచారం దుర్వినియోగం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) నిబంధనలకు వ్యతిరేకమని చెబుతున్నారు. వినియోగదారుల సమాచారం ఇవ్వడానికి ఇప్పటికే నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ)తో జొమాటో చర్చలు జరిపి అంగీకారం తెలిపింది. వినియోగదారుల తినుబండారాల బుకింగ్స్ సమాచారం కూడా ఇవ్వనుంది. జొమాటో పోటీదారు స్విగ్గీకి, రెస్టారెంట్లకు మధ్య కూడా ఇలాంటి చర్చలు జరుగుతున్నాయని బిజినెస్ టుడే పత్రిక పేర్కొంది. ఇప్పటివరకు జొమాటో కస్టమర్ల ఫోన్ నంబర్లు, ఇతర వ్యక్తిగత డేటా రహస్యంగా ఉండేది. అది తమకు ఇవ్వాలని రెస్టారెంట్లు చాలా ఏళ్లుగా కోరుతున్నాయి.

పెళ్లి పీటలపై కాదు.. ఐసీయూలో వివాహం!



కొచ్చి, నవంబరు 21: పెళ్లి అంటే అదొక పండగ, ఎన్నో కలలు, మరెన్నో కోరికలు ఉంటాయి. కేరళలోని అలప్పుళకు చెందిన అవనికి కూడా అలాంటి ఉత్సాహంతోనే ఆ రోజు ఉదయం మొదలైంది. తంబోలికి చెందిన శరణ్‌తో శుక్రవారం మధ్యాహ్నం వివాహం జరగాల్సి ఉండగా.. అలంకరణ కోసం కుమారకోమ్ బయలుదేరింది. అయితే మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై కొచ్చిలోని ఓ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతోంది. అయితే, పెళ్లి వాయిదా వేయడం ఎందుకని భావించిన ఇరు కుటుంబాల పెద్దలు ముహూర్త సమయంలోనే ఆస్పత్రి బెడ్‌పైనే పెళ్లి నిర్వహించాలనుకున్నారు. బెడ్‌పైనే ఉన్న అవనికి కుటుంబీకుల సమక్షంలో వరుడు తాళి కట్టాడు.

కార్మికులందరికీ సామాజిక భద్రత!



(మొదటి పేజీ తరువాయి)

సంబంధాల కోడ్ (2020); సామాజిక భద్రత కోడ్ (2020); వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని ప్రదేశాల్లో పరిస్థితుల కోడ్ (2020)లను తక్షణమే అమల్లోకి తెచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. చాలా దేశాలు ఇప్పటికే తమ చట్టాలను సరళీకరించి, ఏకీకృతం చేసినప్పటికీ మనం మాత్రం సంక్లిష్టమైన, కాలం చెల్లిన చట్టాలనే కొనసాగిస్తున్నామని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న 29 చట్టాల స్థానంలో ఏకీకృత, ఆధునికీకరించిన నాలుగు కోడ్‌లను అమల్లోకి తెచ్చినట్లు తెలిపింది. కొత్త కార్మిక కోడ్‌లకు సంబంధించిన చట్టానికి 2020లోనే ఆమోదం లభించింది. కానీ, కొన్ని రాష్ట్రాలు నిబంధనలను నోటిఫై చేయడంలో జాప్యం చేశాయి. దీంతో అమలు వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా నాలుగు కార్మిక స్మృతులు అమల్లోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం సమగ్ర నిబంధనలు, పథకాల రూపకల్పనకు సంప్రదింపులు ప్రారంభించనుంది. కొత్త కోడ్‌లు అమల్లోకి వచ్చినప్పటికీ అవసరమైనప్పుడు ప్రస్తుత కార్మిక చట్టాల్లోని నిబంధనలు కూడా వర్తిస్తాయని కేంద్ర కార్మిక శాఖ తెలిపింది. కాగా, 2015లో దేశంలో సామాజిక భద్రత కవరేజ్ 19 శాతం ఉండగా.. 2025 నాటికి ఇది 64 శాతానికి చేరినట్లు వెల్లడించింది. కొత్త కోడ్‌ల అమలుతో కార్మిక అనుకూల వ్యవస్థను ప్రోత్సహించినట్లయిందని పేర్కొంది.


ఆత్మనిర్భర భారత్‌కు పునాది..

తాజా కోడ్‌లలో మహిళలకు హక్కులు, భద్రతను మరింత పెంచడం, ప్రమాదకరమైన ప్రాసెసింగ్ కేంద్రాలు సహా అన్ని చోట్లా దేశవ్యాప్తంగా ఈఎస్ఐసీ సౌకర్యం కల్పించడం, సింగిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్, రిటర్న్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం వంటి ప్రధాన సంస్కరణలు ఉన్నాయి. ఈ నాలుగు స్మృతులతో ఉపాధిని సంఘటితం చేయడం, కార్మికుల సంరక్షణను బలోపేతం చేయడం, కార్మిక నిర్వహణ వ్యవస్థను సులభతరం, సురక్షితం చేయడంతో పాటు అంతర్జాతీయంగా అనుసంధానించవచ్చని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చెప్పారు. ఈ కోడ్‌లు ఆత్మనిర్భర భారత్‌కు పునాది లాంటివని అన్నారు. భారత్‌లోని కార్మిక చట్టాలు స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో అంటే 1930లు-1950ల్లో రూపొందించినవని.. అప్పట్లో ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ పని విధానాలు పూర్తి భిన్నంగా ఉండేవని మాండవీయ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. చాలా దేశాలు ఇప్పటికే తమ కార్మిక చట్టాలను సరళతరం చేసినా.. భారత్‌లో మాత్రం పాత చట్టాలే కొనసాగుతున్నాయన్నారు. అందుకే సరికొత్త కార్మిక కోడ్‌లను అమల్లోకి తెచ్చామని తెలిపారు. "ప్రతి కార్మికుడికీ గౌరవం కల్పించాలన్నది మోదీ సర్కారు హామీ. ఈ రోజు నుంచి కొత్త కార్మిక స్మృతులు దేశంలో అమల్లోకి వచ్చాయి" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ కోడ్‌లతో కార్మికులందరికీ కనీస వేతనాలు లభిస్తాయని, యువతకు నియామక పత్రాలు అందుతాయని, మహిళలకు సమాన వేతనాలు, గౌరవం లభిస్తుందని, 40 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని, ఫిక్స్‌డ్ టెర్మ్ ఉద్యోగులకు ఏడాది పనిచేసిన తర్వాత గ్రాట్యుటీ వంటివి దక్కుతాయని వివరించారు. "ఈ సంస్కరణలు సాధారణ మార్పులు కాదు. కార్మికుల సంక్షేమం కోసం ప్రధాని మోదీ తీసుకున్న అతిపెద్ద చర్య. స్వయం సమృద్ధ భారత్ దిశగా కీలక ముందడుగు. 2047కల్లా అభివృద్ధి చెందిన భారత్‌గా నిలవాలన్న లక్ష్యానికి ఊతం" అని మాండవీయ పేర్కొన్నారు.

నాలుగు స్మృతుల్లో కీలక అంశాలు..

- ఉద్యోగులందరికీ నియామక పత్రాలు తప్పనిసరి. దీంతో ఉద్యోగ భద్రత, పారదర్శకత, స్థిరమైన ఉపాధికి హామీ లభిస్తుంది.
- గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులు సహా ఉద్యోగులందరికీ సామాజిక భద్రత (పీఎఫ్, ఈఎస్ఐసీ, బీమా మొదలైనవి) కల్పించాలి.
- ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు (ఎఫ్‌టీఈ) శాశ్వత ఉద్యోగులతో సమానంగా ప్రయోజనాలు కల్పించాలి. ఎఫ్‌టీఈలు ఐదేళ్లకు బదులు కేవలం ఏడాది సర్వీసు పూర్తిచేస్తే గ్రాట్యుటీకి అర్హులు.
- కార్మికులందరికీ కనీస వేతనం ఇక చట్టబద్ధమైన హక్కు. యజమానులు సకాలంలో వేతనాలు చెల్లించడం తప్పనిసరి. అనధికారికంగా ఎలాంటి కోతలూ విధించకూడదు.
- బీడీ, సిగరెట్లు, మైనింగ్ పరిశ్రమల్లో రోజుకు 8-12 గంటల వరకు పనిచేయొచ్చు. వారానికి 48 గంటలు మించొద్దు. 30 రోజుల పని పూర్తి చేసుకుంటే బోనస్‌కు అర్హత ఉంటుంది.
- 40 ఏళ్ల పైబడిన ఉద్యోగులందరికీ యాజమాన్యాలు ఏటా ఉచితంగా వైద్య పరీక్షలు చేయించడం తప్పనిసరి.
- సమాన పనికి సమాన వేతనం తప్పనిసరి. ట్రాన్స్‌జెండర్ సహా లింగ వివక్ష ఉండరాదు.
- సాధారణ పని గంటలకు మించి (ఓవర్ టైమ్) పని చేస్తే రెగ్యులర్ వేతనానికి రెట్టింపు చెల్లించాలి.
- అన్ని షిఫ్టుల్లో, అన్ని రకాల పనుల్లో (భూగర్భ గనులు సహా) పనిచేయడానికి మహిళలకు అనుమతి. అవసరమైన భద్రతా చర్యలతో పాటు వారి సమ్మతి తప్పనిసరి.
- మహిళా ఉద్యోగుల కుటుంబంలో అత్తమామలకు చోటు. తద్వారా 'డిపెండెంట్ కవరేజ్' పెరుగుతుంది.
- గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు తొలిసారి చట్టంలో నిర్వచనం. గిగ్ వర్కర్ అంటే సాధారణ, సంప్రదాయ యాజమాన్యాలు ఏర్పాటు చేసే ఆఫీసుల్లో పనిచేసేవారు కాదు. ప్లాట్‌ఫాం వర్కర్ అంటే ఆన్‌లైన్ వేదికల ద్వారా సేవలందించేవారు. ఆన్‌లైన్ అగ్రిగేటర్ అంటే.. సేవలందించేవారికి, వినియోగదారులకు మధ్య అనుసంధానకర్త.
- అగ్రిగేటర్లు (ఉబెర్, ఓలా, స్విగ్గీ వంటి సంస్థలు) తమ వార్షిక టర్నోవర్‌లో 1-2% (కార్మికులకు చెల్లించే మొత్తంలో 5% వరకు) సామాజిక భద్రత నిధికి కేటాయించడం తప్పనిసరి.
- ఆధార్ అనుసంధానిత 'యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్)' ద్వారా సామాజిక భద్రత ప్రయోజనాలు రాష్ట్రాల మధ్య వలసలతో సంబంధం లేకుండా పోర్టబుల్‌గా ఉంటాయి.
- జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్లు, డబ్బింగ్ కళాకారులు, మీడియా వృత్తి నిపుణులు కూడా కార్మిక రక్షణ విధివిధానాల పరిధిలోకి వస్తారు. నియామక పత్రాలు, వేతనాల భద్రత, పని వేళల నియంత్రణ తప్పనిసరి.
- కాంట్రాక్ట్, వలస కార్మికులకు కూడా సమాన వేతనాలు, సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలన్నీ అందించాలి. కాంట్రాక్ట్ సిబ్బందికి యాజమాన్యాలు సామాజిక భద్రత కల్పించాలి. తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలి.

లోకం తీరు



జీవితంలో ఒక్కసారైనా భర్త వేధింపులు

» భారత్‌లోని మహిళల్లో 30% బాధితులే

న్యూఢిల్లీ, నవంబరు 21 : మనదేశంలోని మహిళల్లో 30% మంది తమ జీవిత కాలంలో ఒక్కసారైనా భర్తల వేధింపులకు గురి అవుతున్నారని డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. 2023లో 15-49 ఏళ్ల మధ్య ఉన్న మహిళల్లో కనీసం యాభై శాతం మంది మగడి హింసను ఎదుర్కొన్నారని తెలిపింది. ఇక ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు, అంటే కనీసం 84 కోట్ల మంది, భర్తల వేధింపులను లేక లైంగిక హింసను జీవితకాలంలో చవి చూస్తున్నారని, 15-49 ఏళ్ల మధ్య ఉన్న మహిళల్లో 8.4% మంది ఇతరుల హింసకు (భర్త కాకుండా) గురి అవుతున్నారని పేర్కొంది. భారత్ సహా 165 దేశాల్లో దీనిపై 2000 నుంచి 2023 వరకు అధ్యయనం జరిపి నివేదిక రూపంలో డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసింది. ఈ నివేదికను అనుసరించి, భారత్‌లో 15 ఏళ్లు, ఆపై వయసు మహిళల్లో నాలుగు శాతం మందికి ఇతరుల నుంచి (జీవిత భాగస్వామి కాదు) లైంగిక వేధింపులు ఎదురవుతున్నాయి. ఏటా నవంబరు 25ను బాలికలు, మహిళలపై వేధింపులు, లైంగిక హింస వ్యతిరేక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగానే ఈ నివేదికను డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసింది. 2030 నాటికి మహిళలపై అన్నిరకాల హింసను నిర్మూలించాలనే లక్ష్యసాధనలో పెద్ద పురోగతి లేదని ఈ నివేదిక పెదవి విరిసింది. 2000కు ముందు ఉన్న పరిస్థితుల్లో, ఆ తర్వాత కూడా పెద్దగా మార్పు కనిపించలేదని వివరించింది.

ఢిల్లీ పేలుళ్లకు టర్కీ, పాక్, సిరియా లింక్

న్యూఢిల్లీ, నవంబరు 21: ఢిల్లీలో ఈ నెల 10న జరిగిన కారు పేలుడు ఘటనకు టర్కీ, పాకిస్థాన్, సిరియా లింక్ ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. కారు పేలుడులో ఆత్మాహుతికి పాల్పడిన ఉమర్ నబి 2022లో టర్కీలో 20 రోజుల పాటు పర్యటించినట్లు గుర్తించారు. ఇదే కేసులో సహ నిందితులైన ముజమ్మిల్ షకీల్, ముజఫర్ రాథెర్, ఉమర్‌తో కలిసి టర్కీలో పర్యటించినప్పుడు సిరియాకు చెందిన ఆపరేటివ్‌తో సమావేశమయ్యారు. జైష్ ఎ మహ్మద్‌కు చెందిన పాక్ హ్యాండ్లర్ ఉకాష ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బాంబుల తయారీ, ఉగ్రదాడుల ప్రణాళికలపై చర్చలు జరిపారు. ఆ తర్వాత ముజఫర్ అఫ్గానిస్థాన్ వెళ్లి అల్ ఖైదాలో చేరినట్లు అనుమానిస్తున్నారు. ఉమర్ కూడా అఫ్గాన్ వెళ్లాలనుకున్నా భారత్‌కు తిరిగి వెళ్లాలని జైష్ ఎ మహ్మద్ ఆదేశించింది. భారత్‌కు తిరిగివచ్చాక అల్‌ఫలా వర్సిటీలో చేరి బాంబుల తయారీతో పాటు ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఉమర్‌కు బాంబుల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు జైష్ ఎ మహ్మద్‌కు చెందిన పాకిస్థాన్ హ్యాండ్లర్ హంజుల్లా 42 వీడియోలు పంపారు. ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా ఈ వీడియోలను పంపినట్లు అధికారులు గుర్తించారు. ముజమ్మిల్ పిండిమర ద్వారా యూరియాను గ్రైండ్ చేసినట్లు అధికారులు గుర్తించారు. యూరియాను పిండిమరలో మెత్తగా రుబ్బి, కొన్ని యంత్రాలతో రీఫైన్ చేసి బాంబులకు కావాల్సిన కెమికల్స్ సిద్ధం చేసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఫరీదాబాద్ నుంచి అధికారులు కొన్ని యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు గాజాలో హమాస్ తరహాలో జమ్మూకశ్మీర్‌లో ఆసుపత్రుల కింద ఆయుధ డంప్‌లు ఏర్పాటు చేసుకునేందుకు ఉగ్రవాదులు కుట్రలు పన్నినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇందుకోసం శ్రీనగర్, అనంత్‌నాగ్, బుద్గామ్, నౌగామ్ ప్రాంతాల్లోని ఆసుపత్రులను పరిశీలించారు. విదేశాల నుంచి తెప్పించుకున్న ఆయుధాలను ఆసుపత్రుల కింద దాచాలని కుట్రపన్నారు.

దుబాయ్ ఎయిర్‌షోలో కూలిన తేజస్

పైలట్ దుర్మరణం



వింగ్ కమాండర్ నమాన్ష్

» ప్రదర్శన చివరి రోజు ఘటన..

న్యూఢిల్లీ, నవంబరు 21: ప్రపంచంలోనే అతిపెద్దదైన, దుబాయ్ వేదికగా జరుగుతున్న ఎయిర్ షోలో చివరిరోజు ఘోర ప్రమాదం సంభవించింది. భారత వాయుసేనకు చెందిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్-ఎమ్‌కే1 కూలిపోయింది. అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గాల్లోకి లేచిన తేజస్, నింగిలో విన్యాసాలు చేస్తుండగానే నేరుగా కిందికి జారింది. ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరైన జనం చూస్తుండగానే ఆ యుద్ధ విమానం నేలను తాకి పేలిపోయింది. ఈ ఘటనలో పైలట్ తీవ్రగాయాలతో మృతిచెందినట్లు భారత వాయుసేన ప్రకటించింది. పైలట్ కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొంది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేస్తామని తెలిపింది. హాల్ అభివృద్ధి చేసిన సింగిల్ సీటర్ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎల్‌సీఏ) ఇది. నెగెటివ్ జీ-ఫోర్స్ (గురుత్వాకర్షణకు వ్యతిరేక దిశలోని శక్తి) టర్న్ నుంచి యుద్ధవిమానాన్ని వెనక్కి మళ్లించే క్రమంలో పైలట్ విఫలమవ్వడంతోనే ఈ ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నారు. దుబాయ్ కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 2:15 గంటలకు ఈ ఘటన జరిగింది. 2001 జనవరి 4న తేజస్ మొదటిసారి గాల్లోకి లేచాక అంటే గత 24 ఏళ్లలో ఈ తేలికపాటి యుద్ధ విమానాలు కూలిపోవడం ఇది రెండోసారి. గత ఏడాది మార్చి 12న.. త్రివిధ దళాల ఆధ్వర్యంలో శిక్షణా విన్యాసాలు నిర్వహిస్తుండగా పోఖ్రాన్‌కు 100 కి.మీ దూరంలోని రాజస్థాన్ జైసల్మేర్‌లోని జనావాసాల సమీపంలో తేజస్ కూలిపోయింది. పారాచూట్ ద్వారా బయటపడటంతో పైలట్ ప్రాణాలు దక్కాయి. నవంబరు 17న మొదలైన దుబాయ్ ఎయిర్ షో శుక్రవారమే ముగిసింది.

అది డ్రెయినింగ్ ప్రక్రియలో భాగమే

దుబాయ్ ఎయిర్ షోలో తేజస్ నుంచి ఆయిల్ లీక్ అవుతున్నట్లుగా సామాజిక మాధ్యమాల కేంద్రంగా పాక్ వీడియోలు షేర్ చేసింది. అలాంటిదేమీ లేదని కేంద్రం గురువారమే స్పష్టం చేసింది. అయితే ఆ మర్నాడే.. అంటే శుక్రవారమే ఎయిర్ షోలో తేజస్ కూలిపోవడంతో 'ఆయిల్ లీకేజీ' వార్తల వెనుక వాస్తవం ఏమిటి? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ బృందం ప్రకారం.. తేజస్ నుంచి ఏ దశలోనూ ఆయిల్ లీకేజీ జరగలేదు. వీడియోల్లో తేజస్ ల్యాండింగ్ వీల్స్ వద్ద కనిపిస్తున్న ద్రవం.. విమానం టేకాఫ్‌కు ముందు సహజంగా నిర్వహించే డ్రెయినింగ్ ప్రక్రియలో భాగంగా బయటపడిందేనని పీఐబీ బృందం పేర్కొంది. తేజస్‌లో ఎలాంటి సాంకేతిక లోపం తలెత్తలేదని పీఐబీ బృందం స్పష్టం చేసింది. ఈ క్రమంలో ప్రజలకు కేంద్ర సర్కారు కీలక సూచన చేసింది. దేశ రక్షణ సామర్థ్యంపై అనుమానాలను రేకెత్తించేలా కొందరు ఉద్దేశపూర్వకంగా ఇలా తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని, ఇలాంటివి షేర్ చేసేముందు వాస్తవాలు నిర్ధారించుకోవాలని సూచించింది.

మరి ఎలా కూలింది?

ఎయిర్ షో విన్యాసాల్లో భాగంగా తేజస్ పైలట్ 'బారెల్ రోల్' అనే విన్యాసాన్ని ప్రదర్శిస్తుండగా ప్రమాదం సంభవించింది. బారెల్ రోల్‌లో భాగంగా విమానం గాల్లోనే నిలువుగా 360 డిగ్రీలు చుడుతుంది. ఇలా గిరగిరా తిరగడం సంక్లిష్టమైన ప్రక్రియ కానప్పటికీ ఈ విన్యాసంలో పైలట్ క్షణకాలం తలకిందులుగా ఉంటాడు. శుక్రవారం ఎయిర్ షోలో భాగంగా పైలట్.. ఈ కచ్చితమైన లూప్‌నకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో మొదట పైకి ఎగసి.. తర్వాత తలకిందులుగా వెళ్లి.. మళ్లీ పైకి ఎగిసే క్రమంలో ప్రమాదం సంభవించింది. విమానాన్ని మళ్లీ పైకి లేపే క్రమంలో వేగం సరిపోకపోవడంతోనే కూలిపోయి ఉండొచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంజిన్‌లో మంటలు చెలరేగడం వల్లే కూలిపోయి ఉండొచ్చుననీ భావిస్తున్నారు.

అజిత్ దోవల్ వ్యాఖ్యలపై వివాదం!

» ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో 11 ఏళ్ల నాటి వీడియో క్లిప్ వెలుగులోకి

» 'ఐఎస్ఐ నియామకాల్లో 80 శాతం హిందువులే'నన్న వ్యాఖ్యలు వైరల్



న్యూఢిల్లీ, నవంబరు 20: ప్రస్తుత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ 2014లో (అప్పటికింకా ఆయన ఆ పదవి చేపట్టలేదు) ఓ సమావేశంలో చేశారని చెబుతున్న వ్యాఖ్యలు తాజాగా వివాదాస్పదమయ్యాయి. 2014 మార్చి 11న 'ఆస్ట్రేలియా ఇండియా ఇన్‌స్టిట్యూట్' అనే సంస్థ 'ప్రపంచానికి ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన ఓ సదస్సులో అజిత్ దోవల్ ప్రసంగించారు. గంటా 17 నిమిషాలపాటు ఉన్న ఆ ఉపన్యాసాన్ని అదే సంస్థ యూట్యూబ్‌లో అప్పట్లోనే అప్‌లోడ్ చేసింది. ఉగ్రవాదానికి మతంతో సంబంధం లేదని, హిందువులు వర్సెస్ ముస్లింలు అన్న కోణంలో కాకుండా.. దేశ సమస్యగా ఉగ్రవాదాన్ని చూడాలంటూ దోవల్ ఆ ప్రసంగంలో ప్రముఖంగా పేర్కొన్నారు. ఇదే క్రమంలో 'భారత్‌లో నిఘా కార్యకలాపాల కోసం పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ నియమించుకుంటున్న భారతీయుల్లో ముస్లింలకంటే హిందువులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 1947 నుంచి ఉన్న 4 వేలకుపైగా కేసులను పరిశీలిస్తే వాటిల్లో 20 శాతం కేసులు కూడా ముస్లింలకు సంబంధించినవి లేవు' అని చెప్పినట్లుగా ఉంది. తాజాగా, ఈ వ్యాఖ్యలతో కూడిన వీడియో క్లిప్ వైరల్ అయ్యింది. ఇటీవలి ఢిల్లీ కారు పేలుడు ఉగ్ర ఘటన నేపథ్యంలో.. ముస్లింలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విద్వేషపూరిత ప్రచారం కొనసాగింది. దీనికి వ్యతిరేకంగా.. 11ఏళ్ల నాటి అజిత్ దోవల్ మాటలతో కూడిన వీడియో క్లిప్ ముందుకొచ్చింది. ఇది వైరల్ అవుతున్న నేపథ్యంలో.. అజిత్ దోవల్ స్పందిస్తూ.. తాను అలా మాట్లాడలేదని, అది డీప్‌ఫేక్ వీడియో అని పేర్కొన్నారు.

అది నకిలీ వీడియో కాదు!

సదరు క్లిప్ ఉన్న వీడియోను మొత్తంగా పరిశీలించిన ఫ్యాక్ట్‌చెక్ వెబ్‌సైట్ ఆల్ట్‌న్యూస్ మాత్రం.. అది ఫేక్ వీడియో కాదని తమ పరీక్షలో తేలిందని వెల్లడించింది. ఇదే వీడియోలో దోవల్ మాట్లాడిన ఇతర అంశాలను ఆల్ట్‌న్యూస్ ప్రస్తావించింది. ఇస్లామిక్ ఉగ్రవాదం వల్ల నష్టపోతున్న వారిలో 90% మంది ముస్లింలేనని, 10% మంది మాత్రమే ఇతరులని.. ఈ విషయం సదరు ఉగ్రవాదులకు కూడా తెలుసని దోవల్ పేర్కొన్నారు. భారతీయ ముస్లింలు ఉగ్రవాదాన్ని ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉన్నారని చెబుతూ.. 2012లో ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో 50వేల మంది మౌలానాలు సమావేశమై ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఫత్వా జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటువంటి పని ఏ హిందూ సంస్థ కూడా చేయలేదని దోవల్ వ్యాఖ్యానించినట్లు ఆల్ట్‌న్యూస్ పేర్కొంది.

కర్ణాటకలో హైడ్రామా!

» ఢిల్లీ వెళ్లిన డీకే ఆప్త ఎమ్మెల్యేలు

» ఆ విషయం తనకు తెలియదన్న డీకే

» 'మార్పుపై' నిర్ణయం అధిష్ఠానానిదే: సిద్దరామయ్య



బెంగళూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజకీయాల్లో హైడ్రామా చోటు చేసుకుంది. సీఎం మార్పుపై చర్చ తీవ్రమైన వేళ.. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని, మరో రెండేళ్లు తానే బడ్జెట్ ప్రవేశపెడతానని సీఎం సిద్దరామయ్య చెప్పారు. ఈ ప్రకటన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆప్తులలో ఆగ్రహం పెల్లుబికేలా చేసింది. ఈ పరిణామాల క్రమంలో ఆయనకు సన్నిహితులైన ఎమ్మెల్యేలు గురువారం ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేని కలిశారు. మంత్రి చలువరాయస్వామితోపాటు మరింతమంది శుక్రవారం ఢిల్లీకి వెళ్లారు. ఇదే సమయంలోనే చక్కెర శాఖ మంత్రి శివానందపాటిల్ ఢిల్లీ వెళ్లడం సరికొత్త చర్చలకు దారితీసింది. ఢిల్లీ వెళ్లిన మంత్రులతోపాటు ఎమ్మెల్యేలకు సిద్దరామయ్య నేరుగా ఫోన్ చేసి మాట్లాడినట్టు తెలుస్తోంది. మైసూరులో సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ.. నాయకత్వ మార్పు లేదా కేబినెట్ విస్తరణపై అధిష్ఠానానిదే తుది నిర్ణయమని అన్నారు. ఖర్గే శనివారం బెంగళూరుకు వస్తున్నారని, తాను స్వయంగా వెళ్లి కలుస్తానని అన్నారు. సిద్దరామయ్యకు ఆప్తులుగా పేరొందిన ముఖ్యులు డిన్నర్ మీటింగ్ నిర్వహించడం సరికొత్త చర్చకు దారితీసింది. మంత్రి సతీశ్ జార్కిహొళి తన నివాసంలో గురువారం రాత్రి విందు ఇచ్చారు.

ఎమ్మెల్యేలంతా నావాళ్లే: డీకే

గ్రూపు రాజకీయాలు తన రక్తంలోనే లేవని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలంతా తనవాళ్లేనని చెప్పారు. తనకు ప్రత్యేకమైన గ్రూపులు, ఆప్తులు లేరన్నారు. సీఎం సిద్దరామయ్య ఐదేళ్లు అధికారంలో ఉంటానన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ, 'చాలా సంతోషం, కాదన్నది ఎవరు?. ఆయనకు మా మద్దతు ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. తాను ఎవరినీ ఢిల్లీకి పంపలేదని, తనకు ఆ విషయం తెలీదని అన్నారు. అయితే, "ఎక్కడైతే కృషి ఉంటుందో.. అక్కడే ఫలాలు ఉంటాయి. ఎక్కడైతే భక్తి ఉంటుందో.. అక్కడే భగవంతుడు ఉంటాడు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

రూ.10వేలు లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ


డీఈ సంధ్యారాణి

పాలకుర్తి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.సంధ్యారాణి ఏసీబీకి పట్టుబడింది. ఆమెతోపాటు మరో ఉద్యోగిపైనా అధికారులు కేసు నమోదు చేశారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కాంట్రాక్టర్ కమ్మగాని సురేష్ దేవరుప్పుల మండలంలోని చిన్నమడూరు, పెద్దమడూరు, కోలుకొండ, అప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంలో పైపులైన్ పనులు చేపట్టారు. అవి పూర్తయి ఆరేళ్లు గడిచినా బిల్లుల చెల్లింపులో అధికారులు జాప్యం చేశారు. బిల్లులు మంజూరవడానికి ఎంబీ రికార్డు చేయాల్సి ఉంది. ఈమేరకు కాంట్రాక్టర్ పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.సంధ్యారాణిని కోరారు. చివరకు రూ.10వేలు ఇస్తేనే రూ.1.05లక్షల బిల్లులకు అనుమతిస్తానని డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం సంధ్యారాణి చెప్పిన మేరకు కార్యాలయంలోని ప్రైవేటు ఉద్యోగి మహేందర్‌కు లంచం సొమ్ము ఫోన్‌పే చేసి స్క్రీన్‌షాట్‌ను ఆమెకు పంపారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు సంధ్యారాణిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె సెల్‌ఫోన్‌తోపాటు ప్రైవేటు ఉద్యోగి మహేందర్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రెవెన్యూ అధికారులను నిర్బంధించిన రైతులు

- ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంలో ఎకరాకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్

పుల్‌కల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ నిర్మాణంతో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు.. పరిహారం చెల్లింపుపై నోటీసులు అందజేసేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులను రైతులు నిర్బంధించారు. ఎకరానికి రూ. కోటి రూపాయాల పరిహారం చెల్లిస్తేనే, నోటీసులు తీసుకుంటామంటూ అధికారులకు తేల్చి చెప్పారు. చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో భూ సేకరణ పనులు పూర్తి చేసిన అధికారులు రెండో, మూడవ విడత పరిహారం నోటీసులు ఇచ్చేందుకు శుక్రవారం గ్రామానికి వెళ్లారు. ప్రభుత్వం ఎకరానికి రూ.16 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తుందని, నోటీసులు తీసుకోవాలంటూ రైతులకు సూచించారు. దీంతో ఆగ్రహించిన రైతులు.. అధికారులను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి.. కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఎకరానికి రూ.75 లక్షలు చెల్లిస్తామని అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు ఇచ్చిన హామీ మేరకే సర్వే పనులకు సహకరించామని, ఇప్పుడు మాట మార్చడమేంటని ప్రశ్నించారు. ఆర్డీవో వచ్చే వరకు అధికారులను వదిలేది లేదంటూ నినాదాలు చేశారు. గ్రామానికి చేరుకున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్.. రైతులకు నచ్చజెప్పి వారిని విడిపించారు. ఆర్డీవో పాండుకు ఫోన్‌లో సమస్యను వివరించగా.. నష్ట పరిహారం రెట్టింపు చేయాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, సమస్యను పరిష్కారమయ్యేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

పత్తి రైతుల ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని జాతీయ రహదారిపై బైఠాయింపు
- హైదరాబాద్-నాగపూర్ హైవేపై నిలిచిన రాకపోకలు


రహదారిపై బైఠాయించిన మాజీమంత్రి జోగు రామన్న, అఖిల పక్షం నేతలు

ఆదిలాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలంటూ పత్తి రైతులు ఆదిలాబాద్ జిల్లా బోరజ్ మండలంలో శుక్రవారం జాతీయ రహదారిపై బైఠాయించారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి భారీ ఎత్తున రైతులు తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో హైదరాబాద్-నాగపూర్ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్డు పైనే రొట్టెలు తింటూ రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీమంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. సీసీఐ విధించిన ఏడు క్వింటాళ్ల పరిమితి, ఇతర నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. కపాస్ కిసాన్ యాప్‌తో పాటు బయోమెట్రిక్ విధానాన్ని తొలగించాలన్నారు. సీసీఐ విధిస్తున్న కఠినమైన నిబంధనల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తేమ శాతాన్ని 20 నుంచి 22 శాతానికి పెంచాలని కోరారు. ఇంత జరుగుతున్నా బీజేపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం లేదన్నారు. షరతులు విధించకుండా పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, రైతు సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్-బీజాపూర్.. రోడ్డుపై ఘోర ప్రమాదం

- రెండు కార్లు ఢీకొని ఇద్దరి మృతి.. పలువురికి గాయాలు
- రంగారెడ్డి జిల్లా కనకమామిడి స్టేజీ సమీపంలో ఘటన



మొయినాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఘటనా స్థలంలోనే ఒకరు, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి స్టేజీ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్ రెడ్డి, స్థానికులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా కల్యాణదుర్గంకు చెందిన కరీం(37) కొన్నేళ్లుగా హైదరాబాద్ నగరంలో ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. జగద్గిరిగుట్టకు చెందిన ఫొటోగ్రాఫర్ బాబురావు, కుత్బుల్లాపూర్‌కు చెందిన షేక్ అకీల్, బంజారాహిల్స్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ లోకేశ్(24) ఓ ఫొటో షూట్‌కు వెళ్లేందుకు శుక్రవారం ఉదయం కరీం క్యాబ్ కారులో బయలుదేరారు. కారు మొయినాబాద్ దాటిన తరువాత రాంగ్‌రూట్‌లోకి వెళ్లి ఎదురుగా తాండూరు నుంచి వస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో రెండు కార్ల ముందు బాగాలు నుజ్జునుజ్జయ్యాయి. క్యాబ్ డ్రైవర్ కరీం అందులోనే ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. క్యాబ్‌లో ఉన్న లోకేశ్‌కు తీవ్ర గాయాలు కాగా బాబూరావు, అకీల్‌కు స్వల్పగాయాలయ్యాయి. లోకేశ్(24) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో కారులో తాండూరు నుంచి హైదరాబాద్ వస్తున్న డాక్టర్ వంశీధర్‌రెడ్డి, వారి బంధువులు సుజాత, రోజా, డ్రైవర్ వెంకట్ ఉన్నారు. ఇందులో డ్రైవర్ వెంకట్‌కు తీవ్ర గాయాలు కాగా సుజాత, రోజాకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి కార్లలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశ్చిమ భారత వైభవానికి వేదిక

'భారతీయ కళా మహోత్సవం' ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ముర్ము.. రాష్ట్రపతి నిలయంలో 9 రోజుల పాటు ప్రదర్శన

- నేటి నుంచి ప్రజలకు ఉచిత ప్రవేశం
- బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతిని స్వాగతించిన గవర్నర్, సీఎం


రాష్ట్రపతి నిలయంలో ద్రౌపది ముర్ముతో గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, అశోక్ గజపతిరాజు, హరిభాఊ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, గజేంద్రసింగ్ షెకావత్, రాష్ట్ర మంత్రి సీతక్క తదితరులు

హైదరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమ భారత రాష్ట్రాల సంస్కృతిని ప్రత్యక్షంగా తెలుసుకునే అరుదైన అవకాశం భారతీయ కళా మహోత్సవం రూపంలో తెలంగాణ ప్రజలకు లభించిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాష్ట్రపతి నిలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, కేంద్ర పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 2వ భారతీయ కళా మహోత్సవాలను రాష్ట్రపతి ముర్ము శుక్రవారం ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ మహోత్సవంలో గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ రాష్ట్రాల సంప్రదాయ కళలు, సంగీతం, నృత్యం, సాహిత్యం, చేతివృత్తులు, వంటకాల వైభవాన్ని ప్రదర్శిస్తారు. ఈ ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. మొదటి విడత భారతీయ కళా మహోత్సవంలో ఈశాన్య భారత సంస్కృతిని ప్రజలకు పరిచయం చేశామని, ఈసారి పశ్చిమ భారత వైభవాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉందన్నారు. ఈ మహోత్సవం ద్వారా ప్రజలు ఆ ప్రాంతాల జానపద కళలు, హస్తకళలు, సంగీతం, వంటకాల కోసం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ తరహా కార్యక్రమాలు దేశంలోని విభిన్న ప్రాంతాల ప్రజల మధ్య పరస్పర అవగాహన పెంచుతాయని రాష్ట్రపతి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఉంటూ ఇతర రాష్ట్రాల సంస్కృతిని తెలుసుకునే అరుదైన అవకాశం ఈ భారతీయ కళా మహోత్సవం ద్వారా లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాజస్థాన్ గవర్నర్ హరిబౌ బగ్డే, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు, రాష్ట్ర మంత్రి సీతక్క, గుజరాత్ మంత్రి నరేష్ మగన్‌భాయ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భారతీయ కళా మహోత్సవానికి శనివారం నుంచి ప్రజలను అనుమతిస్తామని, ఈ నెల 30వరకు ఉత్సవాలు జరుగుతాయని రాష్ట్రపతి నిలయం అధికారులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మహోత్సవానికి ప్రజలను అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు.

రాష్ట్రపతికి ఘన స్వాగతం

బేగంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం మధ్యాహ్నం 1.50 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు స్వాగతం పలికారు.

శ్రీవారి సేవలో రాష్ట్రపతి

తిరుమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ముర్ము శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి గురువారం సాయంత్రం చేరుకున్న ముర్ము రాత్రి తిరుమలలోనే బస చేశారు. శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న రాష్ట్రపతికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనం అనంతరం అతిథిగృహానికి తిరుగు ప్రయాణంలో ముర్ము.. రాంభగీచ సర్కిల్ వద్ద భక్తులను చూసి వాహనాన్ని ఆపారు. భక్తుల వద్దకు వెళ్లి పలకరించారు.

'ట్రస్ట్' లేకుండా మేడారం జాతర?

- ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుపై సర్కారు మౌనం
- ఈసారీ పునరుద్ధరణ కమిటీ వేసే యోచన
- రూ.251 కోట్లతో అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్
- నిధుల సద్వినియోగంపై సందేహాలు



వరంగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మహాజాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. మేడారం బృహత్ ప్రణాళిక పేరుతో రూ.251 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతోంది. శాశ్వత సౌకర్యాల కల్పనతో పాటు తల్లుల గద్దెల సాలారం డిజైన్‌లో మార్పులు, విస్తరణకు శ్రీకారం చుట్టింది. పలు కీలకమైన అభివృద్ధి ఘట్టాలకు ఈ వేడుక వేదిక కాబోతోంది. వీటి పర్యవేక్షణకు ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయాల్సిన దేవాదాయశాఖ ఆవైపే దృష్టి పెట్టలేదు. మహాజాతరకు ఆర్నెల్లు ముందే ఇందుకు నోటిఫికేషన్ ఇవ్వాలి. వచ్చే జనవరి 28 నుంచి వనదేవతల పండగ ప్రారంభం కానుండడం గమనార్హం. దీంతో సమయం లేదని పునరుద్ధరణ కమిటీతో మమ అనిపిస్తారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దేవాదాయశాఖ ఆంతర్యమేంటి?

రెండేళ్లకోసారి జరిగే మహా జాతరను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం గిరిజనులతో కూడిన ట్రస్ట్‌బోర్డును ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వం మంజూరు చేసే నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, జాతర సమయంలో ఏర్పాట్లను పరిశీలించి.. సాఫీగా సాగేందుకు ట్రస్ట్ బోర్డు సభ్యులు కృషి చేస్తారు. గతంలో 9మందితో ఉండే వీరి సంఖ్య పెరుగుతూ వచ్చింది. 2018లో బోర్డు అధ్యక్షుడు కాక లింగయ్యతో పాటు 14మంది సభ్యులను, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావును ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా నియమించారు. వచ్చే జనవరి 28 నుంచి 31 వరకు మహాజాతర జరగనుంది. ఇప్పటికే ప్రభుత్వం సౌకర్యాల కల్పనకు రూ.150 కోట్లు కేటాయించింది. ఈ నేపథ్యంలో ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వాల్సిన దేవాదాయశాఖ మౌనంగా ఉండటంలో ఆంతర్యమేంటనే చర్చ నడుస్తోంది.

ఐదుసార్లు కమిటీ లేకుండానే..

గత పుష్కర కాలంలో ఆరు జాతర్లు జరగగా, వీటిలో ఐదింటిని ట్రస్ట్ బోర్డు కమిటీ లేకుండానే నిర్వహించారు. గతంలో అధికారపార్టీ నేతలు కమిటీపై ఆధిపత్యానికి వెంపర్లాడి కమిటీ లేకుండానే నిర్వహించి విమర్శలు ఎదుర్కొన్నారు. 2014లో అప్పటి అధికార కాంగ్రెస్‌లో విభేదాల వల్ల కమిటీని నియమించలేదు. దీంతో గద్దెల వద్ద సమ్మక్క-సారలమ్మల ప్రసాదం (బెల్లం) పంపిణీలో, తలనీలాల సేకరణ, క్యూ లైన్ల ఏర్పాటు, కొబ్బరికాయల అమ్మకం, గద్దెల వద్ద బెల్లం తొలగింపు వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. 2016లోనూ బీఆర్‌ఎస్‌లో నెలకొన్న విభేదాల వల్ల బోర్డు ఏర్పాటు కాలేదు. మూడు నెలల ముందు పునరుద్ధరణ పేరుతో కమిటీ వేసి మమ అనిపించారు. 2018లో మాత్రం బోర్డును మూడు నెలల ముందే నియమించారు. తర్వాత ఆ ఊసే లేదు. దీంతో పర్యవేక్షణ కొరవడి కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలు వచ్చాయి. ఈసారీ పునరుద్ధరణ కమిటీ వేస్తే నిర్వహణ మినహా ఎలాంటి అధికారాలు ఉండవు. పాలకమండలి పర్యవేక్షణ లేకపోతే అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తూట్లు పడే అవకాశం ఉందని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

మాస్టర్ ప్లాన్ నిధులపై పర్యవేక్షణ ఎలా..?

రాష్ట్ర ప్రభుత్వం 2024లో జరిగిన మహాజాతరకు రూ.115 కోట్లు కేటాయించింది. అప్పుడు నెలన్నర వ్యవధే ఉండటంతో నిధులన్నింటినీ వినియోగించలేదు. అప్పటికే వివిధ శాఖల ద్వారా జరిగిన పనులను మమ అనిపించి నిధులు గోల్‌మాల్ చేశారనే ప్రచారం జరిగింది. అయినా సుమారు రూ.25 కోట్లు మిగలడంతో శాశ్వత రోడ్ల నిర్మాణం చేపట్టారు. తాజాగా మాస్టర్ ప్లాన్ పేరిట సర్కారు రూ.150 కోట్లు కేటాయించింది. ఈ పనులకు టెండర్లు పూర్తి కావస్తున్నాయి. గద్దెల సాలారం విస్తరణ, తల్లుల గద్దెల డిజైన్ మార్పునకు రూ.101 కోట్లు కేటాయించింది. వీటితో పాటు ఒకే వరుసలో పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలను నిర్మిస్తున్నారు. జంపన్నవాగులో ఏడాదంతా నీళ్లుండేలా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు.

వణికిస్తున్న చలి

- సిర్పూర్(యు)లో 8.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత
- బజార్‌హత్నూర్‌లో 9.1 డిగ్రీలు

ఆసిఫాబాద్, సిరిసిల్ల, ఆదిలాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లోని ప్రజలు చలితో వణికిపోతున్నారు. పదిహేను రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలికి గజగజ లాడుతున్నారు. శుక్రవారం జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలో 8.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. తిర్యాణిలో 10.1, కెరమెరిలో 11.2, జైనూరులో 12.3, వాంకిడిలో 12.7, రెబ్బెనలో 12.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రజలు మంటలు వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో శుక్రవారం 10.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. గంభీరావుపేటలో 11.2 డిగ్రీలు, చందుర్తిలో 12, బోయిన్‌పల్లి 12.3, వేములవాడ రూరల్‌లో 12.3, వీర్నపల్లిలో 12.5, తంగళ్లపల్లిలో 12.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొద్ది రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. శుక్రవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 29.3 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 10.2 డిగ్రీలుగా నమోదయ్యాయి. అత్యల్పంగా బజార్‌హత్నూర్ మండలంలో 9.1, బోథ్ మండలం పొచ్చెరలో 9.9, సోనాలలో 10.6, నేరడిగొండలో 10.7, తాంసిలో 10.8, ఇచ్చోడలో 10.9, ఆదిలాబాద్ అర్బన్‌లో 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రేపు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా తెలంగాణలో ఆదివారం కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు చలి తీవ్రత కాస్త తగ్గింది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు రాగల 2-3 రోజుల్లో 13-18.6 డిగ్రీల మధ్య నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

సీఐ శంకరయ్య ఉద్యోగం తొలగింపు

- కర్నూలు రేంజ్ డీఐజీ ఉత్తర్వులు
- తన ప్రతిష్ఠకు భంగం కలిగించారంటూ ఇటీవల సీఎంకే శంకరయ్య నోటీసు

కర్నూలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందారెడ్డి హత్య జరిగిన రోజు సాక్ష్యాలు చెరిపేసినా వారించలేదని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, కేసు దర్యాప్తు కూడా సక్రమంగా చేయలేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి పులివెందుల సీఐ శంకరయ్యపై పోలీసు శాఖ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆయన్ను పోలీసు సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిస్మిస్‌కు గురైన శంకరయ్య ఈ ఏడాది సెప్టెంబరులో సీఎం చంద్రబాబుకు లీగల్ నోటీసులు పంపించి కలకలం రేపిన సంగతి తెలిసిందే. 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందులలో మాజీ మంత్రి వైఎస్ వివేకానందారెడ్డి తన ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో శంకరయ్య పులివెందుల సీఐగా ఉన్నారు. హత్యాస్థలిలో రక్తపు మరకలు శుభ్రం చేస్తున్నా.. సాక్ష్యాధారాలు చెరిపివేస్తున్నా అక్కడే ఉన్న శంకరయ్య అడ్డుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు పలుమార్లు బహిరంగ వేదికలపై ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీ సమావేశాల్లోనూ, కలెక్టర్లు, ఎస్పీల సదస్సుల్లోనూ శాంతి భద్రతలపై సమీక్షించే సమయంలో ఈ కేసును ప్రస్తావిస్తూ వచ్చారు. ఈ వ్యాఖ్యలు తన ప్రతిష్ఠకు భంగం కలిగించాయంటూ శంకరయ్య సెప్టెంబరు 18న సీఎం చంద్రబాబుకు లీగల్ నోటీసులు పంపడం.. 15 రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పకపోయినా.. లేదంటే వివరణ ఇవ్వకపోయినా.. రూ.1.45 కోట్లకు కోర్టులో పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించడం తెలిసిందే. ఓ సీఐ స్థాయి అధికారి ఏకంగా సీఎంకు లీగల్ నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమైంది.

స్థానిక ఎన్నికల దృష్ట్యా 32 మంది ఐపీఎస్‌ల బదిలీలు

- పలు జిల్లాల ఎస్పీలకు స్థానచలనం



హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్న క్రమంలో 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు జిల్లాల ఎస్పీలను బదిలీ చేశారు. జిల్లాల్లో ఎక్కువగా యువ ఐపీఎస్‌లను నియమించారు. మల్టీజోన్-2కు అదనపు డీజీగా ఉన్న దేవంద్ర సింగ్ చౌహాన్‌ను ఏడీజీ పర్సనల్‌గా నియమిస్తూ మల్టీజోన్-2 పర్యవేక్షణ అదనపు బాధ్యతగా అప్పగించారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో అడ్మిన్ విభాగం జాయింట్ కమిషనర్‌గా ఉన్న పరిమళ హన నూతన్ జాకబ్‌ను సీఐడీ డీఐజీగా నియమించారు. మహిళా భద్రతా విభాగం ఎస్పీగా ఉన్న ఖైలాబత్తుల చేతనను పోలీసు అకాడమీ డిప్యూటీ డైరక్టర్‌గా బదిలీ చేశారు. వికారాబాద్ ఎస్పీగా ఉన్న కె.నారాయణరెడ్డిని రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్ డీసీపీగా, రాచకొండ కమిషనరేట్‌లోని మల్కాజిగిరి డీసీపీగా ఉన్న పీవీ పద్మజను యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా బదిలీ చేశారు. సీఐడీ ఎస్పీగా ఉన్న పాటిల్ సంగ్రామ్ సింగ్ గణపత్‌రావును నాగర్‌కర్నూల్ ఎస్పీగా నియమిస్తూ.. ఇక్కడున్న గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను హైదరాబాద్ కమిషనరేట్‌లోని టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీగా ఉన్న ఖరేకిరణ్ ప్రభాకర్‌ను హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీగా నియమిస్తూ.. ఇక్కడున్న స్నేహ మెహ్రాను వికారాబాద్ జిల్లా ఎస్పీగా నియమించారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఎస్పీగా ఉన్న చెన్నూరి రూపేష్‌ను హైదరాబాద్ సిటీలోని ఎస్ఎం ఐటీ డీసీపీగా నియమించారు.

ములుగు ఎస్పీగా ఉన్న డాక్టర్ శబరీష్‌ను మహబూబాబాద్ ఎస్పీగా నియమించి ఇక్కడున్న రామ్‌నాథ్‌ను ములుగు ఎస్పీగా బదిలీ చేశారు. రెండవ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న నిఖితా పంత్‌ను కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లా ఎస్పీగా నియమించి.. ఇక్కడున్న సుభాష్‌ను గవర్నర్ ఏడీసీగా బదిలీ చేశారు. గవర్నర్ ఏడీసీగా ఉన్న సిరిసెట్టి సంకీర్త్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీగా నియమించారు. వనపర్తి ఎస్పీగా ఉన్న పి.గిరిధర్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఎస్పీగా నియమించారు. సీఐడీ ఎస్పీగా ఉన్న బి.రామిరెడ్డిని రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి డీసీపీగా నియమిస్తూ.. ఇక్కడున్న కరుణాకర్‌ను బదిలీ చేశారు. ఇంటెలిజెన్స్ విభాగంలో ఎస్పీగా ఉన్న సీహెచ్ శ్రీధర్‌ను రాచకొండ కమిషనరేట్‌లోని మల్కాజిగిరి డీసీపీగా నియమించారు. భైంసా ఎస్డీపీవోగా ఉన్న అవినాష్ కుమార్‌ను కొత్తగూడెం జిల్లా అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా బదిలీ చేసి.. ఇక్కడున్న నరేందర్‌ను బదిలీ చేశారు. ఉట్నూర్ ఎస్డీపీవోగా ఉన్న కాజల్‌ను పదోన్నతిపై అక్కడే ఏఎస్పీగా నియమించారు. అలాగే భువనగిరి ఎస్డీపీవోగా ఉన్న రాహుల్ రెడ్డిని పదోన్నతిపై అక్కడే ఏఎస్పీగా నియమించారు. వేములవాడ ఎస్డీపీవోగా ఉన్న శేషాద్రిని రెడ్డిని జగిత్యాల అదనపు ఎస్పీ(అడ్మిన్)గా బదిలీ చేశారు. ములుగు ఎస్డీపీవోగా ఉన్న శివం ఉపాధ్యాయను అక్కడే అదనపు ఎస్పీ(ఆపరేషన్స్)గా బదిలీ చేశారు. నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనాను భైంసా అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. దేవరకొండ ఏఎస్పీగా ఉన్న పి.మౌనికను అదిలాబాద్ అదనపు ఎస్పీ(అడ్మిన్)గా నియమించారు. గ్రేహౌండ్స్ విభాగం ఏఎస్పీలుగా ఉన్న మన్నన్ భట్‌ను ఏటూరునాగారం ఏఎస్పీగా, సాయికిరణ్‌ను నిర్మల్ ఏఎస్పీగా, రుత్విక్ సాయిని వేములవాడ ఏఎస్పీగా, యాదవ్ వసుంధరను సత్తుపల్లి ఏసీపీగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఎస్.శ్రీనివాస్‌ను ట్రాన్స్‌కో ఎస్పీగా, డి.సునీతను వనపర్తి ఎస్పీగా, గుణశేఖర్‌ను రాచకొండ కమిషనరేట్‌లోని డీసీపీ(క్రైం)గా నియమించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సుప్రీం సమాధానాలు

తన పద్నాలుగు ప్రశ్నలకూ సుప్రీంకోర్టు ఇచ్చిన సమాధానం రాష్ట్రపతిగారికి కచ్చితంగా సంతృప్తినీ, సంతోషాన్నీ కలిగించివుంటుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటివరకూ పద్నాలుగుసార్లు మాత్రమే ఈ 'ప్రెసిడెన్షియల్ రెఫరెన్స్' అధికారాన్ని రాష్ట్రపతి వినియోగించుకున్న నేపథ్యంలో, బిల్లుల ఆమోదానికి గవర్నర్లకు, రాష్ట్రపతికీ కాలపరిమితులు విధిస్తూ ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నెలలోనే రాష్ట్రపతి న్యాయసలహా పేరిట దానికి పలుప్రశ్నలు సంధించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రాష్ట్రపతిని రంగంలోకి దించి పాలకులు న్యాయ వ్యవస్థతో యుద్ధం కొనసాగిస్తున్నారని న్యాయకోవిదులు సైతం గొణిగారు. అలాగే, ఈ ప్రశ్నల వెనుక లక్ష్యాన్నీ అనుమానించారు. సంధించిన ఆ ప్రశ్నల్లోనే మీ తీర్పు ఎలా చెల్లుబాటవుతుందో చెప్పుకోండి చూద్దాం అన్న అసలు ప్రశ్న కూడా ఉన్నందున, ఈ న్యాయసలహా దెబ్బకు సుప్రీంకోర్టు దిగివస్తుందన్న మేధావుల అంచనా ఇప్పుడు నిజమైంది.

గవర్నర్ స్థాయిలో ఉన్నవారికి రాజ్యాంగబద్ధంగా నడుచుకోమని పదేపదే చెప్పాల్సి రావడం నిజానికి సర్వోన్నత న్యాయస్థానానికే పెద్ద పరీక్ష. తమిళనాడు గవర్నర్ విషయంలో అది చేసీచేసీ విసిగిపోయిన నేపథ్యంలోనే, ఏప్రిల్‌లో ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం వినూత్నంగా, విప్లవాత్మకంగా ఆ తీర్పు చెప్పింది. కేసు తమిళనాడుది కావడం, డీఎంకేకు అది రాజకీయంగా పైచేయి నివ్వడంతో కేంద్రం పెద్దలకు మా చెడ్డకోపం వచ్చింది. విపక్షపాలిత రాష్ట్రాలన్నింటికీ ఉపశమనాన్ని ఇచ్చిన ఆ తీర్పు, రవి తరహా గవర్నర్లు పెడుతున్న బాధలను అనుభవిస్తున్న పార్టీలకు శక్తినీ, ఉత్సాహాన్నీ ఇచ్చింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను రాజ్యాంగ బద్ధ వ్యవస్థలుగా కాక, శత్రుసేనలుగా భావించి సంహరించే గవర్నర్లకు ఆ తీర్పు ఒక ఘాటైన హెచ్చరిక. వారి పరిధిని గుర్తు చేస్తూ లక్ష్మణరేఖ దాటవద్దన్నది. ప్రభుత్వం పంపిన బిల్లులను అటు ఆమోదించకుండా, ఇటు తిప్పిపంపకుండా, కనీసం రాష్ట్రపతికి నివేదించకుండా గవర్నర్ ఎన్ని ఎత్తులు వేశారో కోర్టు గమనించింది. శాసనసభ రెండోసారి పంపినా సంతకం చేయకుండా, ఆఖరుఘడియలో అతితెలివిగా రాష్ట్రపతి టేబుల్‌మీదకు ఆ బిల్లులను నెట్టేయడమూ గమనించింది కనుకనే, సుప్రీంకోర్టే వాటిపై ఓ నిర్ణయం తీసుకుంది. 142వ అధికరణద్వారా తనకు దఖలుపడిన ప్రత్యేకాధికారాలను వినియోగించుకొని, గవర్నర్ ఆమోదం లభించినట్టుగా నిర్ధారించింది. రాజకీయకక్షతో గవర్నర్ సృష్టించిన కృత్రిమ సంక్షోభాలను సాహసోపేతమైనమార్గంలో పరిష్కరించింది.

బిల్లుల ఆమోదానికి రాజ్యాంగం నిర్దిష్టకాలపరిమితిని విధించకపోవడం ఒక గౌరవంగా కాక, ఒక నిరంకుశ అధికారంగా, దుర్వినియోగం చేయగల అవకాశంగా తీసుకుంటున్న గవర్నర్లకు ఆ తీర్పు ముకుతాడు వేసింది. మీకు నచ్చిందే చేయండి అని గవర్నర్లకు చెబుతూనే, బిల్లు ఆమోదానికీ, తిరస్కారానికీ, రాష్ట్రపతి నివేదనకు కాలపరిమితులు విధించింది.

ప్రజాస్వామ్యానికీ, సమాఖ్యవ్యవస్థకు సత్తువనిచ్చే ఆ తీర్పును ఈ ఐదుగురు సభ్యుల ధర్మాసనం నీరుగార్చడంతో వ్యవహారం మళ్ళీ మొదటికి వచ్చింది. గవర్నర్, రాష్ట్రపతి విధుల్లో వేలుపెట్టబోనని కోర్టు హామీ ఇస్తోంది. గవర్నర్లకు గడువులుండవనీ, ఏమీ తేల్చుకున్నా ఎవరూ ప్రశ్నించరని చెబుతోంది. మరీ అన్యాయమనిపిస్తే ఓ మాట అడుగుతామని కాస్తంత వేలుదూరేంత సందు పేరుకు మిగల్చుకున్నా, మీ నిర్ణయాలు న్యాయసమీక్షకు అతీతమనీ, డీమ్డ్ అసెంట్, ఆటోమేటిక్ వంటివి రాజ్యాంగంలోనే లేవని ధైర్యం చెప్పింది. రాష్ట్రాల్లో అధికార కేంద్రాలుగా తయారై, ఎన్నికలు వచ్చేనాటికి క్షేత్రాన్ని రాజకీయంగా సిద్ధం చేస్తూ, విపక్ష పార్టీ ప్రభుత్వాలను కూల్చేందుకు ఉపకరిస్తున్న గవర్నర్లకు, వారి యజమానులకు ఈ తీర్పు సంతోషం కలిగిస్తుంది. ప్రభుత్వాలు రాజ్యాంగ విహితంగా నడవనప్పుడు న్యాయస్థానాలు కాస్తంత చొరవ, దూకుడు ప్రదర్శించి గాడినపెట్టడం అవసరం. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని రక్షించడానికీ, కొలీజియం వ్యవస్థను పరిరక్షించుకోవడానికీ కార్యనిర్వాహక వ్యవస్థతో న్యాయవ్యవస్థ ఎంత పోరాడిందో చూశాం. ఇందుకు పూర్తి భిన్నంగా పుస్తకంలో ఉన్నదే అప్పచెప్పడానికి ఇప్పుడు సిద్ధపడిందంటే భయమో భక్తో కావచ్చు, లేదా, మధ్యలో మాకెందుకీ గొడవ అనుకొని కూడా ఉండవచ్చు.

విఫలబ్యారేజీకి నీటి తరలింపా!?

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంతో పాటు, గ్రావిటీ కెనాల్, సొరంగం, సుందిళ్ల అనుసంధానంపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ అందుకు సంబంధించిన జీవో 278 జారీ చేశారు. డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచి, అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. రోజుకు ఒక టీఎంసీ చొప్పున 80 టీఎంసీలు తరలించేలా మహారాష్ట్రతో సంప్రదించి 150 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

మాజీ సీఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూపం పోసుకున్న ప్రణాళిక ప్రకారం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి అక్కడి నుంచి 71 కి.మీ. గ్రావిటీ కాలువ ద్వారా మైలారం దాకా వచ్చే నీటిని అక్కడ నుంచి 19 మీటర్ల ఎత్తుకు పంపింగ్ చేసి, ఎల్లంపల్లికి నీళ్లు ఎత్తిపోయాలి. ఇప్పుడు దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకున్నది. తుమ్మిడిహెట్టి నుంచి మైలారం వరకు వచ్చే నీటిని 20.6 కి.మీ. మేర సొరంగం తవ్వి టేకుమట్ల వాగులో వేయనున్నారు. ఈ వాగు 11 కి.మీ. ప్రవహించి సుందిళ్ల బ్యారేజీలో కలుస్తుంది. సుందిళ్ల బ్యారేజీలో ఉన్న కాసిపేట పంపుల నుంచి ఎల్లంపల్లిలో ఎత్తిపోస్తారు. కానీ రూ.1600కోట్ల ఖర్చు తగ్గించుకునే పేరిట, ఇలా సుందిళ్లకు నీళ్లు తరలిస్తే, 100–150 టీఎంసీల భారీ నీటి సముదాయాన్ని ప్రకృతి శక్తిని భరించలేక, అక్కడ మేడిగడ్డ లాంటి ఘోర వైఫల్యం కచ్చితంగా తలెత్తవచ్చని 'నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ' (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక హెచ్చరిస్తున్నది.



సుందిళ్ల ఒక విఫల బ్యారేజీ. 2019లో కేసీఆర్‌తో సహా ముగ్గురు ముఖ్యమంత్రులు సుందిళ్లతో పాటు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను ప్రారంభించారు. మొదటి సంవత్సరంలోనే సుందిళ్లతో సహా మూడు బ్యారేజీల పునాదులైన అప్రాన్, రాఫ్ట్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. నీటి వేగాన్ని తగ్గించే హైడ్రాలిక్ జంప్ దిమ్మెలు భారీగా కొట్టుకుపోయాయి. 2019 నుంచి 2023 వరకు అప్రాన్, రాఫ్ట్, దిమ్మెలు మొత్తం తుడిచిపెట్టుకుపోయాయి. నాలుగో ఏటికల్లా మొత్తం దిమ్మెలు పూర్తిగా కనబడకుండా పోయాయి. మూడు బ్యారేజీలతో పాటు, సుందిళ్ల అడుగున అనేక బుంగలు పడ్డాయి. ఆ బుంగలలో సిమెంట్ గ్రౌటింగ్, పాలి యూరథిన్ గ్రౌటింగ్ చేసినా ప్రతి ఏటా వర్షాకాలంలో అవే బుంగలు తిరిగి పడుతూ, మరిన్ని కొత్తవి ఏర్పడుతున్నాయి.

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రఖ్యాత వైజ్ఞానిక సంస్థల నిపుణులతో కమిటీ వేసి పునర్ నిర్మాణం జరగకుండా నీటిని సుందిళ్లతో పాటు మూడు బ్యారేజీలలో నిలువ చేయకూడదని పేర్కొన్నది. నీళ్లు నింపితే బ్యారేజీలకు మొదటికే మోసం అని హెచ్చరించింది. మరి ఇప్పుడు ఎన్‌డీఎస్‌ఏ నివేదికను ధిక్కరించి, సుందిళ్లకు నీళ్లు తీసుకొచ్చే ప్రణాళికపై మరో విఫల కసరత్తు ఎందుకు చేస్తుందో తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించాలి.

కేసీఆర్ అన్నీ తానై ఎవరి మాటా వినకుండా మూడు బ్యారేజీలు నిర్మించి ఘోర తప్పిదం చేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నేరుగా మైలారం నుంచి ఎల్లంపల్లికి నీళ్లు ఎత్తిపోయడం కాకుండా, సుందిళ్లకు తరలించడం ద్వారా కేసీఆర్ చేసిన తప్పిదాలనే పునరావృతం చేస్తున్నారు. భవిష్యత్తు ఏమిటో తెలియని సుందిళ్ల బ్యారేజ్‌కు తుమ్మిడిహెట్టి నీళ్లు తరలించడమూ, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తరలించడమూ రెండూ అత్యంత ప్రమాదకరమైనవే. నూతన తెలంగాణను కాళేశ్వరంతో కేసీఆర్ విధ్వంసం చేశారు. ఇప్పుడు సుందిళ్లకు నీళ్లు తరలించి రేవంత్‌రెడ్డి మరో విఫల ప్రాజెక్టుకు తెరలేపుతున్నారనిపిస్తున్నది.

విఫల బ్యారేజీల్లో ఒకచోట తలెత్తిన సమస్యను పునరుద్ధరించినా, మరోచోట బుంగలు పడవు అనే గ్యారెంటీ లేదు. మేడిగడ్డ ఏడవ బ్లాక్ పునాది అడుగున ఇసుక అంతా పైపింగ్ జరిగి, అంటే కొట్టుకుపోయి, ఎలా అయితే భారీ బుంగలు, రంధ్రాలు ఏర్పడ్డాయో, ఆ విధంగానే సుందిళ్లలో కూడా ఏర్పడుతాయి. ఇది ఎన్‌డీఎస్‌ఏ పేర్కొన్న విషయం. ఒక సైకిల్ రిపేర్ చేసినంత తేలికగా నిర్మాణ లోపం ఉన్న ప్రాజెక్టు పునాదులను మరమ్మతు చేయడం కుదరదు. ఎందుకంటే ఫ్లోటింగ్ స్ట్రక్చర్‌గా ఉండవలసిన బ్యారేజీలన్నీ, తొందరపాటు వల్ల, అవినీతి వల్ల రిజిడ్ స్ట్రక్చర్స్‌గా మారాయి. భూ భౌతిక, భూ సాంకేతిక పరీక్షలు చేయనందున, డిజైన్‌కు తగ్గట్టు నిర్మాణం, నిర్మాణానికి తగ్గట్టు మెయింటెనెన్స్ లేనందున బ్యారేజీలన్నీ మరమ్మతులు చేసినా, అంత భారీ నీటి నిర్వహణను తట్టుకునే అవకాశం ఎంత మాత్రమూ లేదు.

• నైనాల గోవర్ధన్

ప్రమాదంలో ప్రజాస్వామ్య శ్వాసకోశాలు

మీరు ఆ ప్రసంగాన్ని వింటే ఆ మాటలు బాల్‌గంగాధర్ తిలక్‌వో, జవహర్‌లాల్ నెహ్రూవో, జయప్రకాశ్ నారాయణ్‌వో లేదా నెల్సన్ మండేలావో అయివుండొచ్చని భావిస్తారు. అయితే మీరు పొరపడ్డారు. ఆ వక్త సాక్షాత్తు గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.

ఆ ప్రసంగం విలేఖర్లకు వీనుల విందుగా ఉంటుందేమో?! గత పదకొండు సంవత్సరాలుగా విలేఖర్ల సమావేశంలో పాల్గొనేలా ప్రధానమంత్రిని అంగీకరింపచేసేందుకు వారు చేయని ప్రయత్నం లేదు కదా. విఫల మనోరథులు అయిన పాత్రికేయులు ఎట్టకేలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెలువరించిన ఆ ప్రసంగాన్ని విని సహజంగానే ఆనందభరితులయివుంటారు. ప్రత్యక్ష ప్రసారమయ్యే పత్రికా గోష్ఠిలో విలేఖర్లు అడిగే ప్రశ్నలకు సమాధానమివ్వకూడదన్న తన దృఢ సంకల్పాన్ని ప్రధానమంత్రి ఎట్టకేలకు సడలించుకున్నారేమోనన్న ఆశాభావం సైతం వారి మనస్సుల్లో తటిల్లమని ఉంటుంది. తాము ఇక నిరంతరం జాగ్రత్తగా ఉండవలసిన అవసరం లేదని, తమ అభిప్రాయాలను 'ఒక వైపు' లేదా 'మరో వైపు' అనే పద బంధాలతో వివరిస్తూ సమతుల్య సంపాదకీయాలు రాయవచ్చనే భరోసాను సంపాదకీయ రచయితలకు ప్రధానమంత్రి ప్రసంగం కలిగిస్తున్నది. ఆయన మాటలు వ్యంగ్య చిత్రకారులకు కూడా ఎనలేని ఉత్సాహాన్ని కలిగిస్తాయి. 'ఎవరినీ వదలవద్దు, ప్రధానమంత్రిని సైతం విడిచి పెట్టవద్దు' అన్న వివేకవంతమైన మాటలను గుర్తు చేసుకుంటూ కార్టూనిస్టులు తమ పెన్సిళ్లకు పదునుపెడతారు. అవి జాలువార్చిన గీతలు, వ్యాఖ్యలు ప్రజలు తమ పాలకుల అవివేకానికి, అధికార ఔద్ధత్యానికి పగలబడి నవ్వుకునేలా చేస్తాయి. 'పాఠక మహాశయా, నన్ను క్షమించు నేను ఏమి చేస్తున్నానో నాకు తెలుసు' అన్న ప్రార్థనతో సమాజ యథార్థాలను ఎత్తిచూపిన వార్తలు, వార్తా వ్యాఖ్యలు అనేకాన్ని చెత్తబుట్ట పాలు జేసిన ఎడిటర్లకు ఆ మాటలు తమ అసలు విధ్యుక్త ధర్మ నిర్వహణకు ప్రోత్సాహకరమైన పిలుపు అవుతాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

నరేంద్ర మోదీ మాటలు నిజంగా చాలా స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి, సందేహం లేదు. రామ్‌నాథ్ గోయెంకా (1904–1991) ఔదలదాల్చిన ఆదర్శం సాహసోపేత పాత్రికేయం (Journalism of Courage). ఆ ఆదర్శమే ఆయన నెలకొల్పిన వార్త పత్రికకు మార్గదర్శక ధర్మసూత్రమయింది. ప్రతి రోజూ ఆ పత్రిక మాస్ట్ హెడ్‌లో భాగంగా ఉంటోంది. రామ్‌నాథ్ గోయెంకాను కొనియాడుతూ ప్రధాన మంత్రి ఇలా ఉద్ఘాటించారు: 'రామ్‌నాథ్ గోయెంకా బ్రిటిష్ పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దృఢ వైఖరితో వ్యవహరించారు. బ్రిటిష్ వారి ఆదేశాలను పాటించడం కంటే తన పత్రికను మూసివేసేందుకే ప్రాధాన్యమిస్తానని ఆయన ఒక సంపాదకీయంలో స్పష్టం చేశారు. అదే విధంగా, మన దేశాన్ని ఎమర్జెన్సీ రూపంలో దేశాన్ని బానిసత్వ అంధకారంలోకి నెట్టివేసినప్పుడు కూడా రామ్‌నాథ్ గోయెంకా నాటి పాలకులపై రాజీలేని పోరాటం చేశారు. ఎమర్జెన్సీ విధించి యాభై సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ ఏడాది జూన్‌లో దేశ ప్రజలు అందరూ ఆ చీకటి రోజులు గుర్తు చేసుకున్నారు'.

బాగా చెప్పారు. అయితే నేటి పత్రికా రంగంలో ఉన్న వాస్తవ పరిస్థితులు ఏమిటి? భారతదేశ ప్రముఖ వార్తా పత్రికలు భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రభవించినవే. ఆ మహోన్నత పోరాట లక్ష్యాలు, ఆదర్శాలతో స్ఫూర్తి పొందినవే. పత్రికా రంగం పరిస్థితులకు అద్దం పట్టే గోది మీడియా (ప్రభుత్వ పక్షపాతంతో వ్యవహరించే పత్రికలు, ఛానెల్స్) అనే పదాన్ని సృష్టించవలసిన అవసరం 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశం కల్పిస్తుందని నాటి త్యాగధనుల తరం ఊహించి ఉండదు. అసంఖ్యాక పాఠకులు, వీక్షకులు చదవడానికి, చూడడానికి తిరస్కరిస్తున్నప్పటికీ అనేక వార్తా పత్రికలు, టీవీ ఛానెల్స్ ప్రభుత్వ అండదండల పుణ్యమా అని ఇంకా పచ్చగా వర్ధిల్లుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు: 'రామ్‌నాథ్ గోయెంకా సదా సత్యం పక్షాన నిలబడ్డారు. తనను వ్యతిరేకిస్తున్నవారు ఎంత శక్తిమంతులు అయినప్పటికీ తన విధ్యుక్త ధర్మ నిర్వహణకే ఆయన అధిక ప్రాధాన్యమిచ్చారు'.

> **కంటికి కనిపించని సెన్సార్ అనుక్షణమూ పనిచేస్తోంది; ప్రధాన వార్తాపత్రికలు, టీవీ ఛానెల్స్ అన్నీ 24x7 పర్యవేక్షణలో ఉన్నాయి; ఎడిటర్లకు ఫోన్ కాల్స్ వెళ్లుతున్నాయి; ఏవి ప్రచురించాలో, ఏవి ప్రచురించకూడదో సలహాలు లేదా సలహాపూర్వక సూచనలు ఇవ్వడం జరుగుతోంది; పాటించని వారికి సమస్యలు, ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ మీడియా పరిస్థితి.**

పత్రికా వార్తలు ఒకప్పుడు ప్రజాసమస్యల పరిష్కారానికి దోహదం చేసేవిగా ఉండేవి. ఇప్పుడు భిన్నమైన వార్తలు పత్రికల గురించి వినవస్తున్నాయి. ఉదాహరణకు ఒక ఎడిటర్ గురించి వినవచ్చిన వార్తను చూడండి: తాను పనిచేస్తున్న పత్రిక యాజమాన్యంతో ఆయన కుదుర్చుకున్న కాంట్రాక్టు ముగిసేందుకు ఇంకా చాలా కాలం ఉంది. అయితే ఒక రోజున ఉన్న పాటుగా ఆయనకు మిగతా కాంట్రాక్టు కాలపు వేతన భత్యాల మొత్తానికి సంబంధించిన చెక్ అందింది. అదే రోజు సాయంత్రానికి బాధ్యతలను కొత్త ఎడిటర్‌కు అప్పగించి ఇంటికి వెళ్లిపోవాలని యాజమాన్యం నుంచి ఆదేశమూ జారీ అయింది. ఒక టీవీ యాంకర్‌కు విశేష వీక్షకాదరణ ఉన్నది. ఆయన పనిచేస్తున్న టీవీ ఛానెల్ యాజమాన్యం మారింది, ఆ యాంకర్‌ను ఆ సంస్థ నుంచి పంపించివేశారు. ఈ ఉదంతాన్ని అర్ధరాత్రి తిరుగుబాటుగా మీడియా వర్గాలలో చెప్పుకున్నారు. ఇంకా ఎంతోమంది ప్రముఖ పాత్రికేయులకు అంతకంటే దిగ్భ్రాంతికరమైన అనుభవాలు ఎదురయ్యాయి. గత పది సంవత్సరాలలో ప్రఖ్యాత పాత్రికేయులు ఎందరో తమ ఉద్యోగాన్ని కోల్పోయారు. ఇప్పటికీ వారిలో చాలామంది ఉద్యోగాన్వేషణలోనే ఉన్నారు!



కొద్ది రోజుల క్రితం న్యూఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన ఒక సమావేశం గురించి యశ్వంత్ సిన్హా ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెప్పారు. ప్రెస్ క్లబ్ ఆహ్వానంపై సిన్హా అక్కడకు వెళ్లి ఒక ప్రసంగాన్ని వెలువరించారు. ప్రసంగం అనంతరం పాత్రికేయులతో ఆయన పిచ్చాపాటీ చేశారు. ఆ సందర్భంగా ఆయన తాను అప్పుడప్పుడు చేస్తున్న ప్రకటనల గురించి ఎలాంటి వార్తలు రావడం లేదని మృదువుగా మందలించారు. ఆయన మాటతో ప్రతి ఒక్కరూ మౌనం వహించారు. చివరకు ఒక యువ పాత్రికేయుడు ఇలా అన్నాడు: 'యశ్వంత్ సిన్హా గారూ, మీ ప్రకటనలపై నేను వార్తలు రాస్తాను. నేను గనుక ఉద్యోగాన్ని కోల్పోతే, నాకు మరెక్కడైనా ఒక ఉద్యోగాన్ని ఇప్పించగలరా?'. యశ్వంత్ సిన్హా దిగ్భ్రాంతి చెందారు.. తేరుకొని మెల్లగా ఆ పాత్రికేయుడుతో ఇలా అన్నారు: 'మీరు మీ ఉద్యోగాన్ని కాపాడుకోండి'.

నేను ఒక సాయంత్రం ఒక చిన్న రెస్టారెంట్‌కు పాత్రికేయ మిత్రుడు ఒకరితో కలిసి డిన్నర్‌కు వెళ్లాను. మేము విందులో ఉండగా రాత్రి పదిగంటల సమయంలో ఆ పాత్రికేయుడికి అతని కార్యాలయం నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తక్షణమే ఇంటికి వెళ్లాలని, అక్కడ ఒబి వ్యాన్ వేచి ఉన్నదని, ముందుగా సిద్ధం చేసి ఉన్న ఒక ప్రకటనను చదవాలనేది ఆయనకు అప్పగించిన పని. ఈ సందేశమందిన వెన్వెంటనే నా పాత్రికేయ మిత్రుడు ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. 'ఇప్పటికే గృహానికి చేరిన మరో విలేఖరికి ఆ బాధ్యత అప్పగించండి అని మీ బాస్‌కు చెప్పవచ్చు కదా' అని నేను అన్నాను. 'నా తల్లిదండ్రులు వృద్ధులు. నా పై ఆధారపడి ఉన్నారు. పైగా నేను చెల్లించవలసిన రుణాలు కూడా ఉన్నాయి' అంటూ నా మిత్రుడు విధి నిర్వహణకు వెళ్లిపోయాడు.

కొంతమంది పాత్రికేయులు అత్యాశాపరులు. వారే వృత్తి జీవితంలో వృద్ధి చెందుతూవుంటారు. ఈ అత్యాశాపరులు విచిత్రమైన వార్తలు సృష్టిస్తారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతీయ నావికాదళ యుద్ధ నౌకలు కరాచీని దిగ్బంధం చేశాయని, భారత సైనిక దళాలు కరాచీ నగరంలో ప్రవేశించేందుకు సంసిద్ధంగా ఉన్నాయనే వార్తలను ప్రసారం చేయడం ఇందుకు ఓ ఉదాహరణ.

యశ్వంత్ సిన్హా, నేను చెప్పిన ఉదంతాలు, ఇంకా మీరు విన్నవీ పత్రికారంగంలో ఎల్లెడలా పరివ్యాప్తమై ఉన్న భయోత్పాత పరిస్థితులను వెల్లడిస్తున్నాయి. విశ్వసనీయమైన వ్యక్తులు నాకు చెప్పిన, నేను స్వయంగా తెలుసుకున్న కొన్ని విషయాలను వెల్లడిస్తాను: అగోచర సెన్సార్ అనుక్షణమూ పనిచేస్తూ ఉన్నది; ప్రధాన వార్తాపత్రికలు, టీవీ ఛానెల్స్ అన్నీ 24X7 పర్యవేక్షణలో ఉన్నాయి; ఎడిటర్లకు ఫోన్ కాల్స్ వెళ్లుతున్నాయి; ఏవి ప్రచురించాలో, ఏవి ప్రచురించకూడదో సలహాలు లేదా సలహాపూర్వక సూచనలు ఇవ్వడం జరుగుతోంది; పాటించని వారికి సమస్యలు, ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ మీడియా పరిస్థితి, నన్ను నమ్మండి. హిందీ మీడియా మినహా మిగతా భారతీయ భాషలలోని చిన్న మీడియా సంస్థలకు మాత్రమే ఈ నిరంతర నిఘా, నిత్యపర్యవేక్షణల నుంచి మినహాయింపు లభిస్తున్నట్టుగా కనిపిస్తోంది. భయం స్వేచ్ఛకు పరమ శత్రువు. భయంతో రాజీపడిన మీడియా, లేదా నిర్భీతితో తలెత్తుకొని నిలబడే మీడియా.. భారత్ ముందు రెండుదారులున్నాయి. భయం గల మీడియా ప్రజాస్వామ్యాన్ని రక్షించలేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి

కేంద్రం తన ఉద్యోగులు, పెన్షనర్లకు ఏటా మార్చి, సెప్టెంబర్ మాసాల్లో క్రమం తప్పకుండా డీఏలు ప్రకటిస్తోంది. తెలంగాణలో మాత్రం ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లకు డీఏ ఎప్పుడు ఇవ్వాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక నిర్దిష్టమైన విధానాన్ని ప్రకటించలేదు.

2023 జనవరి నుంచి చెల్లించాల్సిన ఒక విడత కరువు భత్యం 3.64 శాతాన్ని ఈ ఏడాది జూన్‌లో మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.70 జారీ చేసింది. ఇదే చివరిసారిగా మంజూరు చేసిన డీఏ. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లకు 44.59 శాతం డీఏ చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం 30.03 శాతం మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు డీఏలు పెండింగ్‌లో పెట్టింది. తాము అధికారంలోకి రాగానే ఆ మూడు డీఏలను తక్షణం చెల్లిస్తామనీ, సకాలంలో డీఏను ప్రకటించి, బకాయిలను నేరుగా ఉద్యోగస్తులకు చెల్లిస్తామనీ చెబుతూ గత ఎన్నికల సమయంలో తమ మేనిఫెస్టోలో కాంగ్రెస్ స్పష్టమైన హామీ ఇచ్చింది. కానీ ప్రస్తుతం అయిదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన ఉద్యోగ వ్యతిరేక వైఖరికి విసిగిపోయినందునే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు కాంగ్రెస్ హామీని నమ్మి ఆ పార్టీకి ఓటు వేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోలేదు. డీఏ పెంపు ఉద్యోగులకు అదనపు సౌజన్యం కాదు. వారి చట్టబద్ధమైన హక్కు. కేంద్రం డీఏ ప్రకటించిన నెలలోపు కరువు భత్యం మంజూరు చేసే విధంగా ఒక విధానపరమైన నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి.

– మానేటి ప్రతాపరెడ్డి, టీఆర్‌టీఎఫ్ గౌరవాధ్యక్షుడు

హిడ్మా.. ఇంత స్పందనా?



హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత సోషల్ మీడియాలో ఆయనకు మద్దతుగా వస్తున్న కథనాలు, పోస్టులను చూస్తే 'ఒక అజ్ఞాత నక్సలైట్ నాయకుడు మరణిస్తే ఇంత స్పందనా?' అని ఆశ్చర్యం కలుగుతుంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్ మరణించినప్పుడు కూడా ఇంత స్పందన లేదేమో.

హిడ్మా బయటి ప్రపంచానికి తెలిసిన వ్యక్తి కాదు. పుట్టింది ఒక గోండు గూడెంలో. 25 ఏళ్లుగా ఆయుధంతో పోరాడుతున్నాడు. ఆదివాసీల గుండెల్లో హిడ్మాకు వెలకట్టలేని స్థానం ఉంది కాబట్టే ఇంతకాలం రకరకాల పోలీసు బలగాలు గాలించినా, దాడి చేసినా దొరకలేదు. ఒక విప్లవోద్యమ నాయకుడిగా ఈ ప్రపంచానికి సుపరిచితుడైన హిడ్మా మరణం తర్వాత ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లో ఆయనకు జేజేలు పలుకుతూ పోస్టులు మారుమోగిపోతున్నాయి. హిడ్మా బతికుంటే బాగుండునని వేల గొంతులు నినదిస్తున్నాయి. ఆయనను గుండెల్లో దాచుకున్న ఆదివాసీలకు అక్షరజ్ఞానం ఉంటే, ఈ సోషల్ మీడియాను వాడుకోవడం తెలిస్తే, ఈ ప్లాట్‌ఫాంలు ఇంకెంతగా మారుమోగిపోయేవో! తాము చేయలేని పనిని తమ నాయకుడు, చేయాలని ప్రజలు కోరుకుంటారు. అందుకే వీళ్ల అభిమానులు మాత్రమే అవుతారు, వాళ్ల చరిత్రలో హీరోలు అవుతారు.

ఆదివాసీల్లో హిడ్మాకు ఏ స్థాయిలో ఆదరణ ఉందో ఆయన అంత్యక్రియల దృశ్యాలు తెలియచెబుతాయి. జాతీయ, అంతర్జాతీయ, స్థానిక మీడియా సంస్థల ప్రతినిధులతో పూవర్తి కిక్కిరిసిపోయింది. తమ నేతను విగతజీవిగా చూసి ఆదివాసీలు భోరున విలపిస్తూ, శవాన్ని గుండెలకు హత్తుకుని ముద్దాడిన దృశ్యాలు ఆదివాసీల గుండెల్లో ఎన్నటికీ చెరగని హిడ్మా స్థానానికి నిదర్శనం. కొమురం భీం, రాంజీ గోండు, అల్లూరి సీతారామరాజుల వారసుడిగా హిడ్మాకు ఆదివాసీల్లో స్థానం దక్కుతుంది.

అర్జెంటీనాలో పుట్టి, క్యూబా విప్లవం తర్వాత, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలో కూడా విప్లవ బీజాలు నాటిన చెగువేరా ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో ఐకాన్‌గా నిలిచిపోయాడు. అదే తరహాలో, పూవర్తిలో పుట్టి, దండకారణ్యం, గడ్చిరోలి, ఏఓబీలో విప్లవజ్వాలను రగిలించిన నేతగా, కొందరి గుండెల్లో నిద్రించిన యోధుడిగా మడావి హిడ్మా భారత విప్లవోద్యమ చరిత్రలో నిలిచిపోతాడు. చెగువేరా ఎంతటి ప్రజాదరణ పొందాడంటే, ఆయన ఫొటో ఉన్న టీ–షర్ట్‌లను నేటితరం కాలేజీ కుర్రాళ్లు వేసుకుంటున్నారు. అలాగే రాబోయే రోజుల్లో హిడ్మా ఫొటోతో ఉన్న టీ–షర్ట్‌ను కూడా కుర్రాళ్లు వేసుకుని తిరిగే రోజులు వస్తాయి. హిడ్మా మరణం తర్వాత సోషల్ మీడియాలో ఆయనకు మద్దతుగా వెలుస్తున్న పోస్టులే అందుకు నిదర్శనం.

– ఎ.రమణ కుమార్, జర్నలిస్టు

కొత్త మార్గదర్శకాలతో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేనా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'MSME–2024 పారిశ్రామిక పాలసీ'ని గత ఏడాది సెప్టెంబర్ 18న ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక సంఘాల ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 8న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐటీ, పారిశ్రామిక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలువురు ఎస్సీ, ఎస్టీ వర్గాల ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్, పలువురు పారిశ్రామికశాఖ అధికారులు పాల్గొన్న నాటి సమావేశంలో 'తెలంగాణ పారిశ్రామిక పాలసీ'కి సంబంధించిన పలు ప్రతిపాదనలు చేశారు.

'ఉద్యం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉంటే భూమి లేదా భవన విక్రయ, లీజు పత్రం రెండింటి పైనా స్టాంపు డ్యూటీ 100 శాతం మినహాయింపు ఇవ్వాలి. మూలధన పెట్టుబడిలో 50శాతం సబ్సిడీ గరిష్ఠ పరిమితి రూ.2 కోట్ల వరకూ ఉండాలి. తయారీ, సేవా రంగాలకు దాన్ని ఒకేలా వర్తింపజేయాలి. తీసుకున్న రుణానికి రుణకాలం పూర్తయ్యే వరకు ప్రాథమిక వడ్డీపై 9శాతం వడ్డీని తిరిగి చెల్లించాలి. విద్యుత్ చార్జీలకు సంబంధించి ఒక యూనిట్‌కు రూ.3 చొప్పున సబ్సిడీ ఇవ్వాలి. గ్రీన్ కేటగిరికి సంబంధించిన కుటీర పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, సేవారంగ పరిశ్రమలకు డీటీసీపీ/ హెచ్ఎండీఏకు సంబంధించిన అనుమతులను మినహాయించాలి. కాలుష్యంలేని ఎంటర్‌ప్రైజెస్‌లకు భూ వినియోగ మార్పు మినహాయింపు ఇవ్వాలి. అయితే అది తప్పనిసరి అయిన సందర్భంలో ఎస్సీ, ఎస్టీల ఆధ్వర్యంలో నడిచే సూక్ష్మ, చిన్న పరిశ్రమల (ఎంఎస్ఈ)కు భూ వినియోగ మార్పు చార్జీలు గరిష్ఠంగా రూ.1000 మాత్రమే ఉండాలి' వంటి ప్రతిపాదనలు చేశారు.

అంతేకాదు, ఎంటర్‌ప్రైజెస్ కోసం అద్దెకు తీసుకునే భవనాలకు సంబంధించి లీజు డీడ్ కాకుండా నోటరీ ధ్రువీకరణ, స్వీయ ధ్రువీకరణకు అనుమతించాలి. ఎస్సీ, ఎస్టీల ఎంటర్‌ప్రైజెస్‌ల కోసం ఉత్పత్తి కొనసాగింపు కాలం ఆరేళ్లకు బదులుగా మూడేళ్లకు పరిమితం చేయాలి. టి–ప్రైడ్‌లోని అన్ని సేవారంగ కార్యకలాపాలు వాటి ఆపరేషన్ మార్గదర్శకాలతో సహా ఎటువంటి సవరణలు లేకుండా జీవో నెం.78 ప్రకారం అమలులో కొనసాగించాలి. సంప్రదాయ వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తూ రెట్రోఫిట్ కిట్లు, బ్యాటరీలు అమర్చిన వాహనాలను కొత్త యూనిట్లుగా పరిగణించి సబ్సిడీలకు అనుమతివ్వాలి. వ్యక్తిని పరిగణలోనికి తీసుకుని 'ఒక వ్యక్తికి ఒకేసారి సబ్సిడీ' అనే విధానాన్ని మార్చేసి, ఆ వ్యక్తి స్థాపించిన ప్రతి పరిశ్రమకూ సబ్సిడీ అర్హత కల్పించాలి.

వీటితో పాటు, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాల విడుదలలో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. టీజీఐఐసీ భూ కేటాయింపుల్లో కనీసం 10శాతం ప్రత్యేక కోటాను ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తల కోసం కేటాయించాలి. ప్రోత్సాహకాల విడుదలలో ప్రాధాన్యతా క్రమాన్ని పాటించాలి. ఉదాహరణకు ఎ)తయారీ రంగం, బి) పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి రంగం, సి) పరిశ్రమల ఎస్టేట్లు/ పార్కులు, డి) నిర్మాణ సంబంధిత సేవారంగం, ఇ) వస్తు రవాణా వాహనాలు. ఇంకా ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్‌ల కోసం ఎస్‌జీఎస్‌టీ వంద శాతం రియింబర్స్‌మెంట్‌ను అయిదేళ్లకు బదులు పదేళ్లపాటూ ఇవ్వాలి. భూమి, భవనం, యంత్రాల వంటి స్థిర మూలధన పెట్టుబడులకు ప్రోత్సాహం అర్హత కలిగి ఉన్నట్లే, కమర్షియల్ కాంప్లెక్స్‌కు అవసరమైన ఇతర ముఖ్య సౌకర్యాలు కూడా ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీకి అర్హతను కల్పించాలి. ఎస్సీ, ఎస్టీ సంస్థల కోసం అప్లికేషన్లు ఆటో డిలీట్ కాకుండా చూసుకోవాలి.

> **టీజీఐఐసీ ఆధ్వర్యంలోని ఇండస్ట్రియల్ పార్క్/ ఐటీ పార్క్‌లలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ పద్ధతి ప్రకారం ప్లాట్లు కేటాయించాలి. ప్రైవేట్ ఇండస్ట్రీ పార్కుల్లో కూడా ఇదే రీతిలో కేటాయించాలి. రిజర్వ్ చేసిన ప్లాట్లు డీ–రిజర్వ్ చేయకూడదు. అలాట్‌మెంట్ కమిటీలో ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలి.**



ఎస్సీ, ఎస్టీల పరిశ్రమల కోసం తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ద్వారా భూమి/ ప్లాట్ల కేటాయింపునకు ప్రతిపాదిత అమలు మార్గదర్శకాలు: భూమి ఖరీదుపై పరిమితి లేకుండా 50శాతం రాయితీ ఇవ్వాలి. మిగిలిన మొత్తాన్ని రెండేళ్ల గడువు తర్వాత పది సమాన వార్షిక వాయిదాల్లో, ఏడాదికి 4శాతం వడ్డీతో చెల్లించేలా అవకాశం కల్పించాలి. సేల్ అగ్రిమెంట్ ఆధారంగా మార్ట్‌గేజ్ సౌకర్యంతో కలిపి సమ్మతి పత్రాన్ని బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలకు ఇవ్వాలి. లీజ్ అండ్ సేల్ అగ్రిమెంట్ కాలంలో వ్యాపారవేత్త డిస్కౌంట్ తీసివేసిన తరువాత మిగిలిన మొత్తాన్ని పూర్తిగా చెల్లించగలిగితే, తక్షణమే సేల్ డీడ్ చేయాలి. టీజీఐఐసీ ఆధ్వర్యంలోని ఇండస్ట్రియల్ పార్క్/ ఐటీ పార్క్/ ఐడీఏలలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ పద్ధతి ప్రకారం లేదా లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయించాలి. టీజీఐఐసీ ద్వారా అభివృద్ధి చేయని భూమిని కేటాయించుకున్న ప్రైవేట్ ఇండస్ట్రీ పార్కుల్లో కూడా ఇదే రీతిలో కేటాయించాలి. రిజర్వ్ చేసిన ప్లాట్లు డీ–రిజర్వ్ చేయకూడదు. ఎందుకంటే అది రిజర్వేషన్ పాలసీకి విరుద్ధం.

అలాట్‌మెంట్ కమిటీలో ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలి. వారు ఉత్పత్తి రంగంలోని కంపెనీలలో షేర్‌హోల్డర్లు అయి ఉండాలి. గత అయిదేళ్లలో కనీసం ఏదైనా ఒక సంవత్సరం రూ.20 కోట్లు వార్షిక టర్నోవర్ కలిగి ఉండాలి. ఈ ప్రతినిధులు రాష్ట్ర స్థాయి కమిటీ, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ విధానాలకు అనుగుణంగా ఉండాలి. కొన్ని ఇండస్ట్రియల్ పార్కులలో రిజర్వేషన్ అమలులోకి రాలేదు. అటువంటి సందర్భాలలో, మిగిలిన భూములు లేదా సోషల్ ఇన్‌ఫ్రా భూములు ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలకు కేటాయించాలి. ఇండస్ట్రియల్ ఎస్టేట్స్‌లలోని దివాళా యూనిట్లను టీజీఐఐసీ స్వాధీనం చేసుకుని ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలకు తిరిగి కేటాయించాలి. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సీ, ఎస్టీల ప్రతిపాదనలతో కూడిన పారిశ్రామిక విధివిధానాలను విడుదల చేయాలి.

■ నల్ల బాబు
ఎస్సీ, ఎస్టీ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాలి..

- రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న అయోధ్య రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలలో జవాబుదారీతనం, పారదర్శకతను అమలు చేసే పవిత్ర బాధ్యత సమాచార హక్కు చట్టానికి ఉందని రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయోధ్యరెడ్డి మాట్లాడారు. సమాచారహక్కు చట్టం పటిష్టంగా అమలు కావడం ద్వారానే ప్రభుత్వ పథకాలు ప్రజలకు సద్వినియోగం అవుతాయన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాలను వర్గీకరించి సమాచార హక్కు చట్టం దరఖాస్తుల పరిష్కారానికి సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మే 2024 నుంచి ఇప్పటివరకు సుమారుగా 5వేల దరఖాస్తులు పరిష్కరించినట్లు వెల్లడించారు. హనుమకొండ జిల్లాలో 340 సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఇప్పటికిప్పుడు 46 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. వచ్చే మార్చినాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు.

గడువులోగా పరిష్కరించాలి..

జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సమాచారహక్కు చట్టం, అప్పీళ్ల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం వివిధ జిల్లా శాఖల అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల పౌర సమాచార అధికారులతో అయోధ్యరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల పౌరసమాచార అధికారులు తమ తమ శాఖల పరిధిలో సమాచార హక్కుచట్టం కింద దాఖలైన వాటి సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తులు, ఇంకా పరిష్కరించాల్సిన వాటి గురించి వివరించారు. అనంతరం అయోధ్యరెడ్డి మాట్లాడుతూ.. స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వై.వి.గణేష్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

■ సీన్ రివర్స్

అంచనాల పెంపులో అక్రమాల కంపు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ఫోరెనిక్స్ ఆడిట్‌లో తేలిన నిజాలు

- సుమారు రూ.600 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారణ?
- రూ.1116 కోట్ల నుంచి రూ.1725.95 కోట్లకు పెంచిన గత బీఆర్ఎస్ సర్కారు
- అంచనా వ్యయాన్ని రూ.167.95 కోట్ల మేర తగ్గించిన కాంగ్రెస్ సర్కారు
- జైలు స్థలం తాకట్టు పెట్టి తెచ్చిన రుణంపై విజిలెన్స్ విచారణ
- ఫోరెనిక్స్ ఆడిట్ నివేదిక వచ్చినా, ఇంకా అందని విజిలెన్స్ నివేదిక
- మార్చి నాటికి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి చేసేలా ప్రభుత్వం కసరత్తు
- అంచనాల పెంపులో అక్రమాలపై ముదురుతున్న రాజకీయం



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వరంగల్ నడిబొడ్డున ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అంచనా వ్యయం భారీగా పెంపు వాస్తవమేనని ఫోరెన్సిక్ ఆడిట్ బృందం నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఎలాంటి అనుమతులు లేకుండా గత ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో ఆస్పత్రి అంచనా వ్యయాన్ని పెంచిందని తేల్చినట్లుగా సమాచారం. పనులు మొదలుపెట్టి.. ఏడాది గడవక ముందే వ్యయాన్ని రూ.625 కోట్లకు పైగా పెంచడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోరెనిక్స్ ఆడిట్‌కు ఆదేశించారు. అయితే ఇదే సమయంలో ఆస్పత్రి ఆకృతి, జైలు భూముల తాకట్టుపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ కూడా జరుపుతోంది. ప్రస్తుతం ఫోరెనిక్స్ నివేదిక వచ్చినప్పటికీ విజిలెన్స్ నివేదిక రాకపోవటంతో ప్రభుత్వం చర్యలు వెనుకాడుతోంది. మరోవైపు మార్చిలోపు సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది.

అంచనాల్లో అక్రమాలేనా..?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 జూన్ 22న 2వేల పడకలతో నిర్మించనున్న

(మిగతా 7లో..)

బావ ఇంటికే కన్నం వేశాడు..

- బావమరిది నిర్వాకం... అరెస్టు చేసిన పోలీసులు
- 47.05 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం

వరంగల్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బావ ఇంట్లో దొంగతనం చేసిన బావమరిదిని అరెస్టు చేసి నిందితుడి నుంచి రూ.4,36,066 విలువ చేసే 47.05 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. అయోధ్యపురం రైల్వేగేటు వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఓ యువకుడు అనుమానస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించారు. బెల్లంపల్లికి చెందిన ఐలవేని సాయి రోహిత్(26) హైదరాబాద్ కోఠిలో నివాసం ఉంటూ ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో ఆరునెలల క్రితం మడికొండలో తన బావ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బూతగడ్డ సతీష్ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను శుక్రవారం వరంగల్‌లో విక్రయించడానికి వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

నిధులను సక్రమంగా ఖర్చు చేయాలి

- ఎంజీఎంకు త్వరలో అభివృద్ధి కమిటీ
- 'దిశ' సమావేశంలో ఎంపీ పోరిక బలరాం నాయక్
- పాల్గొన్న ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యే నాగరాజు


దిశ సమావేశంలో పాల్గొన్న మాట్లాడుతున్న ఎంపీ బలరాం నాయక్

హనుమకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి జిల్లాను ప్రగతిపథంలో నడపాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశంలో ఆయనతో పాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్.... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, వాటికి కేటాయించే నిధులతో కొనసాగుతున్న పనులపై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పలు శాఖల పనితీరుపై చర్చించారు. ఇప్పటి వరకు ఉన్న పురోగతి సమీక్షించి కొత్తగా చేపట్టాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు సంబంధిత శాఖలు ఎలా ఖర్చు చేస్తున్నారు, అవి ప్రజలకు గ్రౌండింగ్ అవుతున్నాయా అని తెలుసుకున్నారు.

అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. గీజర్లు లేని హాస్టల్స్ జాబితా పంపితే త్వరితగతిన వాటిని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం వద్ద ఖాళీగా ఉన్న భూములను కూరగాయల సాగుకు లీజుకు ఇవ్వాలని సూచించారు. వారు పండించిన కూరగాయలను ప్రభుత్వ హాస్టల్స్ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్యక్రమాలకు సరఫరా చేయాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 275వ ఆర్టికల్ కింద గిరిజన అభివృద్ధికి మరిన్ని నిధులు అందుబాటులో ఉన్నాయని, వరంగల్ జిల్లా పరిపాలన షెడ్యూల్డ్ ట్రైబ్ సంక్షేమానికి మంచి ప్రణాళికలు రూపొందించినందున, వాటిని కేంద్రానికి పంపించి ప్రత్యేక బడ్జెట్ మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. సామాజిక సేవా దృక్పథం ఉన్న వ్యక్తులతో ఎంజీఎం అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే దిశగా కృషి చేయాలని అన్నారు. వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. జిల్లాలో 'అక్షయ పాత్ర' ద్వారా విద్యార్థులకు ఆరోగ్యవంతమైన

(మిగతా 6లో..)

రూ.లక్ష బిల్లుకు రూ.10వేలు లంచం

- కాంట్రాక్టర్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సంధ్యారాణి వేధింపులు
- ప్రైవేటు ఉద్యోగికి ఫోన్ పే చేయాలని హుకుం
- పక్కా స్కెచ్‌తో పట్టుకున్న ఏసీబీ అధికారులు
- పాలకుర్తిలో కలకలం.. డీఈపై కేసు నమోదు


డీఈ సంధ్యారాణి


బాధితుడు సురేష్

పాలకుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్లయినా బిల్లులు రాక పోవడం.. ఎన్నిసార్లు బతిమిలాడినా స్పందించకపోవడం.. దీనికి తోడు బిల్లులు రావాలంటే లంచం డిమాండ్ చేయడంతో విసిగిన ఓ కాంట్రాక్టర్ అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించాడు. అధికారులు ప్లాన్ చేసి లంచం అడిగిన అధికారిని పట్టుకున్నారు. ఈ ఘటన శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో చోటు చేసుకుంది. డబ్బులు నేరుగా కాకుండా, ప్రైవేట్ ఉద్యోగి ద్వారా తీసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.సంధ్యారాణిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కమ్మగాని సురేష్ అనే కాంట్రాక్టర్.. దేవరుప్పుల మండలంలోని చిన్నమడూరు,

(మిగతా 6లో..)

మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలు

- మహబూబాబాద్‌కు శబరీష్
- ములుగుకు సుధీర్ రామ్‌నాథ్
- భూపాలపల్లికి సిరిశెట్టి సంకీర్త్


శబరీష్


సుధీర్


సంకీర్త్

మహబూబాబాద్ క్రైం/ములుగుటౌన్/కృష్ణకాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని మూడు విభజిత జిల్లాలకు నూతన ఎస్పీలు నియామకం అయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌ను ములుగు జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నూతన ఎస్పీగా శబరీష్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం ములుగులో పనిచేస్తున్నారు. ఇద్దరినీ వైస్ వర్సాగా బదిలీ చేశారు. సుధీర్ రామ్ నాథ్ కేకన్ గతంలో ములుగు అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించారు. అలాగే ములుగు ఓఎస్డీగా శివమ్ ఉపాధ్యాయ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన ఏటూర్‌నాగారం ఏఎస్పీగా పనిచేస్తున్నారు. ఏటూర్‌నాగారం ఏఎస్పీగా మన్‌భట్‌ను నియమించారు. అలాగే భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే కూడా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్పీగా సిరిశెట్టి సంకీర్త్‌ను నియమించారు. సంకీర్త్ ప్రస్తుతం రాష్ట్ర గవర్నర్ ఏడీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఈయన ములుగు జిల్లా ఏటూర్‌నాగారం ఏఎస్పీగా విధులు నిర్వర్తించారు.

ముగ్గురు సీఐలు, 8 మంది ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషరేట్ పరిధిలో పలువురు సీఐలు, ఎస్సైలను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మామునూరు ఇన్‌స్పెక్టర్‌గా ఐటీ కోర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఈ.శ్రీనివాస్‌ను నియమించగా, ఇంతకాలం అక్కడ విధులు నిర్వర్తించిన ఒంటేరు రమేష్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న ప్రవీణ్ ఐటీకోర్‌కు బదిలీ అయ్యారు. అలాగే ఎస్సైల విభాగంలో ఎస్.రాజన్‌బాబు జనగామ నుంచి వీఆర్‌కు, రాజేష్‌కుమార్ జనగామ నుంచి ఐటీ కోర్‌కు, ఎస్.కృష్ణవేణి మామునూరు నుంచి సుబేదారికి, మహమ్మద్ నజీర్‌పాషా ఐటీ కోర్ నుంచి మామునూరుకు, బి.రవీందర్ కేయూసీ నుంచి వీఆర్‌కు, బి.విజయ్‌కుమార్ హనుమకొండ ట్రాఫిక్ నుంచి కేయూసీకి, ఈ. రతీష్ ఎస్బీ నుంచి జనగామకు, వి.దిలీప్ టాస్క్‌ఫోర్స్ నుంచి కమలాపూర్‌కు బదిలీ అయ్యారు.

సీసీఐ ఆంక్షలను ఎత్తివేయాలి..

- నింబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

హనుమకొండ చౌరస్తా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పత్తికొనుగోళ్లపై సీసీఐ విధించిన ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో బొట్ల చక్రపాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీపీఎం హనుమకొండ కమిటీ సమావేశంలో జాన్ వెస్లీ పాల్గొని మాట్లాడారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు అండగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని ఎనిమిది మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పత్తి తడిసి పోయిందని, దీంతో సీసీఐ క్వింటాకు రూ.8100 మద్దతు ధర ప్రకటించినా అది ఎక్కడ అమలు కావడం లేదన్నారు. ఎకరాకు 12క్వింటాళ్ల పత్తి కొనాలనే నిబంధనలను సీసీఐ 7క్వింటాళ్లకు కుదించడం దారుణమన్నారు. 12శాతంలోపు తేమ పేరుతో పత్తిని కొనుగోలు చేయకపోవడం అన్యాయమని, తీవ్ర చలి ఉన్న నేపథ్యంలో 12శాతం తేమ ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. రోజుకో నింబంధన పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదని, మధ్య దళారీల చేతిలో రైతులు నిలువుదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడి సైతం రాక అప్పుల పాలు అవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని జాన్‌వెస్లీ ఆరోపించారు. కపాస్ కిసాన్ యాప్

(మిగతా 6లో..)

పథకం 'పడావు'

అటకెక్కిన పశుగ్రాసం పెంపకం

- ఒక్క లబ్ధిదారుడికి కూడా అందని సబ్సిడీ
- అధికారుల తీరుతో నీరుగారిన లక్ష్యం

7

అంతా డొల్ల

- అధ్వానంగా అమృత్‌భారత్ పనులు

7

రేపు నగరంలో మారథాన్

- 5, 10, 21 కి.మీ. విభాగాల్లో పోటీ
- వయస్సుతో నిమిత్తం లేకుండా పాల్గొనవచ్చు
- ఉదయం 5 గంటల నుంచి పోటీలు షురూ
- ఇప్పటివరకు 2600 మంది పేర్ల నమోదు



మారథాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బాలసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో తొలిసారిగా మారథాన్ నిర్వహిస్తున్నట్లు మారథాన్ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో విష్ణువర్ధన్ రెడ్డి, మారథాన్ సభ్యులు పాల్గొన్నారు. 23న జరుగనున్న వరంగల్ ట్రైసిటీస్ ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ మారథాన్‌ను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా ప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు. వరంగల్ క్రెడాయ్ సౌజన్యంతో తెలంగాణ రన్నర్స్, వరంగల్ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే హాఫ్ మారథాన్ కార్యక్రమం ద్వారా వరంగల్‌కు మరింత ప్రాచుర్యం లభిస్తుందని అన్నారు.

మారథాన్‌ను మొత్తం మూడు విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5 కిలో మీటర్లు, 10 కిలో మీటర్లు, 21.10 కిలోమీటర్లుగా విభజించి అందులో విజేతలైన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వనున్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మారథాన్‌లో జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఇతర ఉన్నతస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ఈ మారథాన్ యేటా నవంబరులో నిర్వహించాలని తలపెట్టినట్లు విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మారథాన్‌లో వయసుతో నిమిత్తం లేకుండా ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావచ్చని అన్నారు. ఇందులో పాల్గొనే వారికి చిప్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా వారి రన్ టైమ్‌ను గుర్తిస్తామన్నారు.

మారథాన్‌లో పాల్గొనేందుకు ఇంతవరకు సుమారు 2600 మంది నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కాళోజీ కళా క్షేత్రం నుంచి ఫారెస్టు ఆఫీస్, ఫాతిమా జంక్షన్, వడ్డెపల్లి, కాకతీయ యూనివర్సిటీ మీదుగా మళ్లీ కాళోజీ సెంటర్ వరకు ఉంటుందని తెలిపారు. మారథాన్‌లో పాల్గొనే వారికి అక్కడక్కడ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీరు, వైద్య సదుపాయాలు, మొబైల్ టాయిలెట్ల వద్ద ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 5 గంటలకు 21.10 కిలోమీటర్ల రన్, 6 గంటలకు 10 కిలో మీటర్ల రన్, 7 గంటలకు 5 కిలో మీటర్ల రన్ ప్రారంభమై 9 గంటల వరకు ముగుస్తుందని, అనంతరం కాళోజీ కళాక్షేత్రం పక్కన ఉన్న హయాగ్రీవాచారి గ్రౌండ్‌లో బహుమతుల ప్రదానం, ముఖ్య అతిథుల ప్రసంగాలు ఉంటాయని విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మారథాన్ పోస్టర్‌ను, టీషర్టులను ఆవిష్కరించారు. మీడియా సమావేశంలో మారథాన్ రన్నర్స్ జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్, ఉదయ్‌రెడ్డి, రవి, చరణ్, సరస్వతి, తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

క్రైం అడిషినల్ డీసీపీ బాలస్వామి



బాలస్వామి

వరంగల్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం అడిషినల్ డీసీపీ బాలస్వామి సూచించారు. ఇంటికి తాళం వేసినప్పుడు బయట వ్యక్తులకు కనినించకుండా జాగ్రత్త వహించాలి, విలువైన బంగారం నగలను లాకర్‌లో భద్రపరచాలి, తాళం చెవులు బయట పెట్టడం మానేయాలన్నారు. అదే విధంగా సీసీ కెమెరాలు విధిగా 30 రోజుల బ్యాక్‌అప్ ఉంచి లెన్స్ ఉన్న సీసీ కెమెరాలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఏర్పాటు చేసుకున్న కెమెరాలల్లో ఒక కెమెరానైనా రోడ్డును కవర్ చేసుకునేలా జాగ్రత్తపడి, అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాల న్నారు. ప్రతీ ఇంటికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వలన 90 శాతం దొంగతనాలను నివారించవచ్చని, ఇళ్ళలో నగదు లేదా బంగారం కంటే కనీసం ఒక మనిషి ఇంట్లో ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. ఇళ్లు వదిలి వెళ్లాల్సి వచ్చినప్పుడు పక్కింటి వారిని గమనిస్తూ ఉండాలని చెప్పాలన్నారు. దొంగతనం జరిగినట్లయితే పోలీసులు వచ్చేవరకు ఆ రూంలోని వస్తువులను ఎవరు తాకవద్దని సూచించారు.

సాయికృప మండల సమాఖ్యకు జాతీయ అవార్డు

రూ.లక్ష నగదు బహుమతి



అవార్డును అందుకుంటున్న సాయికృప మండల సమాఖ్య ప్రతినిధులు

హనుమకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని సాయికృప మండల సమాఖ్య జాతీయ స్థాయిలో ఉత్తమ మండల సమాఖ్య అవార్డును అందుకున్నది. దీనితోపాటు రూ. లక్ష నగదు బహుమతిని కూడా పొందింది. శుక్రవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్‌ఆర్‌డీ)లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి చేతుల మీదుగా సాయికృప మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి స్రవంతి, కోశాధికారి సృజన ఈ అవార్డును అందుకున్నారు.

ఏపీ మాస్ అనే స్వచ్ఛంద సంస్థ యేటా ఇచ్చే అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఎంట్రీలను ఆహ్వానించగా దేశవ్యాప్తంగా 462 మండల సమాఖ్యల నుంచి నామినేషన్లు వచ్చాయి. వీటిలో ఉత్తమమైనవిగా భావించిన 13 సమాఖ్యలను ఎంపిక చేశారు. ఇందులో జాతీయ స్థాయిలో మూడు సమాఖ్యలు, ప్రాంతీయ సమాఖ్యలో 9 సమాఖ్యలు ఎంపికయ్యాయి. జాతీయ స్థాయిలో సాయికృప మండల సమాఖ్య ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డును గెలుచుకున్నది. బ్యాంకు లింకేజీ, రికవరీ, పుస్తక నిర్వహణ, రిపేమెంట్, టార్గెట్ ఆచీవ్‌మెంట్, ఆదాయ అభివృద్ధి పనులు వంటి తదితర అంశాల్లో సమాఖ్య పనితీరు సమర్థవంతంగా ఉన్నందుకు ఈ ఎంపిక జరిగిందని డీఆర్‌డీఏ ఐబీ ఎం.దయాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీహెచ్ చీఫ్ జనరల్ మేనేజర్ నారాయణ్ గోయల్‌తో పాటు సమాఖ్య ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. నగదు బహుమతిగా గెలుచుకున్న రూ.లక్షను సమాఖ్య ఆదాయాభివృద్ధికి వినియోగిస్తారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూపకల్పన

మేయర్ గుండు సుధారాణి



ఉర్సుగుట్ట వద్ద ఎస్టీపీని పరిశీలిస్తున్న మేయర్, ప్రతినిధులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు డీపీఆర్ రూపకల్పన చేస్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో టీజీసీయూ ఆర్టీఐ, న్యూఢిల్లీకి చెందిన అళ్వరో చెర్రీస్, సౌత్ ఏషియా పోర్ట్ పోలియో లూకాస్, జర్మనీ దేశ ప్రతినిధుల బృందాలతో పాటు కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నగరంలో చేపడుతున్న పనులను వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో 66 డివిజన్‌లలో యూజీసీతో పాటు నీటి సరఫరా అవసరమని రూ. 544 కోట్లు కేటాయించారన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి మేయర్, కమిషనర్ ముందస్తు ప్రణాళికలు బాగున్నాయని ప్రతినిధుల బృందం అభినందించారు. అనంతరం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు వీక్షించారు. ఈ సమావేశంలో జర్మనీదేశ ప్రతినిధులతో పాటు జాయింట్ డైరెక్టర్ సాయినాథ్, అదనపు డైరెక్టర్ ఫణి, ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌వో రమేష్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఈఈ మాధవిలత, ఇరిగేషన్ డీఈ హర్షవర్థన్, బల్దియాకు చెందిన డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సమాచార కమిషనర్‌ను కలిసిన గ్రేటర్ కమిషనర్

రాష్ట్ర సమాచార కమిషనర్ అయోధ్యరెడ్డి శుక్రవారం వరంగల్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కలిసి పూలమొక్కను అందించారు. సమాచార హక్కు చట్టంపై జరిగిన కార్యక్రమంలో అనంతరం చహత్ బాజ్‌పాయ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచాలి

పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమించే పోలీసులు తమ వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. వరంగల్ మెడికవర్ హాస్పిటల్ సహకారంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సీపీ శుక్రవారం ప్రారంభించారు. నిరంతరం విధి నిర్వహణకు అంకితమైన పోలీసులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్ ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్, గాస్ట్రోఎంటరాలజిస్ట్, ఫిజీషియన్, న్యూరాలజిస్ట్ విభాగాలకు చెందిన వైద్యనిపుణులచే శిబిరానికి తరలివచ్చిన పోలీసులు వారి కుటుంబ సభ్యులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసులు ఆరోగ్యకరంగా ఉన్నపుడే సమాజానికి మెరుగైన సేవలు అందించగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ప్రభాకర్ రావు, బాలస్వామితో పాటు జిల్లా వైద్యాధికారి అప్పయ్య, పోలీస్ సిబ్బంది, మెడికవర్ వైద్యులు పాల్గొన్నారు.

రేపు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడి

వరంగల్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మారథాన్ రన్ నేపథ్యంలో ఆదివారం నగరంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు పలు ట్రాఫిక్ మార్గాల్లో డైవర్షన్ అమలులో ఉంటుందని, వాహనదారులు ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు. 100 ఫీట్ల రోడ్డులో వన్ వే అమలులో ఉంటుందన్నారు. సీఎస్ఆర్ గార్డెన్ నుంచి అదాలత్ జంక్షన్ వర కు, అంబేద్కర్ జంక్షన్ నుంచి అదాలత్ వరకు, ఫాతిమా జంక్షన్ నుంచి ఎన్ఐటీ వరకు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు.

ట్రాఫిక్ డైవర్షన్ మార్గాలు

- హైదరాబాద్ నుంచి హనుమకొండ వచ్చే వాహనాలు, బస్సులు ఫాతిమా జంక్షన్ నుంచి వడ్డెపల్లి చర్చి, కేయూ జంక్షన్, నయింనగర్, హెడ్ క్వార్టర్ జంక్షన్ మీదుగా హనుమకొండ బస్టాండ్‌కు చేరుకోవాలి.
- హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు అశోక జంక్షన్ నుంచి ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ, కేయూసీ, తిరుమల బార్, వడ్డెపల్లి చర్చి, ఫాతిమా జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- కరీంనగర్ వెళ్లే బస్సులు, వాహనాలు అశోక జంక్షన్, ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ, కేయూసీ జంక్షన్ నుంచి వెళ్లాలి.
- ఖమ్మం నుంచి వచ్చే వాహనాలు, బస్సులు సీఎస్ ఆర్ గార్డెన్ డైవర్షన్ తీసుకొని పోతన జంక్షన్ మీదుగా హనుమకొండకు రావాలి.

నిధులను సక్రమంగా ఖర్చు చేయాలి

(5వ పేజీ తరువాయి)

భోజనం అందుతోందని, ఆ సేవలను మున్సిపల్ కార్పొరేషన్ 14,43 డివిజన్లకు విస్తరించాలని కోరారు. బస్తీ దవాఖానాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ సత్యశారదను ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య సత్కరించారు. దక్షిణ భారత దేశంలో జల సంరక్షణ కేటగిరి-2లో వరంగల్ జిల్లాకు మొదటి స్థానం దక్కిన నేపథ్యంలో ఇటీవల ఢిల్లీలో అవార్డుతో పాటు రూ. కోటి బహుమతి అందుకున్న సందర్భంగా ఆమెను ప్రశంసించారు.

సీసీఐ ఆంక్షలను ఎత్తివేయాలి

(5వ పేజీ తరువాయి)

సాంకేతిక సమస్యలతో స్లాట్లు బుక్ కాక రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రైతులకు ఇబ్బందులు కలిగించే యాప్‌లను తొలగించి పత్తి కొనుగోళ్లపై విధించిన అంక్షలను వెంటనే ఎత్తివేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, రాగుల రమేష్, టి.ఉప్పలయ్య, గొడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న, జి.రాములు, కె.లింగయ్య, మంద సంపత్, ఎల్.దీప, డి.భాను, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లా స్థాయి అండర్-14 క్రికెట్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో జిల్లా స్థాయి అండర్-14 క్రికెట్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాలురు విభాగంలో కురుణాపురం సమీపంలోని వంగపల్లి క్రికెట్ మైదానంలో రెండురోజుల పాటు జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి ఆరు జట్లకు ఎంపిక పోటీలు నిర్వహించి వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఒక జట్టును ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంపిక చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు ఎంపికైన జట్టు సభ్యులు డిసెంబరు చివరివారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న వన్‌డేలీగ్ టోర్నమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1సెప్టెంబరు 2011 తరువాత జన్మించిన వారు అర్హులని, ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈనెల 23వ తేదీన వంగపల్లిలోని క్రికెట్ మైదానంలో రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9849570979 నెంబర్‌లో సంప్రదించాలని శ్రీనివాస్ సూచించారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాల నాయకుల అక్రమ అరెస్టు అప్రజాస్వామికమని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకుడోత్ అశోక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనుమతి లేని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన విద్యార్థి సంఘాలను ఖాతరు చేయకపోవడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం కలెక్టర్లకు తగదని తెలిపారు. వినతి పత్రాలు స్వీకరించిన కలెక్టర్ల తీరును నిరసిస్తూ బైఠాయించిన విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసుల దురుసు ప్రవర్తనను ఖండించారు. శాంతియుతంగా వినతిపత్రం సమర్పించేందుకు వచ్చిన విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు.

రూ.లక్ష బిల్లుకు రూ.10వేలు లంచం

(5వ పేజీ తరువాయి)

పెద్దమడూరు, కోలుకొండ, అప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం కోసం పైపులైన్ పనులు చేపట్టాడు. పనులు పూర్తయి ఆరేళ్ల గడిచినా బిల్లులు చెల్లించడంలో అధికారులు జాప్యం చేశారు. బిల్లులు రావడానికి ఎంబీ రికార్డు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ పలుమార్లు బిల్లులు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.సంధ్యారాణిని కోరాడు. అయితే ఆమె నాన్చుతూ వచ్చారు. రూ.10వేలు ఇస్తేనే రూ.1.05 లక్షల బిల్లులు చెక్ మెజర్ చేస్తానని తెలిపారు. దీంతో విసిగి వేసారిన సురేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు సంధ్యారాణి లంచం వేధింపులపై విచారణ చేసి, నిర్ధారణకు వచ్చిన తర్వాత పక్కా స్కెచ్ వేశారు.

వారి సూచనల మేరకు శుక్రవారం సురేష్ పాలకుర్తిలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి వెళ్లి డీఈ సంధ్యారాణిని కలిశాడు. ఆమె సూచనల మేరకు కార్యాలయంలో పని చేస్తున్న ప్రైవేట్ ఉద్యోగి మహేందర్‌కు రూ.10వేలు ఫోన్‌పే చేశాడు. అనంతరం ఆ స్క్రీన్‌షాట్‌ను డీఈకి పంపాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు సంధ్యారాణిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె సెల్‌ఫోన్‌తోపాటు ప్రైవేటు ఉద్యోగి మహేందర్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. డీఈపై కేసు నమోదు చేసి, ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ రమేష్ తెలిపారు. ఈ దాడుల్లో సీఐలు ఎస్.రాజు, ఎల్. రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల సాధన సభను విజయవంతం చేయాలి

టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఎన్‌జీఓలు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 28వ తేదీన నిర్వహించే ఉద్యోగుల సమస్యల సాధన సభను విజయవంతం చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని టీఎన్‌జీఓస్ భవనం ఎదుట శుక్రవారం సభకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల సాధనకు రాష్ట్రంలోనే మొదటిసారిగా హనుమకొండ జిల్లా కేంద్రంగా ఉద్యోగుల సమస్యల సాధన సభ పెడుతున్నామని, ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఉద్యోగులు కూడా ప్రజల్లో భాగమేనని, వారి సమస్యలు పరిష్కరించే బాధ్యత కూడా ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి, ములుగు జిల్లా అధ్యక్షుడు పోలురాజు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సర్వర్ హుస్సేన్, జిల్లా నేతలు బైరి సోమయ్య, గాజె వేణుగోపాల్‌రెడ్డి, మేడి చైతన్య, నాగరాజు, పుల్లూరు వేణుగోపాల్, పనికెల రాజేష్, శ్యాంసుందర్, రామునాయక్, అనూప్, పృథ్వీరాజ్‌తో పాట ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్య వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడుతుంది

జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్య వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడుతుందని, ప్రతిభను, సృజనాత్మకను వెలికితీస్తుందని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న అన్నారు. వరంగల్ హంటర్‌రోడ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో శుక్రవారం ఎంఎ తెలుగు కోర్సు నూతన విద్యార్థులకు స్వాగత వేడుక ఘనంగా నిర్వహించారు. పీఠం విద్యార్థిని రేలా రేలా శాలిని స్వాగతం పాటతో అలరింపజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గడ్డం వెంకన్న మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు కళల్లో రాణించాలని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అమేర్ అలీఖాన్, పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసాని సురేశ్, డాక్టర్ చూరెపల్లి రవికుమార్, అబ్బు గోపాల్‌రెడ్డి, డాక్టర్ సునీత, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, పరవస్తు విజయలక్ష్మీ, సునంద, ఆంజనేయులు, అశోక్, సులోచన, సతీష్, శాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీసులు రిలీజ్ చేయాలి

రాంనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరికోతలు పూర్తి అవుతున్న నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన వ్యవసాయ సర్వీసులు రిలీజ్ చేయాలని ఎన్పీడీసీఎల్‌సీ ఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో 17 సర్కిళ్ల ఎస్ఈలతో సీఎండీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. వచ్చే మూడు నెలలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకొని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్‌ల సర్వీసుల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. టీజీ ఐపాస్, హెచ్‌టీ (సింగిల్ విండో) సర్వీసులపై సమీక్షిస్తూ సర్వీసుల మంజూరులో జాప్యం లేకుండా చేయాలన్నారు. సీఈ సదర్‌లాల్, కమర్షియల్ డీఈ జమున, ఏడీఈ మధుకర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గోల్డ్ కప్ టీ-20 టోర్నీని వినియోగించుకోండి

టీసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయచందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీయడానికి తెలంగాణ గోల్డ్ కప్ 2025 టీ-20 టోర్నీ దోహద పడుతుందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ సుబేదారిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయచందర్‌రెడ్డి పాల్గొని తెలంగాణ గోల్డ్ కప్ టీ-20 టోర్నీ వివరాలను వెల్లడించారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న తెలంగాణ గోల్డ్ కప్ టోర్నీలో పాల్గొననున్న జిల్లా జట్టును ఎంపిక చేయడానికి ఈ నెల 23న హనుమకొండలోని జేఎన్ఎస్‌లో హనుమకొండ జిల్లా జట్టుకు, వరంగల్ లోని ఓసిటీలో వరంగల్ జిల్లా జట్లకు ఓపెన్ టూ ఆల్ విభాగంలో జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జట్లు ఈ నెల 24నుంచి ఖమ్మం జిల్లా వేదికగా నిర్వహించనున్న జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

జోనల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ గోల్డ్ కప్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అదే విధంగా గతంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిర్వాహకులు పలు అక్రమాలు చేపట్టడం ద్వారా ప్రతిభ కలిగిన క్రీడాకారులు నష్టపోయారని గుర్తు చేశారు. గ్రామీణప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రికెటర్లను ప్రోత్సహించడమే ధ్యేయంగా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ పని చేస్తుందని విజయచందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో టీసీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి జయపాల్, సమీ, టీసీఏ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6850	6300
మక్కలు	1870	1521
కందులు	6063	3022
పెసళ్లు	5156	3022
పల్లికాయ (సూక)	6630	3500
పల్లికాయ (పచ్చిది)	6200	3890
పసుపు (కాడి)	7779	6765
పసుపు (గోల)	11099	9987
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	15000	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	19000	12000
యూఎస్341ఏసీ	18000	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

పథకం పడావు



అటకెక్కిన పశుగ్రాసం పెంపకం

- ఒక్క లబ్ధిదారుడికి కూడా అందని సబ్సిడీ
- ట్రెజరీ అధికారుల తీరుతో నీరుగారిన లక్ష్యం
- బిల్లులు ఉంటేనే విడుదలంటూ మెలిక
- మురిగిపోయిన రూ. 4 కోట్ల నిధులు

హనుమకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణకు రైతులు పడావు భూముల్లో పశుగ్రాసం పెంచుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకం.. రెవెన్యూ, ట్రెజరీ అధికారుల తీరు వల్ల అమలుకు నోచుకోవడం లేదు. నాలుగేళ్ల కిందట అమలులోకి వచ్చిన ఈ పథకం కోసం కేంద్రం నిధులు ఇస్తున్నా అమలు కావడం లేదు. ఇతర జిల్లాల్లో విజయవంతంగా అమలవుతున్నా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికారుల మధ్య సమన్వలోపంతో పడావుపడుతోంది. దీంతో రైతులు పశుగ్రాసం కొరతతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

పశుగ్రాసం కొరత

ఆరుగాలం రైతులకు వ్యవసాయంలో తోడ్పడే కాడెద్దులకు మేత కరవవుతోంది. ఇంటా, బయట పశుగ్రాసం దొరక్క మూగజీవాలు అంబా అంటున్నాయి. కాడెద్దులకు పశుగ్రాసం దొరకకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కొందరు ఆర్థిక భారమైన వేలకు వేలు ఖర్చుపెట్టి గడ్డిని కొని పశువులను సాకుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పశువులకు సంపదకు సరిపడా పశుగ్రాసం దొరకడం లేదు. ఉన్న కొద్దిపాటి మేత ప్రియమైంది. గతంలో సాగునీరు అందుబాటులో లేక ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల భూములు పడావు పడి ఉండేవి. అక్కడ గడ్డి విస్తారంగా పెరిగేది. పశువులకు కావలసినంత మేత లభించేంది. పశువులతో పాటు గొర్రెలు, మేకలకు సైతం గడ్డి దొరికేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. సాగునీరు అందుబాటులోకి వచ్చిన తర్వాత సాగునీరు పుష్కలంగా అందుబాటులో వచ్చింది. దీంతో క్రమంగా పడావు భూములు సైతం పచ్చని పొలాలుగా మారిపోయాయి. దీనితో పశువులకు మేయడానికి పచ్చగడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ అధికారులు కూడా పడావు భూములు చూపలేకపోతున్నారు.

మురిగిపోయిన నిధులు

పథకం లక్ష్యం బాగానే ఉంది కానీ.. ఎటొచ్చి అమలులోనే చిక్కులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలకు ఈ పథకం కింద గతంలో రూ.4కోట్లు మంజూరయ్యాయి. నిధులు కూడా విడుదలయ్యాయి. లబ్ధిదారులను ఎంపిక చేసే ముందు పడావు భూములు ఎక్కడెక్కడ.. ఎంత విస్తీర్ణంలో ఉందో తెలుసుకోవడమే కాకుండా పశుగ్రాసం పెంచడానికి ఆ నేలలు ఎంత మేరకు అనువైనవో జిల్లా పశు సంవర్థక శాఖ అధికారులు నిర్ధారించుకోవలసి ఉంటుంది. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారులకు లేఖలు రాశారు. హనుమకొండ జిల్లాలో అసలు పడావు భూములు లేవనే సమాధానం అధికారుల నుంచి వచ్చింది. దీనితో ఈ జిల్లాలో ఈ జిల్లాలో పథకం అమలే కాలేదు.

ట్రెజరీల మెలిక

మిగతా వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ పథకం అమలుకు ప్రయత్నా లు చేశారు. కానీ లబ్ధిదారులు ముందు గా తమ సొంత ఖర్చుతో పశుగ్రాసం చేపట్టి బిల్లులు పెట్టిన తర్వాతనే బిల్లులు పాస్ చేస్తామని ట్రెజరీ అధికారులు మెలికపెట్టడంతో పశుసంవర్ధక శాఖ అధికారు లు ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది. పడావు భూముల్లో ఒక హెక్టారులో పశుగ్రాసం పెంచుకోవడానికి ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో రూ.లక్ష ఇస్తుంది. పశుగ్రాసం పెంచడానికి చాలామంది ముందుకు వచ్చినా ఖర్చు పెట్టిన తర్వాతే బిల్లులు అనే సరికి వెనక్కితగ్గారు. సాధారణంగా ఏ పథకం కింద అయినా నిధులు మంజూరైతే సంబంధిత శాఖ అధికారుల ఖాతాల్లో అవి జమ కావాలి. అపుడు తమ వద్ద అందుబాటులో ఉన్న నిధులను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి మంజూరు ఇస్తారు. కానీ ఇక్కడ ట్రెజరీ అధికారులు బిల్లులు పెడితేనే నిధులను విడుదల చేస్తామనే సరికి పథకం అమలుకాక లక్ష్యం నీరుగారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగేళ్లుగా ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో పడావు భూమిలో గడ్డిని పెంచేందుకు ఆసక్తి ఉన్నవారు ముందుకు వచ్చిన ప్రయోజనం లేకుండా పోయింది.

అటకెక్కిన పథకం

పడావు భూముల్లో పశుగ్రాసం పారదర్శకంగా పెంచేందుకు పరిరక్షణకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలి. కానీ అసలు పథకమే అమలు కాకపోవడంతో ఈ కమిటీల ఏర్పాటు కూడా జరగలేదు.

ఈ యేడు కూడా ఇప్పటి వరకు పథకం అమలుకు సంబంధించిన రీవాలిడేషన్ రాకపోవడం వల్ల అమలు అవకాశాలు కనిపించడం లేదు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిధుల విడుదల విషయంలో చేసిన కొన్ని మార్పుల వల్ల భవిష్యత్తులో ఈ పథకం అమలులో ఇబ్బందులు తొలగవచ్చునని తెలుస్తోంది. భవిష్యత్తులో ఆయా పథకాల కింద లబ్ధిదారులకు సబ్సిడీని నేరుగా పీఎఫ్ఎంఎస్ విధానంలో నేరుగా వారి ఖాతాలోనే జమ చేయాలని నిర్ణయం తీసుకోవడం వల్ల ట్రెజరీ అడ్డంకులు ఉండకపోవచ్చునని తెలుస్తోంది.

పథకం ఇలా..

పడావు భూముల అభివృద్ధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం వంద శాతం రాయితీ అందిస్తోంది. మూడేళ్లపాటు నిరంతరాయంగా గ్రాసం అందేలా విత్తనం ఎంపిక చేసుకోవాలి. ధాన్యపు జాతి, పప్పుజాతి, గడ్డి జాతి పశుగ్రాసాలతో పాటు లూసర్న్, అవిశ, గంగరావి వంటి మొక్కలు నాటు కోవచ్చు. గుర్తించిన భూమిలో నీటి లభ్యత లేనట్లయితే బోరు వేసుకోవాలి. పెంచుతున్న గ్రాసాన్ని సంరక్షించుకునేందుకు చుట్టూ బయోఫెన్సింగ్ వేసుకోవాలి. లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీలు 15శాతం, ఎస్టీలు 8శాతం మందికి అవకాశం కల్పిస్తారు.

రూ.లక్ష సబ్సిడీ



పశువులకు గ్రాసం కొరత రాకుండా భవిష్యత్తులో మేతను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో కేంద్రం పడావు భూముల్లో పశుగ్రాసం పెంపకానికి ప్రత్యేక పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. గ్రామాల్లో పడావు భూములను అభివృద్ధి చేసుకొని కావలసిన గ్రాసం పెంచుకునేందుకు రైతులకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 400 యూనిట్లు మంజూరు అయ్యాయి. అవసరమైన రాయితీని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసి ఇస్తారు. పశువులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో జీవాలు పెద్ద సంఖ్యలో ఉంటే ఆహారం సరిపోక వలసలు వెళ్లాల్సి వస్తోంది. ఈ పథకం ద్వారా దీనిని నివారించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పడావు భూములు సుమారు 42 వేల ఎకరాల వరకు ఉంటాయని అధికారుల అంచనా. ఇటీవల నీటి వనరులు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత వీటితో పాటు గుట్టలు, రాళ్ళు, రప్పలు ఉన్నచోట కూడా సాగులోకి తెస్తున్నారు. ఒక దశలో పశువులు మేత కోసం సంచరించేందుకు ఖాళీ స్థలాలు లేకుండా పోయాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని పడావు భూముల్లో గ్రాసం పెంచినట్లయితే ఈ పథకం ద్వారా పశువులకు ప్రయోజనం చేకూరుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

సెంట్రల్‌జైలు నిర్మాణం ఏదీ!?

- పాత భవన సముదాయం కూల్చివేసి నాలుగున్నరేళ్లు
- పట్టించుకోని పాలకులు



వరంగల్ సెంట్రల్ జైలు పాత చిత్రం.. (ఫైల్)

మామునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే పేరుగాంచిన వరంగల్ సెంట్రల్ జైలు కనుమరుగై నాలుగున్నరేళ్లు అవుతోంది. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం రాజులు నిర్మించిన ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, నిజాం రాజులకు వ్యతిరేకంగా పనిచేసిన వారు, తెలంగాణ ఉద్యమకారులు, మావోయిస్టు అగ్రనేతలు లాంటివారెందరో ఇందులో శిక్ష అనుభవించారు. ఎంతో మంది ఖైదీలకు జీవిత పాఠాలు నేర్పిన ఘనమైన చరిత్ర ఈ కారాగారానికి ఉంది. 1886లో నిజాంలు నిర్మించిన ఈ భవనాన్ని సూపర్ స్పెషాలిటీ నిర్మాణం కోసం 2021 జూన్‌లో కూల్చివేశారు. మొత్తం 66 ఎకరాల్లో విస్తీర్ణంలో పరిపాలన భవనం, ఖైదీల బ్యారక్‌లు, హైసెక్యూరిటీ బ్యారక్‌లు, ఖైదీల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన కర్మాగారాలు ఉండేవి. ఆ తర్వాత మామునూరులో అత్యాధునిక హంగులతో నూతన సెంట్రల్ జైలును రెండేళ్లలో నిర్మిస్తామని చెప్పింది. జైల్లో ఉన్న దాదాపు వెయ్యి మంది ఖైదీలను ఇతర జైళ్లకు తరలించింది. కాని భవనాన్ని నిర్మించలేదు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు. పాత సెంట్రల్ జైలు భవనంలో ఉన్న ఖైదీలను వారి కుటుంబ సభ్యులు అప్పుడో ఇప్పుడో కలుసుకునేవారు. ఇప్పుడు వారు దూర ప్రాంతాల్లో ఉండడంతో అక్కడికి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఇప్పటికైనా వరంగల్ సెంట్రల్ జైలు నిర్మించాలని ఖైదీల కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

20 మంది ఖైదీలకు 40 మంది సిబ్బంది..

వరంగల్ మామమునూరులో సెంట్రల్ జైలు నిర్మాణం కోసం (టీఎస్ఎస్‌పీ) 4వ బెటాలియన్ క్యాంపస్ పక్కన 101 ఎకరాల స్థలం కెటాయించినప్పటికీ నిర్మాణం కోసం ఎలాంటి బడ్జెట్ కేటాయించనట్లు తెలుస్తోంది. పైగా 20 మంది ఖైదీలకు 40మంది పోలీసులు పనిచేస్తున్నారు. మామునూరులో 20 మంది ఖైదీలు ఉండగా 40మంది ..ఒక డీఎస్పీ, ఒక జైలర్, ఒక డిప్యూటీ జైలర్ ఇంకా సీనియర్ పోలీసులు ఇక్కడ పనిచేస్తున్నట్లు తెలిసింది.

మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారం

- నిందితుడు 70 ఏళ్ల వృద్ధుడు
- బాధితురాలికి వరుసకు పెదనాన్న
- ములుగు జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసిన దారుణం

వెంకటాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అతడు 70 ఏళ్ల వృద్ధుడు.. కానీ కామంతో కళ్లు కుమూసుకు పోవడంతో వావి వరుసలు మరిచాడు. వరుసకు కూతురు అయ్యేమతిస్థిమితం లేని 15 ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన ములుగు జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. వెంకటాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు ఊరూరు తిరుగుతూ వంట సామగ్రి విక్రయిస్తుంటారు. వీరికి 15 ఏళ్ల కూతురు ఉంది. ఈమెకు మతిస్థిమితం లేకపోవడంతో ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామంలో 15 రోజుల క్రితం వరుసకు పెదనాన్న అయ్యే 70 ఏళ్ల వృద్ధుడు ఒంటరిగా వున్న బాలికపై అత్యాచారం జరిపాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలుపడంతో కులపెద్దలు పంచాయితీ పెట్టారు. చివరకు రూ.6 లక్షలు బాధిత బాలిక కుటుంబానికి ఇవ్వాలని, మరో రూ.2లక్షలు కులసంఘ పెద్దలకు ఇవ్వాలని తీర్మానించారు. ఇందుకు అత్యాచారానికి పాల్పడినవృద్ధుడు కూడా అంగీకరించినట్లు తెలిసింది. అయితే ఒప్పుకున్నవిధంగా వృద్ధుడు బాలిక కుటుంబానికి రూ.6లక్షలు, పెద్దమనుషులకు రూ.2లక్షలు ఇవ్వకపోవడంతో విషయం బయటకు పొక్కింది. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు శుక్రవారం వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

యునెస్కో సదస్సుకు రోహిణి

డిసెంబర్12 నుంచి 15వరకు హాంకాంగ్‌లో సదస్సు



కరీమాబాద్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యునెస్కో సదస్సుకు వరంగల్ పెరుకవాడకు చెందిన రంగరాజు రోహిణి ఎంపికైంది. ఆమె ప్రస్తుతం హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. వెనుకబడిన వర్గానికి చెందిన రోహిణి అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 4వ అంతర్జాతీయ యునెస్కో మోడల్ ఎథిక్స్ ఆఫ్ న్యూరో టెక్నాలజీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సదస్సు డిసెంబర్ 12 నుంచి 15వరకు హంకాంగ్‌లో జరగనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతుల ఎంపికలో మన దేశం నుంచి రోహిణికి స్థానం లభించడం విశేషం. ఈ సందర్భంగా యునెస్కో తెలంగాణ స్టేట్ చాప్టర్ కో-ఆర్డినేటర్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు రోహిణికి అభినందనలు తెలిపారు. అయితే అమెకు హంకాంగ్ వెళ్లడానికి అవసరమైన ప్రయాణ ఖర్చులు భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

అంతా డొల్ల..!

- అధ్వానంగా అమృత్‌భారత్ పనులు
- యేడాదిలోపే ప్లాట్‌ఫారాలపై పగుళ్లు..
- పనిచేయని లిఫ్టులు.. కుంగుతున్న ఫ్లోర్
- మూణ్నాళ్ల ముచ్చటగా ఆధునిక సౌకర్యాలు
- అధ్వానంగా వరంగల్ రైల్వే స్టేషన్



నాలుగో ప్లాట్‌ఫామ్‌పై నూతన లిఫ్ట్ ముందు పగుళ్లు ఏర్పడిన దృశ్యం

గిర్మాజిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సౌకర్యాలు.. అత్యాధునిక హంగులు.. ఎయిర్‌పోర్టును తలపించేలా నిర్మాణం.. అమృత్ భారత్ పథకం కింద కోట్ల రుపాయలతో వరంగల్ రైల్వే స్టేషన్‌ను తీర్చిదిద్దారు. అద్భుతం అనిపించారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా అట్టహాసంగా ప్రారంభించారు. ఇంతవరకు బాగేదే ఉంది.కాని.. ప్రారంభించిన మూణ్నాళ్లకే పనుల్లో డొల్లతనం బయటపడింది. ప్లాట్‌ఫారాలపై పగుళ్ల ఏర్పడ్డాయి. లిఫ్టులు సరిగా పనిచేయడం లేదు.

తొలుత రూ.28 కోట్లతో..

వరంగల్ చారిత్రక, పర్యాటక ప్రాంత ప్రాముఖ్యతను గుర్తించిన రైల్వేశాఖ తొలుత పర్యాటక ప్రాంతాల రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి పథకం కింద రూ.18 కోట్లు కేటాయించింది. వీటితో ప్లాట్‌ఫారాలు, విశ్రాంతిమందిరాలు, వరంగల్, శివనగర్ వైపు స్టేషన్ భవనాలను అభివృద్ధి చేశారు. కాకతీయ చారిత్రక కళావైభవం ఉట్టిపడేలా వరంగల్ వైపు భవనాన్ని సుందరీకరించారు. స్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫారాలపై పాత ఫ్లోరింగ్‌ను పూర్తిగా తొలగించి కొత్తగా వేశారు. అలాగే విశ్రాంతి మందిరాలలోని ఫ్లోర్, ఫర్నిచర్, ఫ్యానులు కొత్తవి ఏర్పాటు చేశారు.

తర్వాత రూ.25 కోట్లు..

అనంతరం అమృత్ భారత్ పథకం కింద మరో రూ.25 కోట్లతో వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఎయిర్ పోర్ట్ తరహాలో సకల సదుపాయాలతో అభివృద్ధి చేశారు. సుమారు రెండు సంవత్సరాల పాటు పనులు చేశారు. ఎస్కలేటర్లు, లిఫ్ట్‌లు, భారీ ర్యాంపులు, భారీ వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, అధునాతనంగా ఉచిత, ప్రిపెయిడ్ ఎసీ విశ్రాంతి మందిరాలు, నాలుగు ప్లాట్‌ఫారాల ఫ్లోరింగ్, రైల్వేస్టేషన్ యావత్తు విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రత్యక్షంగా ప్రారంభించారు. తీరా 9 నెలలు గడవక ముందే ప్లాట్‌ఫారాలపై పగుళ్లు వచ్చాయి. నాలుగో ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన భారీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటుచేసిన నూతన లిఫ్ట్ చుట్టూరా పగుళ్లు ఏర్పడ్డాయి. గ్రానైట్ రాళ్లు విరిగి కుంగిపోయి గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణికులు ముఖ్యంగా వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. మొదటి ప్లాట్‌ఫాంపై కూడా ఇదే పరిస్థితి ఉంది. జీఆర్‌పీ స్టేషన్ ముందు ప్లాట్‌ఫాంపై పెద్ద గుంత పడడంతో అంతా కుంగినట్లు కనిపిస్తున్నది. మరోవైపు లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఎస్కలేటర్లు అంటే భయపడే వృద్ధులు మెట్లు ఎక్కలేక నరకం చూస్తున్నారు. అయినప్పటికీ స్థానిక రైల్వే ఇంజనీరింగ్ అధికారులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు వరంగల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించి విచారణ చేపట్టాలని, వెంటనే తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సహకార స్ఫూర్తికి రాజకీయ చీడ

- ప్రాభవం కోల్పోతున్న ఖానాపురం సొసైటీ
- ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే ఉత్తమ సంఘంగా గుర్తింపు
- కోర్టు పలుమార్లు మొట్టికాయలు వేసినా మారని తీరు
- మూడోసారి కొలువుదీరిన సొసైటీ పాలకవర్గం



బాధ్యతలు చేపడుతున్న సొసైటీ పాలకవర్గం

ఖానాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ఆధిపత్య క్రీడలో ఖానాపురం సొసైటీ ప్రతిష్ట మసకబారుతున్నది. వరుస కోర్టు వివాదాలతో రైతులకు సక్రమంగా సేవలు అందించలేక పోతోంది. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే ఉత్తమ సహకార సంఘంగా నిలిచి పలు అవార్డులను సొంతం చేసుకున్న ఈ సొసైటీ రాజకీయ జోక్యంతో అస్తవ్యస్తంగా మారుతోంది. 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. వీటి పాలకవర్గాల పదవి కాలం 2025 ఫిబ్రవరి 14తో ముగిసింది. దీంతో వెంటనే మళ్లీ ఎన్నికలు నిర్వహించలేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సొసైటీ పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ఖానాపురం సొసైటీ పాలకవర్గం పదవీ కాలాన్ని మాత్రం ప్రభుత్వం పొడిగించలేదు.

పీఏసీగా సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజా రవికిరణ్‌కు బాధ్యతలు అప్పగించింది. దీంతో సొసైటీ పాలకవర్గ సభ్యులు కోర్టుకు వెళ్లారు. కోర్టు పాత పాలకవర్గాన్నే కొనసాగించాలని తీర్పునివ్వడంతో 2025 మార్చి 1న తిరిగి పాలకవర్గం రెండోసారి కొలువుదీరింది. మళ్లీ ప్రభుత్వం 2025 మే 26న పాలకవర్గాన్ని రద్దుచేస్తూ పీఏసీగా సహకార శాఖకే చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఈగ వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించింది. దీంతో మరోమారు సొసైటీ పాలకవర్గం హైకోర్టుకు వెళ్లారు. ఈ నెల 19న హైకోర్టు పాత పాలకవర్గాన్నే కొనసాగించాలని తీర్పునిచ్చింది. దీంతో శుక్రవారం ముచ్చటగా మూడోసారి ఛైర్మన్ రామస్వామినాయక్‌తో పాటు 13 మంది డైరెక్టర్లతో కూడిన పాలకవర్గం కొలువుదీరింది.

సేవలలో జాప్యం..

సొసైటీ పాలకవర్గం రద్దవుతూ కొనసాగుతున్న తరుణంలో సొసైటీ పరిధిలోని రైతులకు సేవలు అందించడంలో జాప్యం జరుగుతున్నది. పాలకవర్గం ఉన్న సమయంలో ప్రధానంగా సీజన్‌కు ముందే పెద్దఎత్తున ఎరువులను (బఫర్‌స్టాక్ కింద) కొనుగోలు చేసుకుని గోదాములలో నిల్వ ఉంచేవారు. దీంతో రైతులకు యూరియా ఇబ్బందులు తలెత్తేవికావు. ఈ వానాకాలం సీజన్‌లో పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ముందస్తుగా ఎరువులను కొనుగోలు చేయకపోవ డం మూలంగా యూరియా దొరకక పాకాల ఆయకట్టు రైతులు చాలా అవస్థలు పడాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో సొసైటీ ఆధ్వర్యంలోనే ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు జరిగేవి. దీంతో సొసైటీకి ప్రతి సీజన్‌కు లక్షల రుపాయాల లాభం చేకూరేది. కానీ గత కొద్ది సంవత్సరాలుగా రాజకీయాలు పెరిగి రాజకీయ నాయకులు సూచించిన వారికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరవుతుండడంతో సొసైటీ కొనుగోళ్ల తగ్గుతున్నాయి. తద్వారా లాభాలు సైతం తగ్గుతున్నాయి.

పాలకవర్గంతో ఆటలాడుకోవద్దు...

నీతి నిజాయితీగా పనిచేసి సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన పాలకవర్గంతో ప్రభుత్వం ఆటలాడుకోవడం మంచిదికాదు. పాలకర్గాన్ని అన్యాయంగా రద్దు చేసిన ప్రతి సందర్భంలో కోర్టులు ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూనే ఉన్నాయి. ప్రతిపక్షం అనే కోణంలో చూసి ప్రభుత్వం పాలకవర్గాన్ని ఇబ్బందులకు గురిచేయడం మంచి సంస్కృతి కాదు. గతంలో పాలకవర్గాల గడువు ముగిసినపుడు ప్రభుత్వాలు ఇలా కక్షపూరితంగా వ్యవహరించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పాలకవర్గానికి సహకరించాలి.

గుగులోత్ రామస్వామినాయక్, సొసైటీ ఛైర్మన్

అంచనాల పెంపులో అక్రమాల కంపు

(5వ పేజీ తరువాయి)

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన చేసింది. 56ఎకరాల్లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు ఎంజీఎం ఆస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అన్ని కూడా ఒకే కాంప్లెక్స్ పరిధిలోకి తెచ్చేలా వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి 2021లో రూ.1,116 కోట్లు కేటాయిస్తూ అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ జీవో నెంబరు 158 విడుదల చేశారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ ఆస్పత్రి పనులను చేపట్టింది. అయితే ఏడాదికాకముందే ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1,725.95 కోట్లకు గత ప్రభుత్వం పెంచింది. అదనంగా రూ.625.95 కోట్ల వ్యయాన్ని పెంచడాన్ని గోప్యంగా ఉంచింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఎలాంటి అదనపు అంచనాలు లేకుండా రూ.1,725.95 కోట్లకు పెంచడంపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టింది. గత ఏడాది జూన్ 29వ తేదీన స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించి, అంచనాల పెంపుపై అనుమానాలు రావటంతో ఫోరెనిక్స్ ఆడిట్ రిపోర్టుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అన్ని కోణాల్లో ఫోరెనిక్స్ ఆడిట్ బృందం పరిశీలిన చేసిన అనంతరం సుమారు రూ.600 కోట్ల అంచనా వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా పెంచినట్లుగా నిర్ధారించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ప్రతీ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వానికి ఫోరెనిక్స్ ఆడిట్ బృందం నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.

మరోవైపు తెలంగాణ స్టేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్)ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు వరంగల్ సెంట్రల్ జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759గజాల స్థలాన్ని (56ఎకరాలు)బదిలీ చేస్తూ జీవో నెం.81ని జారీ చేసింది. టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్ర, హైదరాబాద్ నుంచి రూ.1,173 కోట్ల రుణం తీసుకుంది. అయితే ఈ మొత్తాన్ని ఆస్పత్రి నిర్మాణానికి ఖర్చు చేయకుండా, ఇతర వాటికి మళ్లించారు.

జైలు భూమిని తాకట్టు పెట్టడం ఏమిటని.. తీసుకున్న రుణాన్ని అస్పత్రికి కాకుండా ఇతర వాటికి మళ్లించటం ఏమిటని గత ప్రభుత్వ విధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తప్పు పట్టారు. దీనిపై గత ఏడాది ఆగస్టు 30వ తేదీన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో విచారణకు అదేశించారు. దీంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. అస్పత్రి నిర్మాణంలో భాగస్వామ్యం ఉన్న ఇంజనీర్లు, కాంట్రాక్టు కంపెనీతోపాటు పలువురు ప్రభుత్వ వైద్యులను కూడా విజిలెన్స్ అధికారులు విచారించారు. ఫోరెనిక్స్ ఆడిట్ రిపోర్టు పూర్తయినప్పటికీ విజిలెన్స్ నివేదిక అందిన తరువాతే అంచనాల పెంపునకు సహకరించిన పలువురు వైద్యులు, ప్రొఫెసర్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మార్చిలోగా సేవలు అందేనా..?

సూపర్ స్పెషాలిటీ అస్పత్రిని మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత ప్రభుత్వం పెంచిన అంచనా వ్యయం రూ.1,725.95 కోట్లపై ఆడిట్ చేసింది. అధికారులతో పలుమార్లు సమీక్షల అనంతరం రూ.1,558 కోట్లకు అంచనా వ్యయాన్ని కుదించింది. వీటిలో సివిల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్, పారిశుధ్య పనుల కోసం రూ.1159.77 కోట్లు కేటాయించారు. అలాగే వైద్య పరికరాలు, అనుబంధ పనుల కోసం రూ.10.71 కోట్లు, నిర్మాణాలు, పర్యావరణం, డిజైన్, ఎన్‌వోసీలు తదితర చట్టబద్ధమైన అనుమతుల కోసం రూ.4.47 కోట్లు కేటాయించారు. అలాగే అస్పతి భవన నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ శాఖకు రూ. 1.83 కోట్లు, జీఎస్టీలతోపాటు ఇతర పన్నుల కోసం రూ.22.80 కోట్లు కేటాయించారు. రూ.1,558 కోట్లతో అస్పత్రిని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2022-23లో కంటే ప్రస్తుతం నిర్మాణ వ్యయం భారీగా పెరిగినప్పటికీ అంచనా వ్యయాన్ని రూ.167.95 కోట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం తగ్గించింది. ఇప్పటివరకు 85 శాతం పైగా పనులు పూర్తయ్యాయని, అస్పత్రిలో ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాల్ కూడా చేపడుతున్నారు. నిధుల కొరత కూడా లేకపోవటంతో మార్చిలోపు పనులు పూర్తిచేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సూపర్ సేవలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఉన్నారు.

అక్రమాలపై రాజకీయం

సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మాణం, అంచనాల పెంపుపై రాజకీయ విమర్శలు పేలుతున్నాయి. గత ప్రభుత్వం పేదల అస్పత్రి పేరుతో సుమారు రూ.600 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపిస్తే.. తామే 85శాతం పనులు పూర్తి చేశామని, మిగతా పనులు కూడా పూర్తి చేసే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఇటీవల అస్పత్రిని పరిశీలించిన మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు.

అయితే అస్పత్రి అంచనాలను పెంచి హరీష్‌రావుకు సంబంధించిన బినామీ కంపెనీకి కేటాయించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలు రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఫోరెనిక్స్ ఆడిట్ రిపోర్టుతో పాటు విజిలెన్స్ నివేదికను విడుదల చేస్తే.. పేదల అస్పత్రికి కేటాయించిన సొమ్ముతో పాటు జైలును తాకట్టు పెట్టి తెచ్చిన నిధులు ఎవరి ఖాతాలోకి వెళ్లాయనేది వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.



రోగులకు మెరుగైన సేవలు అందించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి ఐడీబీఐ బ్యాంకు వారు అవసరమైన వైద్య పరికరాలు అనస్థీషియా ఎక్విప్‌మెంట్, బేబీ వార్మర్లు, మానిటర్లు, సెక్షన్ మిషన్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ, డిప్యూటీ జనరల్ మేనేజర్ సుష్మ రామరాజు, రీజినల్ మేనేజర్ పవన్‌కుమార్, మేనేజర్లు నాగరాజు, ప్రేమ్, డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఆర్మీ అధికారులు

కలెక్టర్‌ను కలిసిన ఆర్మీ అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జవహర్‌లాల్ స్టేడియంలో పదిరోజుల పాటు నిర్వహించిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆర్మీ అధికారులు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పాటునందించిన జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్‌కు ఈ సందర్భంగా ఆర్మీ అధికారులు కల్నల్ సునిల్ యాదవ్, మేజర్ ప్రకాష్‌చంద్రరాయ్ కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేశారు.

సమాచార కమిషనర్ అయోధ్యరెడ్డి కలిసిన కలెక్టర్

రాష్ట్ర సమాచార కమిషనర్‌గోరెడ్డి అయోధ్యరెడ్డి హనుమకొండ జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌కు చేరుకోగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మ ర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అయోధ్యరెడ్డికి జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలి కిన వారిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, అధికారులు ఉన్నారు.

అనుమతిలేని విద్యా సంస్థలను మూసివేయాలి

కేయూ క్యాంపస్ నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనుమతిలేని విద్యాసంస్థలను మూసివేయాలని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూలో జరిగిన సమావేశంలో నరేశ్ పాల్గొని మాట్లాడారు. అనుమతి లేకుండా నడుస్తున్న విద్యా సంస్థలపై జిల్లా కలెక్టర్‌తోపాటు విద్యాశాఖాధి కారులు చర్యలు చేపట్టడం లేదన్నారు. విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసూల్ చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ విద్యార్థు లకు సమయం ఇవ్వకుండా పోలీసులతో దాడి చేయించడం పట్ల బాధను వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాలపై ప్రైవేట్ విద్యాసంస్థల యాజమా న్యాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులపై దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు అర్షం చరణ్, విజయ్, భరత్, పీటర్, వేణుకార్తీక్, ఈశ్వర్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద ప్రత్యామ్నాయ ఆదాయం

హసన్‌పర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పశు సంపద రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయమార్గమని పశువైద్య, పశు సంవర్థక శాఖ జిల్లా ఇన్‌చార్జి పి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెంబర్తిలో శుక్రవారం మండల పశువైద్యాధికారి డాక్టర్ మాళవిక ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. శీతాకాలం సీజన్‌లో పశువులకు గర్భకోశ చికిత్స చేసుకొని పశు వులు ఎదకు వచ్చేలా చూసుకొని చూలు కట్టించుకోవాలన్నారు. ఇటీవల గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరిగిందని అలాగే పశువైద్య శిబిరా లను సద్వినియోగం చేసుకొని పశువులలో వచ్చే వ్యాధుల నివారణకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 38 పశువులకు గర్భకోశ చికిత్సలు, 65 దూడలకు నట్టల మందులు, 45 ఇతర వ్యాధులకు చికిత్స చేశామని మండల పశువైద్యాధికారి మాళవిక తెలిపారు. ఈ శిబిరంలో మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌వో బింగి సురేష్, ఎల్ఎస్ఏ అబ్దుల్‌నబీ, సిబ్బంది సాదిక్, రాహుల్, అల్వీరా కంపెనీ ప్రతినిధి వేల్పుల రమేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన సీఎండీ

రాంనగర్, నవంబర్ 21(ఆంధజ్యోతి): వరంగల్ ములుగు రోడ్‌లో నూతనంగా నిర్మించే వరంగల్ సర్కిల్ కార్యాలయ నిర్మాణ పనులను శుక్రవారం ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పరిశీలించారు. అదే విధంగా వరంగల్ డిస్ట్రిక్ట్ స్టోర్స్ నిర్మాణ పనులను కూడా పరిశీలించి తగు సూచనలు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే గణతంత్ర దినోత్సవానికి నిర్మాణం పూర్తికావాలని ఆదేశించారు. పనుల పురోగతిపై చర్చిస్తూ.. అధునాతనం గా తీర్చిదిద్దాలని, పచ్చదనం, మొక్కలు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నా రు. వరంగల్ డిస్ట్రిక్ట్ స్టోర్స్ డిసెంబర్ 31 వరకు పూర్తి అయ్యేలా చూడా లని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎస్ఈ కాసిడి గౌతమ్‌రెడ్డి, డీఈ ఆనందం, అనిల్‌కుమార్, ఈఈ సివిల్ వెంకటేశ్వర్లు, వెంకట్రామ్, ఏడీఈ సివిల్ ప్రణయ్, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయిని క్షమాపణ చెప్పాలి..

దళిత సంఘాల నాయకుల డిమాండ్



హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

హనుమకొండ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ముఖ్య మంత్రి తాటికొండ రాజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై శుక్ర వారం బీఆర్ఎస్, దళిత సంఘాలు, స్వేరోస్ ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ఉప ముఖ్య మంత్రి తాటికొండ రాజయ్య 30 ఏళ్లు ప్రజాసేవలో ఉన్నారని, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అణగారిన వర్గాల విద్యార్థుల కోసం ఎంతో కృషి చేశారని, అలాంటి వారిపై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కించపర్చినట్లు మాట్లాడడం దళిత సమాజాన్ని అవమానించినట్లేనని అన్నారు. రాజేందర్‌రెడ్డిపై పోలీ సులు, ఎస్సీ ఎస్టీ కమిషన్ సుమోటాగా తీసుకొని కేసు నమోదు చేయా లని డిమాండ్ చేశారు. స్వేరో నాయకుడు మంద శ్యామ్ మాట్లాడుతూ.. సోమవారంలోపు తాటికొండ రాజయ్య, ప్రవీణ్‌కుమార్‌లకు క్షమాపణ చెప్పకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో నక్కలగుట్ట కాళోజీ విగ్రహం నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి నివాసం వరకు శవయాత్ర నిర్వహిస్తా మని హెచ్చరించారు. దళిత విద్యార్థి సంఘాల నాయకుడు డాక్టర్ కంచర్ల మనోహర్, కార్పొరేటర్లు ఇమ్మడి లోహిత, కార్పొరేటర్ నర్సింగరావు, మాజీ కార్పొరేటర్ మేకల బాబురావు, సురేష్, మారెపల్లి మనోజ్, చక్రి, పున్నం చందర్, సదాంత్, ప్రభాకర్, జయరాం, హరినాథ్, మహేష్, రాజు, మంద సృజన్‌కుమార్, మహేందర్, అనిల్, ప్రసాద్, సృజన్, రాజశేఖర్, గణేష్, చిట్టిబాబు, రమేష్, రాజేంద్రప్రసాద్, సిద్ధూ, కృష్ణ పాల్గొన్నారు.

మత్స్యకారుల దినోత్సవాన్ని అధికారింగా నిర్వహించాలి..

మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్



గుడిబండల్, మచిలీబజార్ మత్స్యకార సొసైటీ సభ్యులను సన్మానిస్తున్న ముదిరాజ్ మహాసభ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారం గా నిర్వహించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా)వ్యవస్థాపక అ ధ్యక్షుడు పులి దేవేందర్ డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవా రం హనుమకొండ 8వ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవేందర్ పాల్గొని మాట్లాడారు. ముదిరాజ్‌ల కుల దైవం అయిన పెద్ద మ్మతల్లి బోనాల పండుగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆ రోజున ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ముదిరాజ్ విద్యార్థుల కోసం నగరంలో భవన నిర్మాణ ఏర్పాటుకు కాంగ్రెస్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారని దేవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా గుడిబండల్ జంక్షన్‌లోని మెపా జెండాను వారు ఆవిష్కరించారు. అనంతరం ముది రాజ్ కులస్థులను అతిథులు ఘనంగా సన్మానించా రు. ఈ సమావేశంలో ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి నీర టి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, జిల్లా ఉపా ధ్యక్షుడు విజేందర్, సభ్యులు రాజేష్, ఉమేష్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితమే ఒక సాహసం

అలలకు ఎదురీదుకుంటూ చేపలు పడుతూ జీవ నాన్ని కొనసాగిస్తున్న మత్స్యకారుల జీవితమే ఒక సాహసం లాంటిదని ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ ముది రాజ్ స్పష్టం చేశారు. శుక్రవారం ప్రపంచ మత్స్యకారు ల దినోత్సవంతో పాటు ముదిరాజ్ మహాసభ ఆవి ర్భవించి 11ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో హను మకొండ మచిలీబజార్‌లోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పులి రజనీకాంత్ పాల్గొని ముందుగా ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుడిబండల్, మచిలీబజార్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల సొసైటీ సభ్యులను ముదిరాజ్ మహాసభ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మత్స్య కారుల సంఘం సభ్యులు పుట్ట మహేందర్, పులి మధు, బయ్య శోభన్, సందీప్, రవీందర్, కొండ అశోక్, కుమారస్వామి, భరత్, బుచ్చిరాజు, అజయ్, శ్రీకాంత్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం

హసన్‌పర్తి: మండల కేంద్రంలోని హసన్‌పర్తి మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో శుక్రవారం ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు శీలం పృథ్వీరాజ్ ముది రాజ్ సంఘం జెండాను ఎగురవేసి స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పిట్టల కుమారస్వామి, పెద్దమ్మ నర్సింహరాములు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పెద్దమ్మ నాగరాజు, డైరెక్టర్లు శీలం భిక్షపతి, శీలం రాజేందర్, సంగినేని వీరేశం, పెద్దమ్మ సుధాకర్, వెంగళ రాజు, గోనెల ఉపేందర్, పల్ల పెద్ద మనుషులు పిట్టల మునీష్, పెద్దమ్మ మహేందర్, శీలం రవిచందర్‌తో పాటు ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

• మడికొండ : ప్రపంచ మత్స్యకార్మికుల దినోత్స వాన్ని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో మడికొండలోని పండుగ సాయన్న ముదిరాజ్ గ్రౌండ్‌లో ముదిరాజ్ సంఘం నేతలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఫిషరీస్ కార్పొరేషన్ మడికొండ అధ్యక్షుడు, ముదిరాజ్ యువత జిల్లా అధ్యక్షుడు దువ్వ నవీన్ ముదిరాజ్ జెండా ఆవిష్క రించి సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముదిరాజ్ సంఘం నేతలు నర్ర దుర్గయ్య, దువ్వ చిన్న కుమార్, విజయ్, కుక్కల దేవరాజ్, కుక్కల శ్రీకాంత్, మాస్టర్ కుమార్, మోరా రవి, బల్సుకూరి సమ్మయ్య, దువ్వ సదానందం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

• వడ్డేపల్లి: కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకా లను రూపొందించి అమలు చేయాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేం దర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జవహర్ కాలనీలోని మెపా రాష్ట్ర కార్యాలయంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్‌చేసి మత్స్య కారుల జెండాను ఆవిష్కరించారు.

అనంతరం మెపా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో దేవేందర్ ముదిరాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, రాష్ట్ర, జిల్లా నాయకులు మండల సమ్మయ్య, బోనాల రమేష్, మట్టెపల్లి సాంబయ్య, కేశబోయిన కోటేశ్వర్‌రావు, రోకుల సందీప్, పోలుదాసరి రాము, కట్ట విజయ్, బోడ రంజిత్, బోడ రామకృష్ణ, పులి మహేష్ ముది రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమూహ సాహిత్య సదస్సుకు వరంగల్ కవులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): సమాజంలో యువతను మొద్దుబార్చి దుర్బలపరిచే ప్రయత్నాలు అనేకం జరుగుతున్నా యి. ప్రశ్నించాల్సిన గొంతులకు మౌనం దాల్చేలా, దారి మళ్లేలా వ్యవస్థీకృత ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఇటువంటి సమయంలో యువతకు కావాల్సింది వినోదం కాదు విచారణ, వివేచన. వారికి కావాల్సింది భ్రమలు కాదు, వాస్తవికత పట్ల అవగాహన. సాహిత్యం ఆ పని చేస్తుంది. ఈ నేపథ్యంలో తెలుగు నేల మీద యువతను పుస్తకం వైపు ఆలోచన వైపు మళ్లించి ప్రశ్నించే తత్వాన్ని నెరవేర్చే ధైర్యాన్ని అన్నింటికి మించి తోటి మనిషిని ప్రేమించే గుణాన్ని పెంపొందించే దిశలో భాగంగా సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఈ నెల 22న శనివారం యూత్ లిటరేచర్ ఫెస్టివల్ పేరుతో హైదరాబాద్ కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో గొప్ప చారిత్రక సం దర్భంలో యువత పాత్ర కీలకమయ్యే ఉత్సవాన్ని రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తోంది.

ఈ ఉత్సవంలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రముఖ కవులు బిల్ల మహేందర్, బండారి రాజ్‌కుమార్, తండా హరీష్‌గౌడ్, పేర్ల రాము, హథిరామ్ సభావట్, తాళ్లపల్లి యాకమ్మ, కళ్యాణి కుంజ తదితరులు పాల్గొంటారు.

గౌడ సంఘం సభ్యులవి తప్పుడు ఆరోపణలు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు21 (ఆంధ్ర జ్యోతి): హసన్‌పర్తి మండలం నాగారం గ్రామాని కి చెందిన గౌడ సంఘం సభ్యులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని గౌడ సంఘం అధ్యక్షుడు భూర్ల వెంకటేశ్వర్లు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 2020లో నాగారం గ్రామానికి చెందిన గీత పారిశ్రామిక సహకార సంఘం భూములు సాదా బైనామా ద్వారా అధ్యక్షుడిగా ఉన్న తన పేరుపై మీ సేవలో దరఖాస్తు చేశామన్నారు. ఇప్పటివరకు ఎలాంటి భూములు మార్పులు, చేర్పులు చేయబడలేదన్నారు. దీంతో తమ సంఘం కార్యవర్గం 11మంది పేర్లపై భూభారతిలో మళ్లీ దరఖాస్తు సమర్పించామన్నా రు. అయితే తన ఒక్కడి పేరుపై పత్రాలు వచ్చినట్లుగా సంఘం సభ్యులు తెలుసుకుని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారని అన్నారు. కాగా, 11మంది సభ్యుల పేర్లపై భూమి పట్టా చేసి న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించానని వెంకటేశ్వర్లు వెల్లడించారు.

యువత జీవితంలో ఉన్నతంగా ఎదగాలి

కేయూక్యాంపస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యువత విద్యార్థి దశ నుంచే ప్రణాళికబద్ధంగా కష్టపడి జీవితంలో ఉన్నతంగా ఎద గాలని కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. రమణ ఉద్బోధించారు. శుక్రవారం కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో లైబ్రరీ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.సుజాత నేతృత్వంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించు కుని క్విజ్, పిక్ ఏ బుక్, వ్యాసరచన, రీల్ కంటెస్ట్ పోటీలను నిర్వ హించారు. ఏడు బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులను ఏడు బృందాలు గా ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌లో నలుగురు విద్యార్థులను ఎం పిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పోటీ ల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. పిక్ ఏ బుక్ పోటీల్లో మెకానికల్ బ్రాంచ్ స్టూడెంట్స్ ఎ.విష్ణువర్ధన్, వర్ధ న్, పూజ, జి.తరుణ్‌కుమార్ బహుమతులు సాధించారు. అలాగే క్విజ్ పోటీల్లో ఈసీఈ స్టూడెంట్స్ వి.కార్తీక్, ఎస్.రాజ్‌కు మార్, బి.మంజుల, జె.గీతలు బహుమతులు పొందారు.వ్యాసరచన పోటీ ల్లో ఎ.హరిణి, రూబా సదఫ్ రఫీలు, రీల్ కంటెస్ట్ పోటీల్లో మెకాని కల్ బ్రాంచ్ విద్యార్థులు పవన్, సంజయ్‌లు బహుమతులు సాధిం చారు.వీరిని కళాశాల యాక్టివిటీస్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.భాగ్య లక్ష్మి, ఆర్.సుస్మిత,డాక్టర్ డి.శైలజ, వి.రాజశ్రీ, రుమణ అబిదమ్, ఎ.శిరీష, కళాశాలసూపరింటెండెంట్ ప్రభాకర్ అభినందిచారు.



టీహబ్ ప్రతినిధులతో కేయూ ఉన్నతాధికారులు

కేయూకు టీహబ్ ప్రతినిధుల రాక

కేయూ క్యాంపస్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని టీహబ్ ప్రతినిధులు శుక్రవారం కేయూ క్యాంపస్‌లోని బయోటెక్నాలజీ, మైక్రోబయోలజీ విభాగాలకు వచ్చారు. అనంతరం సెనెట్ హాల్‌లో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో టీహబ్ ప్రతినిధులు వర్సిటీ ఉన్నతాధికారులు, టీహబ్ ప్రతినిధులు మల్లికార్జున్‌రెడ్డి, సవితాజ్యోత్స్న, సిద్ధార్థ, రాజేశ్‌కుమార్, శ్రవణ, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ వర్మకు అరుదైన గౌరవం



మాట్లాడుతున్న శ్రీకాంత్ వర్మ

కేయూ క్యాంపస్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొం డలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళా శాల కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెం ట్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీకాంత్ వర్మ అరుదైన గౌరవాన్ని సాధిం చారు. ఈనెల 20 నుంచి 22 వరకు షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐ ఎం)లో జరిగే 12వ అంతర్జాతీయ సదస్సులో శ్రీకాంత్‌వర్మ రాసిన పరిశో ధన పత్రం ఎంపికైనట్లు అధికారికంగా సదస్సు బాధ్యులు శుక్రవారం తెలిపారు. శ్రీకాంత్ వర్మ తెలంగాణలో మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ బోధన, వృత్తిపరమైన సామర్థ్యాల మూల్యాంకనం అనే అంశంపై విలువైన పరి శోధన పత్రాన్ని రాశారు. శ్రీకాంత్ వర్మ 18 ఏళ్ల బోధన, పరిశోధన అను భవం వుంది. అంకితభావం, విద్యా నైపుణ్యంతో బలమైన పరిశోధన సామర్థ్యాలను సాధించారు. శ్రీకాంత్ వర్మను వాగ్దేవి కళాశాల ఛైర్మన్‌తో పాటు ఇతర అధికారులు అభినందిచారు.

విశ్వబ్రాహ్మణ కుల వృత్తులకు భద్రత కల్పించాలి

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోజు భిక్షపతి

వడ్డెపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వబ్రా హ్మణ కుల వృత్తులకు భద్రత కల్పించి వృత్తిదారులను ప్రభుత్వమే ప్రోత్స హించాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్ర వారం హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని విశ్వబ్రా హ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యాల యంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు అధ్య క్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచీక రణ ప్రభావంతో కార్పొరేట్ సంస్థల రాకతో చేతి వృత్తులు కుదేలు అవుతున్నాయని, కులవృత్తిదారులు పనులు లేక ఆకలి చావులు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. విశ్వబ్రాహ్మణులు సంఘటితమై కుల వృత్తుల పరిరక్షణ కోసం పోరాటానికి సిద్ధం కావాలని భిక్షపతి పిలుపు నిచ్చారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ పలికోజు నర్సింహ చారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌చారి, రాష్ట్ర కార్యదర్శి కలకోటి శ్రీధరాచారి, జిల్లా నాయకులు ఎం. రమేష్, రాజన్న, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలి

వడ్డెపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుపల్లి అటవీ ప్రాంతంలో జరి గిన ఎన్‌కౌంటర్ ముమ్మాటికి బూటకమని, దీనిపై సమగ్ర న్యాయవి చారణ జరిపించాలని సీపీఐ (ఎం-ఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ముఖ్య కార్యకర్తల సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. పెట్టు బడిదారులు, సామ్రాజ్య వాదుల కోసం భారత సైన్యంతో దేశ పౌరు లనే వేటాడడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. దేశ పౌరులను ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుం దని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా తదిత రులు అదానీ, అంబానీల కోసం మధ్యభారతంలోని ఖనిజాల కోసం నక్సలైట్ల ఏరివేత పేరిట రక్తపు టేరులు పారిస్తున్నారని దుయ్యబ ట్టారు. సమావేశంలో సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ జిల్లా నేతలు చిర్ర సూరి, అర్షం అశోక్, మైదం పాణి, మోహన్, యాకయ్య, పీడీఎ్ ఎయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల క్లీన్ అండ్ గ్రీన్

కేయూ క్యాంపస్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూని వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్లు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతకు క్యాడెట్లు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్, సురేష్, సోమశేఖర్, రమేశ్, గిరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



చలికి తట్టుకోలేక కోతులు ఒక దగ్గర గుంపుగా చేరి గట్టిగా పట్టుకున్న దృశ్యం

వణుకుతున్న వానరాలు

- చలి నుంచి తప్పించుకునేందుకు తంటాలు
- జిల్లాలో కనిష్టంగా 14 డిగ్రీలు నమోదు

హనుమకొండ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రతకు మనుషులే కాదు.. కోతులు కూడా గజగజ వణికిపోతున్నాయి. చలినుంచి తమను తమను తాము కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నాయి. చలి నుంచి తప్పించుకునేందుకు రాత్రి వేళ కోతులన్నీ గుంపులుగా ఒక దగ్గర చేరి గట్టిగా పట్టు కొని ఉన్న దృశ్యం భద్రకాళి గుడి దగ్గర ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ కెమెరాకు చిక్కింది. కాగా, హనుమకొండ జిల్లాలో శుక్రవారం కనిష్ఠంగా 14 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలో 13.7 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో 14 డిగ్రీలు, జనగామలో 14 డిగ్రీలు, వరంగల్ జిల్లా లో 14.9 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లాలో 15.8 డిగ్రీలు, ములుగు జిల్లాలో 14.4 డిగ్రీలు, ఉష్ణోగ్రత నమోదైంది.



వంటిల్లు

చాలామంది అవకాడోలను చాలా ఇష్టంగా ఆహారంలో చేర్చుకుంటూ ఉంటారు. అవకాడో పచ్చడి గురించి అందరికీ తెలిసిందే. బాగా పండిన అవకాడోలతో సలాడ్స్, స్మూతీలు, మిల్క్ షేక్‌లు, కేక్‌లు ఇలా ఎన్నో రకాలు తయారుచేసుకుని ఆస్వాదిస్తుంటారు. పోషకాల గనిగా పరిగణించే అవకాడోతో తయారుచేసే విభిన్న వంటకాలు మీకోసం.

అవకాడోతో ఆరోగ్యంగా

అవకాడో పుడ్డింగ్

కావాల్సిన పదార్థాలు

అవకాడోలు- రెండు, పాలు- రెండు కప్పులు, మిల్క్ మెయిడ్(కండెన్స్‌డ్ మిల్క్)- అర కప్పు, పిస్తా పప్పులు- కొన్ని, జీడి పప్పు పలుకులు- పది, పంచదార- పావు కప్పు, చైనా గ్రాస్ లేదా అగార్ అగార్ పౌడర్- ఒకటిన్నర చెంచా, వెనీలా ఎసెన్స్- అర చెంచా

తయారీ విధానం

- అవకాడోలను మధ్యకు కోసి లోపలి భాగాన్ని గిన్నెలోకి తీసుకోవాలి. చిన్న గిన్నెలో జీడిపప్పు పలుకులు వేసి అవి మునిగేలా నీళ్లు పోసి



గంటసేపు నానబెట్టాలి. మందపాటి గిన్నెలో పాలు, పంచదార, మిల్క్ మెయిడ్, అగార్ అగార్ పౌడర్, వెనీలా ఎసెన్స్ వేసి బాగా కలపాలి. ఈ గిన్నెను స్టవ్ మీద పెట్టి చిన్న మంట మీద వేడిచేయాలి. పాలను చెంచాతో కలుపుతూ ఉండాలి. పాలు బాగా మరిగిన తరువాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి.
- బ్లెండర్‌లో అవకాడో ముక్కలు, నానబెట్టిన జీడిపప్పు, అర కప్పు మరిగించిన పాల మిశ్రమం వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఈ పేస్టుని మిగిలిన పాలలో వేసి బాగా కలపాలి. తరువాత ఈ మిశ్రమాన్ని ఒక మౌల్డ్‌లోకి మార్చి ఫ్రిజ్‌లో గంటసేపు ఉంచాలి. మిశ్రమం గట్టిపడి కేక్‌లా మారుతుంది. దాన్ని ఒక ప్లేట్‌లోకి తీసుకుని పైన పిస్తా పలుకులు చల్లితే అవకాడో పుడ్డింగ్ రెడీ..!



అవకాడో టిక్కీ

కావాల్సిన పదార్థాలు

అవకాడోలు- రెండు, పచ్చి మిర్చి పేస్టు- ఒక చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, ఉప్పు- తగినంత, బియ్యప్పిండి- ఆరు చెంచాలు, పసుపు- చిటికెడు, నూనె- ఆరు చెంచాలు

తయారీ విధానం

- అవకాడోలను మధ్యకు కోసి లోపలి భాగాన్ని వెడల్పాటి గిన్నెలోకి తీసుకొని చెంచాతో మెత్తగా మెదపాలి. తరువాత అందులో పచ్చి మిర్చి పేస్టు, జీలకర్ర పొడి, ఉప్పు, బియ్యప్పిండి, పసుపు వేసి బాగా కలపాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి నూనె వేసి వేడి చేయాలి. చేతికి కొద్దిగా నూనె రాసుకుని అవకాడో-బియ్యప్పిండి మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ వేళ్ల మీద చిన్న టిక్కీల మాదిరి చేసి మెల్లగా పాన్‌లో వేయాలి. రెండువైపులా ఎర్రగా వేగనివ్వాలి. తరువాత పళ్లెంలోకి తీయాలి. ఇలా తయారుచేసుకున్న అవకాడో టిక్కీలను వేడి వేడిగా టమాటా సాస్‌తో సర్వ్ చేసుకోవాలి.

అవకాడో చాట్

కావాల్సిన పదార్థాలు

- అవకాడోలు- రెండు, నిమ్మకాయలు- రెండు, ఉప్పు- తగినంత, నానబెట్టి ఉడికించిన శనగలు- అర కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- మూడు, ఉడికించి తొక్క తీసిన ఆలుగడ్డలు- రెండు, కారం- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, చాట్ మసాలా- ఒక చెంచా, స్వీట్ చట్నీ- ఒక చెంచా, గ్రీన్ చట్నీ- ఒక చెంచా, క్రాకర్స్- అయిదు, సన్నని కారప్పూస- కొద్దిగా, బూందీ- రెండు చెంచాలు, దానిమ్మ గింజలు- కొన్ని, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- కొన్ని, మరమరాలు- కొన్ని

తయారీ విధానం

- అవకాడోలను మధ్యకు కోసి లోపలి భాగాన్ని గిన్నెలోకి తీసుకోవాలి. అందులో చిటికెడు ఉప్పు, నిమ్మరసం వేసి చెంచాతో బాగా మెదపాలి. తరువాత అందులో మెత్తగా మెదిపిన ఆలుగడ్డల మిశ్రమం, శనగలు, పచ్చి మిర్చి ముక్కలు, కారం, చాట్ మసాలా,



ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. దానిపైన చిదిమిన క్రాకర్స్, గ్రీన్ చట్నీ, స్వీట్ చట్నీ వేయాలి. ఆపైన టమాటా ముక్కలు, కారప్పూస, బూందీ, మరమరాలు, దానిమ్మ గింజలు, ఉల్లిపాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి చివరగా నిమ్మరసం పిండితే రుచికరమైన అవకాడో చాట్ రెడీ..!

గ్వాకమూలే

కావాల్సిన పదార్థాలు

అవకాడోలు- మూడు, నిమ్మకాయలు- రెండు, ఉల్లిపాయలు- రెండు, టమాటాలు- రెండు, కొత్తిమీర- ఒక చిన్న కట్ట, ఉప్పు- అర చెంచా, మిరియాల పొడి- ముప్పావు చెంచా



తయారీ విధానం

- ఉల్లిపాయలు, టమాటాలను చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. కొత్తిమీరను నీళ్లతో శుభ్రంగా కడిగి ఆపైన సన్నగా తరగాలి. అవకాడోలను మధ్యకు కోసి లోపలి భాగాన్ని చెంచాతో గిన్నెలోకి తీయాలి. గంటె సహాయంతో దాన్ని మెత్తగా మెదపాలి.
- వెడల్పాటి గిన్నెను తీసుకుని అందులో అవకాడో గుజ్జు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. తరువాత ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు, కొత్తిమీర తరుగు, ఉప్పు, మిరియాల పొడి వేసి చెంచాతో మెల్లగా కలపాలి. ఈ గిన్నెమీద మూతపెట్టి అరగంటసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. తరువాత ఈ గ్వాకమూలేను చిప్స్, క్రాకర్స్‌తో సర్వ్ చేసుకోవాలి.

నవ విశ్వసుందరి

అందం... ఆత్మవిశ్వాసానికి అందలం



'మిస్ యూనివర్స్-2025' కిరీటాన్ని గెలుచుకోకముందే 25 ఏళ్ళ ఫాతిమా బాష్ పేరు చాలామందికి పరిచయమైపోయింది. వాస్తవానికి... ఈ పోటీలో పాల్గొన్న దాదాపు 120 దేశాల సుందరీమణుల్లో ఒకరుగా మాత్రమే అప్పటివరకూ కొందరికైనా ఆమె పేరు తెలుసు. పోటీలకు కొద్దిరోజుల ముందు... మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మిస్ యూనివర్స్ థాయిలాండ్ నేషనల్ డైరెక్టర్ నవాత్ ఆమె మీద విరుచుకుపడ్డారు. 'తెలివితక్కువ మనిషి'గా ఆమెను అభివర్ణించారు. ఈ పోటీలకు ఆతిథ్యం ఇస్తున్న థాయిలాండ్‌ను సోషల్ మీడియాలో ఆమె ప్రమోట్ చేయకపోవడం దీనికి ప్రధాన కారణం కాగా... ఒక ఫొటోషూట్‌కు ఆమె హాజరు కాకపోవడం సాకుగా చూపి... ఫాతిమాను ఆయన నిందించారు. దీనికి ఫాతిమా దీటుగా సమాధానం ఇచ్చారు. నవాత్‌కు, ఆమెకు మధ్య తలెత్తిన ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. నవాత్ తీరుకు నిరసనగా ఫాతిమా, ఈ పోటీల్లో పాల్గొంటున్న మరికొందరు యువతులు సంబంధిత ఈవెంట్‌ను బహిష్కరించారు. చివరకు నవాత్, మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ ఆమెకు క్షమాపణ చెప్పాయి. పోటీలో పాల్గొంటూ... దాని నిర్వాహక సంస్థను నిలదీసి, తన ఆత్మగౌరవాన్ని కాపాడుకున్న ఫాతిమా సర్వత్రా ప్రశంసలు అందుకున్నారు. "ఆ పోటీలో పాల్గొనకుండా, కిరీటం సాధించకుండా నన్నెవరూ ఆపలేరు" అని ఆత్మవిశ్వాసంతో చెప్పిన ఆమె... అనుకున్నది సాధించారు. 74వ మిస్ యూనివర్స్ గా నిలిచారు. మన దేశం నుంచి రాజస్థాన్‌కు చెందిన మణికా విశ్వకర్మ టాప్-30లో స్థానం సంపాదించినా... టాప్-12కు చేరుకోలేకపోయారు.

అవహేళలను ఎదిరించి...

2000 మే 19న మెక్సికోలోని టాబాస్కో రాష్ట్రం టిపియాలో జన్మించిన ఫాతిమా బాల్యం మొత్తం పోరాటంగానే సాగింది. ఆరేళ్ళ వయసులో ఆమెకు హైపర్ యాక్టివిటీ, డిస్లెక్సియా లాంటి సమస్యలు ఉండేవి. సరిగ్గా మాట్లాడలేకపోవడంతో... తోటి పిల్లలు ఆమెను అవహేళన చేసేవారు. కానీ ఫాతిమాకు పట్టుదల ఎక్కువ. ఏ సమస్యా తన పురోగతిని నిరోధించకూడదనుకున్నారు. మానసిక దారుఢ్యాన్ని పెంచుకున్నారు. చదువులో, ఆటపాటల్లో ముందుండేవారు. విద్యార్థుల మార్పిడి కార్యక్రమం కింద... అమెరికాలోని లైన్డస్ ఇనిస్టిట్యూట్‌లో హైస్కూల్ విద్య అభ్యసించారు. అక్కడే ఆమె ఆంగ్లం బాగా నేర్చుకున్నారు. ఆ తరువాత ఫాతిమా దృష్టి సృజనాత్మకతవైపు మళ్ళింది. మెక్సికోలోనే ఫ్యాషన్ అండ్ అపెరల్ డిజైన్‌లో డిగ్రీ చేశారు. ఆ తరువాత ఇటలీలోని మిలన్‌లో ప్రతిష్టాత్మకమైన ఎన్ఎబిఎలో మాస్టర్స్ పూర్తి చేశారు. అందాల పోటీల్లో ఆమె విజయాలు... 2018లోలో 'ఫ్లోర్ టబాస్కో' టైటిల్ గెలుచుకోవడంతో మొదలయ్యాయి. దాన్ని సాధించడం తన చిన్ననాటి కల అని ఒక సందర్భంలో ఆమె చెప్పారు. ఆ తరువాత జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినా... చదువుకే ప్రాధాన్యం ఇచ్చారు. మళ్ళీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో 'మిస్ యూనివర్స్-మెక్సికో'గా నిలిచారు. ఇప్పుడు 'మిస్ యూనివర్స్'గా గెలిచారు. టొబాస్కోకు చెందిన ఒక మహిళ ఈ ఘనతను సాధించడం అదే మొదటిసారి.



సామాజిక సేవలో...

ఇష్టంగా నేర్చుకున్న ఫ్యాషన్ డిజైనింగ్‌నే ఫాతిమా వృత్తిగా చేసుకున్నారు. తను రూపొందించినవన్నీ పర్యావరణానికి అనుకూలంగా ఉండాలని ఆమె ఆశిస్తారు. సామాజిక సేవ పట్ల కూడా మక్కువ ఎక్కువే. తమ ప్రాంతంలోని ఒక ఆసుపత్రిలో క్యాన్సర్‌తో బాధపడుతున్న పిల్లలకు సాయపడడం కోసం పదేళ్ళుగా ఆమె పాటుపడుతున్నారు. టోబాస్కోలోని అంకాలజీ ఆసుపత్రిలో .. వార్షిక సెలవుల్లో పిల్లలకోసం కార్యక్రమాలను కూడా ఆమె నిర్వహిస్తూ ఉంటారు. ఫాతిమాకు జంతువులంటే ఇష్టం. గుర్రపుస్వారీ, పుస్తక పఠనం, చిత్రలేఖనం, టెన్నిస్... ఇలా అనేక అభిరుచులు ఉన్నాయి. ఆమె ప్రేమగా పెంచుకున్న కుక్కపిల్ల ఈ పోటీలకు కొద్దిరోజుల ముందే మరణించింది. దానికి నివాళిగా... పోటీ సమయంలో తన దుస్తులకు ఒక చిన్న పిన్నును ఫాతిమా ధరించారు. "ఆడపిల్లలు తమ కలలను సాకారం చేసుకోవడమే ధ్యేయంగా పాటుపడాలి. తమ సామర్థ్యం, విలువ పట్ల ఎప్పుడూ నమ్మకంతో ఉండాలి" అంటారామె. పోటీల్లో న్యాయవిజేతలు అడిగిన ప్రశ్నకు సమాధానంగా... మహిళల జీవితాల్లో మార్పు కోసం కృషి చేస్తానని చెప్పిన ఈ నవ విశ్వ సుందరి... ఇప్పటికే ఆ దారిలో పయనిస్తున్నారు.

భోజన కుతూహలం

మునగ మొక్క అంటే చాలా మందికి గుర్తుకు వచ్చేది మునగ కాయలు, ఆ తర్వాత ఆకులు. అయితే మునగ చెట్టు పూలలో కూడా అపారమైన ఔషధ గుణాలు ఉన్నాయి. వీటిని మనం ఎక్కువగా పట్టించుకోలేదనే చెప్పాలి. వాస్తవానికి మునక్కాడలూ, ఆకుల కన్నా కన్నా మునగ పూలకే ఔషధ విలువలెక్కువ. 'భోజన కుతూహలం' గ్రంథంలో మునగ పూల గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. అవి ఏమిటో తెలుసుకుందాం.

కంటి చూపుని పెంచే మునగ పూలు

- మునగపూలు ఆలస్యంగా అరుగుతాయి. దీనివల్ల త్వరగా ఆకలి వేయదు. వీటిలో అనేక పోషకాలు ఉంటాయి.
- మునగ పూలు జీర్ణశక్తిని పెంచుతాయి. మలబద్ధకం ఉన్నవారికి మునగపూలు మంచి మందు.
- మునగ పూలు కొద్దిగా వగరు రుచిని కలిగి ఉంటాయి. టమోటాలాంటి వాటితో కలిపి పప్పు వండుకుంటే చాలా రుచిగా ఉంటుంది. క్యాబేజీ, క్యాలీఫ్లవర్‌లతో చేసే వంటల్లో కూడా ఈ పువ్వును వేసుకోవచ్చు.
- మునగ పూలను నేతితో వేయించి పాలలో ఉడకబెట్టి.. పంచదార లేదా తేనె కలిపితే రుచికరమైన పాయసం అవుతుంది.
- కొన్ని ప్రాంతాల్లో మునగ పూలతో సూపును కూడా చేసుకుంటారు.
- కంటిచూపును మెరుగుపర్చటంలో మునగపూలు మేలు చేస్తాయి.
- జీవకణాలు తక్కువగా ఉన్న పురుషులకు మునగ పూలు వీర్యంలో వేడిని తగ్గించి కణాలు పెరిగేలా చేస్తాయి. పురుషుల్లో వంధ్యత్వాన్ని నివారించే ఉత్తమ ఔషధంగా ఈ పూలను భావించవచ్చు.
- కాలేయం, పేగులు మొదలైన అవయవాలను మునగపూలు దృఢపర్చగలవు. దీని వల్ల శరీరంలో అవయవాల పనితీరు మెరుగుపడుతుంది. పేగుపూత, పేగుల్లో వాపు ఉన్న వారు తప్పనిసరిగా తినాల్సిన ఆహారమిది.
- సాధారణంగా మునగాకులు, మునక్కాడలు వేడి చేసే స్వభావం కలిగి ఉంటాయి. కానీ మునగ పూలు మాత్రం చలవచేస్తాయి. దీనివల్ల పైత్యం తగ్గుతుంది. చర్మపు మంటలు తగ్గుతాయి.
- మునగ పూలు కఫ దోషాన్ని హరిస్తాయి. ఊపిరితిత్తుల్లో శ్లేష్మాన్ని తగ్గిస్తాయి.
- మునగ పూలతో చేసిన వంటలు తింటే తల్లిపాలు పెరుగుతాయి.

• గంగరాజు అరుణాదేవి



ప్రియతమా శర్మ... వేధింపులు ఆమెకు కొత్త కాదు. బాల్యంలోనే మొదలయ్యాయి. కౌమారానికి వచ్చాకా అవి కొనసాగాయి. వాటిని తట్టుకోలేక చిన్న వయసులోనే ఇల్లు వదిలిన ఆమె... తన కాళ్లపై తాను నిలబడాలనుకున్నారు. అందుకు ఏకైక మార్గం చదువేనని గ్రహించి... మాస్టర్స్ చేశారు. ఆడపిల్ల ఇంటికి భారమని భావించే సమాజం నుంచి వచ్చిన ప్రియతమ... నేడు తనలాంటి ఎంతోమంది అమ్మాయిల్లో స్ఫూర్తి నింపుతున్నారు.

స్ఫూర్తి



వేధింపులు దాటి శిఖరం వైపు

"పదేళ్ల వయసు... రైలులో ప్రయాణిస్తుంటే ఒక పెద్దాయన... తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. కాసేపటికి నా మీద చేతులు వేసి తడుముతున్నాడు. మంచి స్పర్శ ఏదో... చెడు స్పర్శ ఏదో తెలుసుకోలేని వయసు. అక్కడేకాదు... పక్కింట్లో, ఆఖరికి మా బంధువుల ఇంట్లో కూడా లైంగిక వేధింపులకు గురయ్యాను. పదిహేనేళ్ల వయసు వచ్చేవరకు ఇలాంటి ఘటనలు ఎదురవుతూనే ఉన్నాయి. ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. చెప్పినా వినేవారు లేరు మా ఇంట్లో. ఎందుకంటే... అమ్మాయి అంటే మా ప్రాంతంలో కుటుంబానికి భారంగా, వేరొకరి ఇంటి సొత్తుగా భావిస్తారు. మగపిల్లలకు ఉన్న స్వేచ్ఛ, ఉన్నత చదువులు చదివే అవకాశం మాకు ఇవ్వరు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ మాది. మేం నలుగురు సంతానం. అక్కకు చిన్న వయసులోనే పెళ్లయింది. నన్ను ఆర్ట్స్‌తో సరిపెట్టిన అమ్మానాన్న... తమ్ముళ్లను మాత్రం ఇంజనీరింగ్‌లో చేర్పించారు. ప్రతిచోటా వివక్షే. వీటన్నిటికీ దూరంగా ఎక్కడికైనా వెళ్లిపోదామని ఎన్నోసార్లు అనుకున్నా. కానీ ఏదో తెలియని భయం నన్ను ఆపేసేది.

ఇల్లు వదిలి...

నేను డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. ఇంట్లో వాళ్లు నాకు పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారు. కానీ అక్కను చేసుకున్నవాడు తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. వయసులో కూడా చాలా పెద్దవాడు. తన కాపురం చూశాక నాకు ఇంట్లోవాళ్లు తెచ్చే సంబంధాల మీద నమ్మకం పోయింది. నా జీవిత భాగస్వామిని నేనే వెతుక్కోవాలని నిర్ణయించుకున్నా. ఆ సమయంలోనే మా స్నేహితుడి స్నేహితుడితో పరిచయమైంది. తరువాత ఇద్దరి మనసులు కలిశాయి. గతంలో నాకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి చెప్పాను. అతను పెద్ద మనసుతో అర్థం చేసుకున్నాడు. ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి అతడిని పెళ్లి చేసుకున్నా. వేరే ఊళ్లో కాపురం పెట్టాం. ఇదంతా 2010లో. అప్పుడు నాకు ఇరవై ఏళ్లు.

మునుపెన్నడూ లేని గౌరవం...

పెద్ద షాక్ ఏంటంటే... అతడు పెళ్లికి ముందు నాతో చెప్పినవన్నీ అబద్ధాలే... ఉద్యోగం, ఊరు, పేరు సహా. చేసేదిలేక సర్దుకుపోయాను. కొన్ని నెలల తరువాత మా అమ్మానాన్న మమ్మల్ని కనిపెట్టారు. 'మీరిద్దరూ కెరీర్‌లో స్థిరపడిన తరువాత మళ్లీ కలిసి జీవించవచ్చు' అని నాకు నచ్చ చెప్పి ఇంటికి తీసుకువెళ్లారు. ఆరు నెలల్లో ఒక్కసారి కూడా నా భర్తను చూసేందుకు అనుమతించలేదు. నాకు చచ్చిపోవాలని అనిపించేది. అన్నిటినీ భరించాను. మా ఇంటి దగ్గరే ఉన్న ప్రైమరీ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. అప్పుడు కూడా ఉద్యోగానికి వెళ్లకుండా ఆపుదామని నాన్న ప్రయత్నించారు. నేను వినలేదు. నా బ్యాగ్ సర్దుకొని బయటకు వచ్చేశాను. నా జీవితంలో మొదటిసారి నాపై నాకు నమ్మకం కలిగింది ఆ ఉద్యోగంలో చేరాకనే. నాకు అంతకుముందు ఎక్కడా లేని గౌరవం, విలువ అక్కడ లభించాయి. నేనంటే అందరూ ఇష్టంగా ఉండేవారు. ఆడపిల్లననే వివక్ష ఎవరూ చూపలేదు.

చదువే మార్గమని...

కానీ నా ఎదుగుదల మావారికి నచ్చలేదు. నేను బయటకు వెళ్లినా, స్నేహితులు ఎవరితోనన్నా మాట్లాడినా ఇష్టపడేవాడు కాదు. కాదంటే కొట్టేవాడు. చివరకు ఉద్యోగం మాన్పించి ఇంట్లో కూర్చోబెట్టాడు. తనకు తెలియకుండా వేరే ఉద్యోగాలు ప్రయత్నించాను. ఆ సమయంలో నాకు అర్థమైంది ఏంటంటే... ఉన్నత చదువులు చదివితే మంచి అవకాశాలు వస్తాయని. జీవితంలో బాగా స్థిరపడవచ్చని. ముఖ్యంగా ఆడపిల్లల పట్ల వివక్ష చూపే సమాజంలో మార్పు రావాలన్నా, స్వశక్తితో ఎదగాలన్నా అందుకు చదువే ప్రధానమని అర్థమైంది. అందుకే మేనేజ్‌మెంట్ డిప్లమో కోర్సులో చేరాను. స్నేహితుల సహకారంతో కోర్సు పూర్తి చేశాను. ఆ సర్టిఫికెట్‌తో లఖనవూలో నాకు మంచి ఉద్యోగం వచ్చింది. ఆ క్షణం నా ఆనందాన్ని అంతులేదు. పంజరం నుంచి బయటకు వచ్చిన పక్షిలా స్వేచ్ఛను పొందిన అనుభూతి.



వారి స్ఫూర్తితో...

ఉద్యోగంలో భాగంగా ఐఐటీ, ఐఐఎం, బిట్స్, నిట్ గ్రాడ్యుయేట్స్‌ను కలిశాను. వారిని చూశాక నాలో కొత్త ఉత్సాహం వచ్చింది. చదువు కొనసాగించాలన్న స్ఫూర్తి రగిలింది. లఖనవూ వర్సిటీ నుంచి లైబ్రరీ సైన్స్‌లో మాస్టర్స్ చేశాను. అది నాలో మునుపెన్నడూ లేని ధైర్యాన్ని ఇచ్చింది. మరోవైపు భర్త వేధింపులు ఎక్కువ కావడంతో... అతడికి విడాకులు ఇచ్చాను. తరువాత నాకు చాలా సందర్భాల్లో అండగా నిలిచిన కోర్కీ సిన్హాను మూడేళ్ల కిందట పెళ్లి చేసుకున్నాను. తన దృష్టిలో నేనొక యోధురాలిని. సిన్హాను చూశాక అనిపించింది.. పెంపకాన్ని బట్టి మగవారి ఆలోచనాతీరు ఉంటుందని. అందుకే నాలాంటి అమ్మాయిలకు అండగా నిలవాలని అనుకున్నా. మగపిల్లలను చిన్నప్పటి నుంచే ఆడవారి పట్ల గౌరవ మర్యాదలతో మెలిగేలా పెంచాలని చెబుతున్నా. దీని కోసం అవగాహన తరగుతులు నిర్వహిస్తున్నా. అదే సమయంలో బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శలపై అవగాహన కల్పిస్తూ, యువతుల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నా. దీనివల్ల ఏ ఒక్కరిలో మార్పు వచ్చినా నా ప్రయత్నం ఫలించినట్టే."

చలికి చెక్కు చెదరకుండా...

చలి కాలం ఎన్ని జాగ్రత్తలు పాటించినా మేకప్ వేసుకున్న ముఖం జీవం కోల్పోయినట్టు కనిపించవచ్చు. ఇలాంటప్పుడు చర్మానికి నప్పే మేకప్‌ను ఎంచుకోవాలి. అందుకోసం...

కాంబినేషన్ చర్మమైతే...

ఫౌండేషన్: ద్రవరూప/క్రీమ్/మూస్ ఫౌండేషన్ ఎంచుకోవాలి. పల్చని మేకప్ కోసం నీటి ఆధారిత సౌందర్య సాధనాలనూ, వేడుకల్లో మేకప్ కోసం ఆయిల్ బేస్‌డ్ ఫౌండేషన్లు బాగుంటాయి.
కన్‌సీలర్: లిక్విడ్, క్రీమ్ లేదా స్టిక్ కన్‌సీలర్లు బాగుంటాయి. ఇవి మ్యాట్, డ్యూయీ ఫినిష్ కలిగినవైతే మరింత ఆకర్షణీయంగా ఉంటాయి.
బ్లష్: షిమ్మర్ షేడ్స్‌లో ఉండే జెల్ లేదా క్రీమ్ బ్లష్‌లు ఎంచుకోవాలి.

పొడి చర్మమైతే...

ఫౌండేషన్: టింటెడ్ మాయిశ్చరైజర్ లేదా ఆయిల్ బేస్‌డ్ లిక్విడ్ ఫౌండేషన్ ఎంచుకోవాలి.
కన్‌సీలర్: క్రీమీ లేదా డ్యూయీ ఫినిష్ కలిగి ఉండే స్టిక్ లేదా క్రీమ్ కన్‌సీలర్ ఎంచుకోవాలి.
బ్లష్: క్రీమ్ బ్లష్ లేదా శాటిన్/డ్యూయీ కలిగిన టింటెడ్ మాయిశ్చరైజర్ వాడుకోవాలి.

జిడ్డు చర్మమైతే...

ఫౌండేషన్: నీటి ఆధారిత, లేదా నూనెలు లేని ద్రవరూప లేదా పౌడర్ ఫౌండేషన్ బాగుంటుంది.
కన్‌సీలర్: మధ్యస్తంగా కవర్ చేసే మ్యాట్ ఫినిష్‌తో కూడిన ద్రవరూప కన్‌సీలర్ ఎంచుకోవాలి.
బ్లష్: మ్యాట్ ఫినిష్‌తో కూడిన పౌడర్ బ్లష్ బాగుంటుంది.

మేకప్



హిడ్మా 'ఎన్‌కౌంటర్'పై న్యాయవిచారణ

» ఎన్‌హెచ్ఆర్సీలో పిటిషన్లు దాఖలు

(అమరావతి, ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

ఏపీలో హిడ్మా సహా మావోయిస్టు నేతల ఎన్‌కౌంటర్లు బూటకమని, వాటిపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో (ఎన్‌హెచ్ఆర్సీ) పిటిషన్లు దాఖలయ్యాయి. తెలంగాణకు చెందిన హక్కుల కార్యకర్త, న్యాయవాది నారాయణన్‌తోపాటు మరికొందరు వేర్వేరుగా ఈ పిటిషన్లు దాఖలుచేశారు. మావోయిస్టు నేతలను పట్టుకుని ఈ నెల 18, 19 తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి, రంపచోడవరంల్లో కాల్చిచంపి ఉంటారనే అనుమానాలను వ్యక్తం చేశారు. ఈ రెండు ఘటనలపై సమగ్ర న్యాయ విచారణకు ఆదేశించాలని కోరారు.

టెక్ శంకర్ అంత్యక్రియలు పూర్తి

మావోయిస్టు పార్టీ ఏవోబీ నేత మెట్టూరి జోగారావు (టెక్ శంకర్) అంత్యక్రియలు శుక్రవారం ఆయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులోని బాతుపురంలో పూర్తయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో టెక్ శంకర్ సహా ఏడుగురు మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో టెక్‌శంకర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు ఆయన బంధువులకు అప్పగించారు. అయితే, ఆయన శవయాత్రకు వజ్రపుకొత్తూరు పోలీసులు అనుమతించలేదు. దీంతో విప్లవ సంఘాలు, ఏబీఎమ్ఎస్ నాయకులు, ప్రజాకళాకారులు విప్లవగీతాలు ఆలపిస్తూ నేరుగా శ్మశానవాటికకు చేరుకున్నారు. మృతదేహానికి జోగారావు సోదరుడు మధుసూదన్ అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసుల ఆంక్షలపై ఏబీఎమ్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రోడ్డుపై బైఠాయించి కొద్దిసేపు నిరసన తెలిపారు.

రాజమండ్రి జైలుకు మరో ఇద్దరు నక్సల్స్

బాల మావోయిస్టులకు 5 వరకు రిమాండ్

విజయవాడలో అదుపులోకి తీసుకున్నవారిలో మరో ఇద్దరు మావోయిస్టులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న నక్సల్స్‌లో నలుగురి వయస్సు విషయంలో విజయవాడ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటు కోర్టు న్యాయాధికారి బుధవారం అనుమానం వ్యక్తం చేయగా, వారికి గురువారం వయసు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆ నలుగురిలో మడకం హంగు(ఏ7), దోడి నీలేశ్(ఏ10) మినహా మిగతా ఇద్దరు బాలలని తేలింది. దీంతో హంగు, దోడి నితీశ్‌లను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు వాళ్లిద్దరినీ శుక్రవారం మధ్యాహ్నం జైలుకు పోలీసులు తీసుకువచ్చారు. బుధవారం తీసుకువచ్చిన 15 మంది మావోయిస్టులతో కలిపి.. జైలులో 17 మంది ఉన్నారు. కాగా, మైనర్లుగా తేలిన మిగతా ఇద్దరికి విజయవాడ రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు (జువెనైల్) న్యాయాధికారి రాధిక వచ్చేనెల ఐదోతేదీ వరకు రిమాండ్ విధించారు. ఈ ఇద్దరిలో.. బాలుడిని విజయవాడలోని బాలల సంరక్షణ కేంద్రానికి, బాలికను విశాఖలోని సంరక్షణ కేంద్రానికి తరలించాలని ఆదేశించారు.

వీలైతే సరెండర్లు.. లేదంటే ఎన్‌కౌంటర్లు

» మావోయిస్టు నేతల లెక్క తేల్చనున్న పోలీసులు

» అదుపులో ముగ్గురు తెలంగాణ అగ్రనేతలు?

» 28న డీజీపీలతో మోదీ భేటీకి ముందే చర్యలు

హైదరాబాద్, నవంబర్21 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్, ఏపీలో పెద్ద స్థాయిలో మావోయిస్టులు అరెస్టయిన నేపథ్యంలో.. మిగిలిన అగ్రనేతల విషయంలో పోలీసు ఉన్నతాధికారులు నిశితంగా దృష్టి సారించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఈనెల 28న నిర్వహించనున్న డీజీపీల సమావేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సారథ్యం వహించబోతున్నారు. ఈ నేపథ్యంలో ఐబీ సూచనలతో ఆలోపే.. అయితే సరెండర్లు..లేదంటే ఎన్‌కౌంటర్లు అనే లక్ష్యంతో ఉన్నతాధికారులు ముందుకు కదులుతున్నారు. మిగిలిన కేంద్ర, రాష్ట్ర స్థాయి నేతలను జనజీవన స్రవంతిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీ, తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రాజిరెడ్డి, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, రాష్ట్ర కమిటీ నాయకుడు కొయ్యాడ సాంబయ్య అలియాస్ అజాద్‌లు పోలీసుల అదుపులోనే ఉన్నారని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. భారీ స్థాయిలో లొంగుబాట్లు ఉండొచ్చని అంతర్గత సంభాషణల్లో పోలీసు ఉన్నతాధికారులు అంగీకరిస్తున్నారు. ఎవరెవరు తమ అదుపులో ఉన్నారనేది కేంద్ర నిఘావర్గాల సూచన మేరకు రహస్యంగానే ఉంచుతున్నారు. కేంద్ర కమిటీలో మిగిలిన వారిలో తిప్పిరి తిరుపతి, ముప్పాళ లక్ష్మణ్‌రావు, పాక హన్మంతు, మల్లా రాజిరెడ్డి, పసునూరి నరహరి తెలంగాణకి చెందిన వారు. మిసిర్ బెసరా, అనల్‌దా అలియాస్ తుఫాన్‌దా ఝార్ఖండ్‌కు, మజ్జిదేవ్ అలియాస్ రాంధీర్ ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు. వీరిలో రాంధీర్, తిప్పిరి తిరుపతి మాడ్ ఏరియా బాధ్యులు. వీరిద్దరూ పోలీసులకు పట్టుబడి ఉండొచ్చని మాజీ మావోయిస్టులు అనుమానిస్తున్నారు. మిసిర్ బెసరా, పసునూరి నరహరి, అనల్‌దా జార్ఖండ్‌లోని సరందాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పాక హన్మంతు ఒడిశా కమిటీ బాధ్యత వహిస్తున్నాడు.ఝార్ఖండ్‌లోని మావోయిస్టు నేతలను లొంగుబాట పట్టించేందుకు అక్కడి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 11న అదుపులోకి తీసుకున్న అజాద్, అశోక్‌ను కోర్టులో హాజరుపరచాలని పౌరహక్కుల సంఘం నాయకులు లక్ష్మణ్, నారాయణరావు కోరారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపి.. శాంతి చర్చలు జరపాలి

» సుప్రీంకోర్టు మౌనంగా ఉండటం బాధాకరం: కూనంనేని

» బూటకపు ఎన్‌కౌంటర్లు చేసిన వారిపై కేసులు పెట్టాలి: కోదండరాం

» మావోయిస్టులను చంపే అధికారం కేంద్రానికి ఎక్కడిది?: జాన్‌వెస్లీ

» ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైటా?: హరగోపాల్



హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో సీపీఐ నేత కూనంనేని, వామపక్షపార్టీల నేతలు

కవాడిగూడ/ఇల్లెందుటౌన్/సిద్దిపేట క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మనుషుల ఊచకోతకు పాల్పడుతుంటే సుప్రీంకోర్టు మౌనంగా ఉండటం బాధాకరమని, ఇప్పటికైనా బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ వ్యవస్థ సుమోటోగా స్వీకరించి సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లను కేంద్రం తక్షణమే నిలిపేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బూటకపు ఎన్‌కౌంటర్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో వామపక్ష రాజకీయ పార్టీల నేతలు, మేధావులు, ప్రజాసంఘాల పౌరహక్కుల ప్రతినిధులతో కలిసి నిరసన చేపట్టారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని.. ఎన్‌కౌంటర్లను ఆపి అటవీ సంపదను కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కూనంనేని మాట్లాడుతూ.. మావోయిస్టులను చంపినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పట్ల చాలామంది మూగవేదనకు ప్రతీకగా తాము నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. టీజేఎస్ చీఫ్, ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి బూటకపు ఎన్‌కౌంటర్లు ఒక గొడ్డలి పెట్టు లాంటివన్నారు. చట్టవిరుద్ధంగా బూటకపు ఎన్‌కౌంటర్లు చేసిన అధికారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. మనుషులను చంపే అధికారం కేంద్రానికి ఎవరు ఇచ్చారని నిలదీశారు. ప్రాణాలు తీసే అధికారం రాజ్యానికి లేదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్ అవుతారా అని నిలదీశారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్ల తీరుపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు పట్టుకున్న మావోస్టులను తక్షణమే కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని, అందులో భాగంగానే ఆదివాసులకు అండగా ఉన్న నక్సల్స్‌ను చంపుతున్నారని వామపక్ష పార్టీల నేతలు పోటు రంగారావు, సాధినేని వెంకటేశ్వరరావు తదితరులు మండిపడ్డారు.

పలు చోట్ల నిరసనలు..

ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష, పౌర హక్కుల సంఘాల నేతలు పలుచోట్ల ఆందోళనకు దిగారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో వామపక్షాల నేతలు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఎన్‌కౌంటర్ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని సిద్దిపేటలో ఉమ్మడి మెదక్ జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు భూపతి డిమాండ్ చేశారు.

దేవ్‌జీ, రాజిరెడ్డి పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ఆధారాల్లేవు

వారు తమ వద్ద ఉన్నారని అధికారులు చెప్పలేదు

అందువల్ల జోక్యం చేసుకోలేం: హైకోర్టు

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి(దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డిలను కోర్టు ముందు హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మూసివేసింది. వీరిద్దరూ పోలీసుల నిర్బంధంలో ఉన్నారని నిరూపించేందుకు ప్రాథమిక ఆధారాలు లేనందున ప్రస్తుత వ్యాజ్యంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఆధారాలు లభిస్తే కోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు జస్టిస్ సి.మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ జి.తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. దేవ్‌జీ, రాజిరెడ్డిలను కోర్టు ముందు హాజరుపరచాల్సిందిగా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దేవ్‌జీ తమ్ముడు తిప్పిరి గంగాధర్, రాజిరెడ్డి కుమార్తె స్నేహలత హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం విచారణకు జరిపిన ధర్మాసనం.. వారిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నారని నిరూపించే ఆధారాలేమైనా ఉంటే.. కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను ఆదేశించింది. శుక్రవారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ల తరఫు న్యాయవాది యు.జై భీమారావు వాదనలు వినిపించారు. మావోయిస్టుల అరెస్టుకు సంబంధించి వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలు, మీడియా చానళ్లలో ప్రసారమైన వీడియోలను పెన్‌డ్రైవ్‌లో కోర్టు ముందు ఉంచామని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల ప్రెస్‌మీట్ వీడియోను పెన్‌డ్రైవ్‌లో కోర్టు పరిశీలనకు ఉంచామని పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది టి.విష్ణుతేజ అన్నారు. ముఖ్య నేతల భద్రతాసిబ్బంది 9మంది తమ అదుపులో ఉన్నారని పోలీసులు చెప్పారు తప్ప దేవ్‌జీ, రాజిరెడ్డి గురించి ప్రస్తావించనేలేదన్నారు. వీడియోలను పరిశీలించిన ధర్మాసనం కూడా ఇదే నిర్ధారించింది. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. దేవ్‌జీ, రాజిరెడ్డి పోలీసులు నిర్బంధంలో ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లేనందున తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది.

హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. 'కొందరు ద్రోహులు ఇచ్చిన సమాచారంతో ఈనెల 15న విజయవాడలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరాయుధులైన హిడ్మా, రాజేతోపాటు మరికొందరిని కేంద్ర హోంశాఖ డైరెక్షన్‌లో ఏపీ ఎస్ఐబీ పోలీసులు పట్టుకున్నారు. హత్య చేసి మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ కట్టు కథ అల్లారు. ఆయుధాలు దొరికాయని, ఆరుగురు చనిపోయారని ప్రకటించడం అబద్ధం. ఏవోబీ రాష్ట్ర కమిటీ సభ్యుడు టెక్ శంకర్‌తోపాటు మరికొందరిని సైతం పట్టుకొని చంపి రంపచోడవరం ఏరియాలో ఎన్‌కౌంటర్ జరిగిందని కట్టు కథ అల్లారు. ఈ క్రూర హత్యలకు వ్యతిరేకంగా 23న దేశవ్యాప్తంగా నిరసన దినంగా పాటించాలని పిలుపునిస్తున్నాం' అని పేర్కొన్నారు. హిడ్మా చరిత్ర భారత విప్లవోద్యమంలో చెరిగిపోని ముద్ర వేసిందన్నారు. భగత్‌సింగ్, కొమురం భీం, గూండాధూర్, గేంద్‌సింగ్, అల్లూరి సీతారామరాజుల్లా హిడ్మా పోరాటాన్ని చూసి భవిష్యత్ తరాలు ప్రేరణ పొందుతాయని తెలిపారు. దేశంలో ఆర్ఎస్ఎస్-బీజేపీ మనువాదులు పచ్చి ఫాసిస్టు దమనకాండను కొనసాగిస్తున్నారని, దేశసంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటాలు చెలరేగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పోరాటాలను విచ్ఛిన్నం చేసి పక్కదారి పట్టించటం కోసం మతోన్మాదాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రతిపక్ష పార్టీల్ని మొత్తంగా నిర్మూలించి బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థను కూడా ధ్వంసం చేసే పథకాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ఖనిజాల దోపిడీ కోసమే ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేస్తున్నారని, మావోయిస్టులను హత్య చేస్తున్నారని ఆరోపించారు. చివరివరకు ఉద్యమంలో కొనసాగి, శత్రువుకు తలవంచకుండా తమ ప్రాణాలర్పించి ఉద్యమ స్ఫూర్తిని చూపిన హిడ్మా, రాజే, టెక్ శంకర్, చైతు, కమ్లూ, మల్లాల్, దేవేలకు మావోయిస్టు పార్టీ జోహార్లు అర్పిస్తోందన్నారు. వీరు కొనసాగించిన విప్లవ సంప్రదాయాలను, ఉద్యమ స్ఫూర్తిని నింపుకొని ఉద్యమాన్ని కొనసాగిస్తామని శపథం చేస్తున్నామని పేర్కొన్నారు. హిడ్మా వంటి సాహసోపేత సేనానుల చరిత్రతో ప్రేరణ పొంది ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ మనువాదులకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో, అంతిమంగా దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు జరిగే పోరాటంలో పాల్గొనాలని కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులకు, ఇతర సామాజిక వర్గాలకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★



సనాతన ధర్మం పరాక్రమం చూస్తారు

నందమూరి బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న డివైన్ యాక్షన్ ఫిల్మ్ 'అఖండ 2. తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. తేజస్విని నందమూరి సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం కర్నాటకలో విడుదల చేశారు. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ను లాంచ్ చేశారు.ఈ సభలో బాలకృష్ణ మాట్లాడుతూ 'ఉదయం వర్ష సూచన లేదు. మేం హోటల్‌కు వచ్చేటప్పటికి కుంభవృష్టి కురిసింది. మళ్లీ వేదికపైకి వచ్చేసరికి వర్షం లేదు. ఇదంతా శివుని మహిమ. 'అఖండ 2' పాన్ ఇండియా సినిమా. ఈ చిత్రంలో సనాతన ధర్మం పరాక్రమం చూస్తారు. థియేటర్‌లో బాక్సులు పేలిపోయే మ్యూజిక్ ఇచ్చాడు తమన్' అన్నారు. 'బాలయ్యగారి నటన, డైలాగులు, యాక్షన్‌లో ఓ అద్భుతమైన ఎనర్జీ ఉంటుంది. డిసెంబర్ 5న విడుదలయ్యే ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది' అన్నారు శివరాజ్‌కుమార్. శివతత్వం కలిగిన అద్భుతమైన చిత్రం ట్రైలర్‌ను శివన్న విడుదల చేయడం గర్వంగా ఫీలవుతున్నానని దర్శకుడు బోయపాటి శ్రీను చెప్పారు. డిసెంబర్ 5న అంతా అఖండ తాండవ శబ్దమే అని నిర్మాత గోపీ ఆచంట అన్నారు.



'వనజీవి రామయ్య' జీవితం వెండితెరపైకి

వనజీవి రామయ్యగా ప్రసిద్ధుడైన దరిపల్లి రామయ్య జీవితం ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం షూటింగ్ శుక్రవారం ఖమ్మంలో మొదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వేముగంటి, నిర్మాత చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ "వనజీవి రామయ్య' టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం షూటింగ్‌ను ఖమ్మంలో ప్రారంభించడానికి ముఖ్య కారణం ఇది ఆయన పుట్టిన గడ్డ కావడమే. ఆయన గొప్పదనాన్ని చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతో నటీనటులంతా పారితోషికం తీసుకోకుండా నటిస్తున్నారు' అని అన్నారు. టైటిల్ రోల్ పోషిస్తున్న బహ్మజీ మాట్లాడుతూ.. ఈ చిత్రంలో నటించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. వనజీవి రామయ్యలా జీవించాలనే కోరికతో ఈ చిత్రంలో నటిస్తున్నాను, ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని ఆదరించడంతో పాటు ఓ మొక్కను నాటాలన్నారు. అలాగే వనజీవి రామయ్య మృతి చెందిన నాటి నుంచి ఆయన సతీమణి జానకమ్మకు పెన్షన్ ఇవ్వడం లేదని తెలిసిందని.. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి ఆమెకు పెన్షన్ అందేలా చూడాలని కోరారు.

ఖమ్మం ఖానాపురంహవేలి (ఆంధ్రజ్యోతి)

స్పోర్ట్స్


వరంగల్ ● శనివారం 22 నవంబరు 2025

శ్రేయాస్..ఇంకో రెండు నెలలు

ముంబై: భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ బరిలోకి దిగేందుకు మరింత సమయం పట్టేలా ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలో జరిగిన మూడో వన్డేలో శ్రేయాస్ పక్కటెముకల గాయానికి గురై ఐసీయూలో చేరిన విషయం తెలిసిందే. చిన్నపాటి సర్జరీ తర్వాత ప్రస్తుతం కోలుకుంటున్న తనకు మరో రెండు నెలలపాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు తెలిపారు. ఆ తర్వాత అల్ట్రాసోనోగ్రఫీ స్కానింగ్ చేశాకే బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ పునరావాస శిబిరంలో చేరతాడు. దీంతో వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ వరకు అతను బ్యాట్ పట్టే అవకాశం లేదు.

తొలిరోజే 19 వికెట్లు

- ఇంగ్లండ్ 172 ఆలౌట్
- ఆస్ట్రేలియా 123/9
- స్టార్క్‌కు 7, స్టోక్స్‌కు 5 వికెట్లు
- యాషెస్ మొదటి టెస్టు


స్టార్క్ (7/58)

పెర్త్: యాషెస్ సిరీస్‌లో తొలిరోజు ఏకంగా 19 వికెట్లు నేల కూలాయి. శుక్రవారం ప్రారంభమైన తొలి టెస్టులో స్టార్క్ (7/58) కెరీర్ ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన చేయడంతో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 172 పరుగులకే ఆలౌటైంది. బ్రూక్ (52), పోప్ (46) రాణించారు. అయితే ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా బెన్‌స్టోక్స్ బౌలింగ్‌కు దాసోహమైంది. స్టోక్స్ ఐదు వికెట్లతో చెలరేగడంతో తొలి రోజు చివరకు ఆస్ట్రేలియా 123/9 స్కోరుతో ఇక్కట్లలో పడింది. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 49 రన్స్ దూరంలో నిలిచింది.

సూపర్ ఓవర్‌లో భారత్ 'ఎ' ఓటమి

బంగ్లా 'ఎ'తో రైజింగ్ స్టార్స్ కప్ సెమీస్

దోహ: బ్యాటింగ్, బౌలింగ్‌లో చెత్త ప్రదర్శన చేసిన భారత్ 'ఎ' జట్టు రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ టీ20టోర్నీలో సెమీఫైనల్లో పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 'ఎ' సూపర్ ఓవర్లో గెలుపొందింది. తొలుత బంగ్లా 20 ఓవర్లలో 194/6 స్కోరు చేసింది. హబీబుర్ రహ్మాన్ (65), మెహరాబ్ (48 నాటౌట్) సత్తా చాటారు. ఛేదనలో భారత్ కూడా 20 ఓవర్లలో 194/6 స్కోరే చేసింది. ప్రియాన్ష్ ఆర్య (44), వైభవ్ (38) రాణించారు. తుది బంతికి 4 పరుగులు చేయాల్సిన ఉండగా మనోళ్లు 3 పరుగులే రాబట్టడంతో మ్యాచ్ టై అయ్యింది. సూపర్ ఓవర్లో జితేష్, రమణ్‌దీప్‌లను బ్యాటింగ్ పంపిన వ్యూహం బెడిసింది. జితేష్‌తోపాటు తర్వాత వచ్చిన అశుతోష్ కూడా డకౌట్ కావడం గమనార్హం. ఇక.. బంగ్లాదేశ్ 'ఎ' విజయానికి ఒక పరుగు అవసరం కాగా.. సుయాష్ వైడ్ వేయడంతో భారత్ 'ఎ' కథ ముగిసింది.

సమమా.. సమర్పణమా?



కెప్టెన్ గిల్ దూరం

సిరీస్‌పై దక్షిణాఫ్రికా దృష్టి

నేటి నుంచి రెండో టెస్టు

ఉ.9 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

గువాహటి: తొలి టెస్టులో చిత్తయిన భారత జట్టు.. ఇప్పుడు కెప్టెన్ గిల్ లేకుండానే సిరీస్ నిర్ణాయక మ్యాచ్ బరిలోకి దిగనుంది. 0-1తో వెనుకబడిన టీమిండియా ఈ సిరీస్‌ను సమం చేయాలంటే నేటి నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే ఈ రెండో టెస్టులో గెలిచి తీరాల్సిందే. అందుకే కీపర్ రిషబ్ పంత్ నేతృత్వంలో బరిలోకి దిగబోతున్న టీమిండియా తీవ్ర ఒత్తిడిలోనే ఉంది. స్వదేశంలో ఆడుతున్నప్పటికీ చాలా ఏళ్ల తర్వాత తొలిసారిగా భారత్‌ను ఫేవరెట్‌గా పరిగణించలేని పరిస్థితి నెలకొంది. మొదటి టెస్టులో టర్నింగ్ పిచ్‌పై సఫారీ స్పిన్నర్లు అదరగొట్టి ఆతిథ్య భారత్‌ను కంగుతినిపించారు. గువాహటిలోనూ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న బవుమా సేన భారత గడ్డపై పాతికేళ్ల తర్వాత ఓ టెస్టు సిరీస్‌ను నెగ్గాలనే కసితో ఉంది. ఒకవేళ భారత్ ఈ టెస్టును కూడా కోల్పోతే కోచ్ గంభీర్‌పై విమర్శలు తప్పవు. ఇప్పటికే జట్టు భారత్‌లో ఆడిన చివరి ఆరు టెస్టుల్లో నాలుగింటిని ఓడిపోగా.. ఏడాదిలో రెండోసారి వైట్‌వాష్‌కు దగ్గరగా ఉంది.


బవుమా

గిల్ స్థానంలో ఎవరు?

కెప్టెన్ గిల్ దూరం కావడంతో అతడి స్థానంలో ఆడే ఆటగాడిపై సస్పెన్స్ కొనసాగుతోంది. సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కళ్ మధ్య పోటీ నెలకొంది. జట్టు వర్గాల సమాచారం ప్రకారం సాయికే బెర్త్ దక్కే అవకాశం కనిపిస్తోంది. తాత్కాలిక కెప్టెన్ పంత్ మాత్రం.. ఎవరాడేదీ బరిలోకి దిగే ఆటగాడికి తెలుసంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించాడు. ఇక తొలి టెస్టులో భారత్ నుంచి ఒక్క అర్ధసెంచరీ కూడా నమోదుకాలేదు. ఓపెనర్ రాహుల్, సుందర్ మోస్తరుగా రాణించారు. జైస్వాల్, జురెల్, పంత్ బ్యాట్లు ఝుళిపించాల్సి ఉంది. పిచ్ పరిస్థితిని బట్టి పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌కు చాన్స్ దక్కనుంది. అదే జరిగితే స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ బెంచీకే పరిమితం కానున్నాడు. పేసర్లు బుమ్రా, సిరాజ్ ప్రభావం చూపగలుగుతున్నారు. జడేజా, కుల్దీప్ స్పిన్‌లో కీలకం కానున్నారు.

రబాడ అవుట్

గెలుపు జోరు మీదున్న సౌతాఫ్రికా సిరీస్‌ను చేజారనీయకూడదనే ఆలోచనలో ఉంది. ముఖ్యంగా స్పిన్నర్ హార్మర్ భారత్‌కు ప్రమాదకరంగా మారాడు. ఈ టెస్టులోనూ జట్టు అతడిపైనే ఎక్కువగా ఆధారపడింది. ఇంకో స్పిన్నర్ కేశవ్ అతడికి అండగా ఉంటాడు. మరోవైపు గాయంతో బాధపడుతున్న ప్రధాన పేసర్ రబాడ ఈ మ్యాచ్‌కూ దూరం కానున్నాడు. అతడు లేని లోటును భర్తీ చేస్తూ మరో పేసర్ యాన్సెన్ ఆరంభంలోనే వికెట్లు తీస్తూ భారత్‌ను ఒత్తిడిలోకి నెడుతున్నాడు. ఇక ఆకట్టుకోలేకపోతున్న బాష్ స్థానంలో పేసర్ ఎన్‌గిడిని తీసుకోవచ్చు. అయితే సఫారీ బ్యాటర్లలో కెప్టెన్ బవుమా ఒక్కడే పోరాడుతున్నాడు. టాపార్డర్ అండగా నిలవాల్సి ఉంది. మిడిలార్డర్‌లో జోర్జి, స్టబ్స్ నిలకడగా ఆడితే భారీ స్కోరు ఖాయం.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రాహుల్, వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్, జురెల్, రిషబ్ పంత్ (కెప్టెన్), జడేజా, నితీశ్/అక్షర్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.

దక్షిణాఫ్రికా: రికెల్టన్, మార్‌క్రమ్, ముల్డర్, బవుమా (కెప్టెన్), జోర్జి, స్టబ్స్, వెరీన్, యాన్సెన్, ఎన్‌గిడి, హార్మర్, కేశవ్ మహరాజ్.

పిచ్, వాతావరణం

రెండో టెస్టు పిచ్ ఎలా స్పందిస్తుందనే విషయమై జోరుగా చర్చ సాగుతోంది. ఈ మైదానంలో ఇదే మొట్టమొదటి టెస్టు కాగా.. పిచ్‌ను ఎర్ర మట్టితో రూపొందించారు. కాస్త పచ్చిక కనిపిస్తుండడంతో దాన్ని కత్తిరిస్తారా? లేదా? తెలియాల్సి ఉంది. ఒకవేళ కట్ చేస్తే ఆరంభంలో బౌన్స్‌కు అవకాశమిచ్చినా.. ఆ తర్వాత స్పిన్నర్లదే ఆధిపత్యం. ఇక ఈశాన్య భారతంలో సూర్యాస్తమయం త్వరగా ఉంటుంది కాబట్టి మ్యాచ్ అర్ధగంట ముందే.. అంటే 9 గంటలకే ఆరంభం కానుంది. భారత క్రికెట్ చరిత్రలో ఈ కొత్త స్టేడియం 30వ టెస్టు వేదికగా నిలవబోతోంది.

జట్టును వీడిన శుభ్‌మన్

మెడ నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ శుక్రవారం నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో విఫలమయ్యాడు. దీంతో రెండో టెస్టుకు దూరమైన తను జట్టును వీడి ముంబైకి చేరుకున్నాడు. అక్కడే కొన్ని రోజుల విశ్రాంతి తర్వాత మరోసారి వైద్యులను సంప్రదించనున్నాడు. మరోవైపు ఈనెల 30 నుంచి దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఆరంభం కానుంది. అప్పటివరకు అతను కోలుకుంటాడా? లేదా? అనేది కూడా ఆసక్తికరంగా మారింది.



టెస్టు చరిత్రలో తొలిసారి..

148 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో మొదటిసారి లంచ్ కంటే ముందే ఇక్కడ టీ విరామం తీసుకోనున్నారు. అంటే ఉదయం 11 గంటల నుంచి 11.20 వరకూ టీ, తర్వాత మధ్యాహ్నం 1.20 నుంచి 2 గంటలవరకూ భోజన విరామం ఉంటుంది. ఇక్కడ శీతాకాలంలో సూర్యోదయ, సూర్యాస్తమయాలు త్వరగా అవుతాయి. కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు.

బవుమా, మార్‌క్రమ్‌లకు పగ్గాలు

భారత్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు దక్షిణాఫ్రికా జట్ల ఎంపిక

జొహాన్నెస్‌బర్గ్: భారత్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు దక్షిణాఫ్రికా జట్లను శుక్రవారం ప్రకటించారు. వన్డేలకు బవుమాను, టీ20లకు మార్‌క్రమ్‌ను కెప్టెన్లుగా ఎంపిక చేశారు. రెండు జట్ల మధ్య మూడు వన్డేలు (నవంబరు 30-డిసెంబరు 6), ఐదు టీ20 (డిసెంబరు 9-19)లు జరగనున్నాయి.

వన్డే జట్టు: బవుమా (కెప్టెన్), బార్ట్‌మన్, బ్రీట్జ్‌కే, బ్రెవిస్, బర్గర్, డికాక్, టోనీ జోర్జి, రూబిన్ హెర్మన్, యాన్సెన్, కేశవ్, మార్‌క్రమ్, ఎన్‌గిడి, రికెల్టన్, సుబ్రేయన్.

టీ20 జట్టు: మార్‌క్రమ్ (కెప్టెన్), బార్ట్‌మన్, బాష్, బ్రెవిస్, డికాక్, టోనీ జోర్జి, ఫెరీరా, హెన్‌డ్రిక్స్, యాన్సెన్, జార్జ్ లిండే, కేశవ్, ఎంపాక, మిల్లర్, ఎన్‌గిడి, నోకియా, స్టబ్స్

సెమీస్‌కు లక్ష్యసేన్

సాత్విక్ జోడీ అవుట్

ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ సెమీఫైనల్‌కు దూసుకుపోగా..టాప్ సీడ్ భారత జోడీ సాత్విక్/చిరాగ్ క్వార్టర్‌ఫైనల్లో నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ రౌండ్-8 పోరులో లక్ష్యసేన్ 23-21, 21-11తో సహచరుడు ఆయుష్ షెట్టిపై నెగ్గాడు. డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 19-21, 15-21తో ఫజర్/ఫిక్రి (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓడారు.

డబ్ల్యూపీఎల్ వేలంలో 277 మంది

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో 277 మంది ప్లేయర్లు అందుబాటులో ఉండనున్నారు. ఈనెల 27న వేలం జరుగనుండగా శుక్రవారం క్రికెటర్ల జాబితాను వెల్లడించారు. ఇందులో 197 మంది భారత్, 83 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. ఐదు ఫ్రాంచైజీల దగ్గర కలిపి రూ.41.1 కోట్ల పర్స్ ఉండగా.. ఇందులో నుంచే 73 స్లాట్ల కోసం పోటీ పడనున్నాయి. ఇక గరిష్ఠ ధర రూ.50 లక్షలతో 19 మంది ప్లేయర్లు రిజిస్టర్ చేసుకున్నారు. భారత్ నుంచి ఆల్‌రౌండర్ దీప్తి శర్మతో పాటు హర్లీన్, ప్రతీకా రావల్, పూజా వస్త్రాకర్, ఉమా ఛెత్రి, క్రాంతి గౌడ్ ఈ విభాగంలో ఉన్నారు. ఆ తర్వాత రూ.40 లక్షల కేటగిరీలో 11 మంది, రూ.30 లక్షల ప్రాథమిక ధరతో 88 మంది వేలానికి అందుబాటులో ఉన్నారు.

శౌర్యకు రజతం

టోక్యో: బధిర ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్‌కు మరో పతకం లభించింది. శుక్రవారం జరిగిన పురుషుల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో శౌర్య సైనీ 450.6 పాయింట్లతో రజత పతకం అందుకున్నాడు. శౌర్య రజతంతో కలిపి.. ఈ పోటీల షూటింగ్‌లో భారత్ పతకాల సంఖ్య 13కి చేరింది.

స్టేడియంలో స్మృతీకి పలాష్ సర్‌ప్రైజ్



కప్పు నెగ్గిన చోటే పెళ్లి ప్రతిపాదన

రేపు ఒక్కటికానున్న జంట

న్యూఢిల్లీ: దాదాపు ఆరేళ్ల ప్రేమలో మునిగితేలిన టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతీ మంధాన, బాలీవుడ్ యువ సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్ ఆదివారం వివాహ బంధంతో ఒక్కటి కానున్నారు. అయితే, అంతకంటే ముందు పలాష్ తనకు కాబోయే శ్రీమతి స్మృతీకి సర్‌ప్రైజ్ ఇచ్చాడు. ఇటీవల భారత మహిళల జట్టు ప్రపంచ కప్ నెగ్గిన ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలోనే మంధానకు పెళ్లి ప్రతిపాదన చేశాడు. కళ్లకు గంతలు కట్టి స్మృతీని మైదానంలోకి తీసుకొచ్చిన పలాష్.. అనంతరం ఆమె గంతలు తీసేసి, మోకాళ్లపై కూర్చొని నన్ను పెళ్లి చేసుకుంటావా? అని అడిగాడు. ఈ అనూహ్య పరిణామంతో ఉద్వేగానికి లోనైన మంధాన.. సరేననడంతో ఇద్దరూ ఉంగరాలు మార్చుకున్నారు. ఇక, స్మృతి ఇంట శుక్రవారం హల్దీ వేడుక నిర్వహించారు. సహచర క్రికెటర్లు జెమీమా, షఫాలీ వర్మ, అరుంధతీ రెడ్డి, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్ తదితరులు సంబరాల్లో పాల్గొన్నారు.

ప్రధాని మోదీ వినూత్న విషెష్

ఈ శుభ సందర్భంలో కాబోయే వధూవరులకు పలువురు సెలెబ్రిటీలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ వినూత్న రీతిలో విషెస్ చెప్పారు. స్మృతీ మంధాన అద్భుతమైన కవర్ డ్రైవ్, పలాష్ స్వర సమ్మేళనం కలిసి మరపురాని భాగస్వామ్యాన్ని నిర్మించాలని మోదీ ట్వీట్ చేశారు.

బంగ్లాదేశ్‌కు భారీ ఆధిక్యం

ఐర్లాండ్‌తో రెండో టెస్ట్

మీర్పూర్: ఐర్లాండ్‌తో రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ భారీ ఆధిక్యంలో కొనసాగుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆట ఆఖరికి ఆతిథ్య జట్టు వికెట్ నష్టానికి 156 పరుగులు చేసింది. దాంతో తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 211 పరుగులతో కలిపి మొత్తంగా బంగ్లాదేశ్ 367 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు ఐర్లాండ్ 265 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 476 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,480 ▼	1,14,100 ▼	1,61,000 ▼
విజయవాడ	1,25,500 ▼	1,17,000 ▼	1,60,000 ▼
విశాఖపట్నం	1,27,250 ▲	1,14,300 ▼	1,69,000 ▼
రాజమండ్రి	1,23,980 ▼	1,13,650 ▼	1,55,000 ▼
ప్రొద్దుటూరు	1,24,300 ▼	1,14,360 ▼	1,55,700 ▼
ముంబై	1,23,146 ▲	1,12,802 ▲	1,51,129 ▼

మార్కెట్ మళ్లీ డౌన్


సెన్సెక్స్ 400 పాయింట్లు పతనం

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో రెండు రోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. సెన్సెక్స్ శుక్రవారం 400.76 పాయింట్లు కోల్పోయి 85,231.92 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 124 పాయింట్ల నష్టంతో 26,068.15 వద్ద ముగిసింది. ఏఐ టెక్నాలజీ షేర్లలో ఏర్పడిన బుడగ ఎప్పుడైన పేలవవచ్చన్న ఆందోళలనతో అమెరికా సహా అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లు ఒత్తిడికి లోనవుతుండటంతోపాటు డిసెంబరులో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న ఆశలు ఆవిరి కావడం ఇందుకు కారణమైంది.

1:5 నిష్పత్తిలో కోటక్ బ్యాంక్ షేర్ల విభజన: షేర్లను 1:5 నిష్పత్తిలో విభజించేందుకు తమ బోర్డు ఆమోదం తెలిపిందని కోటక్ మహీంద్రా బ్యాంక్ శుక్రవారం ప్రకటించింది. అంటే, రూ.5 ముఖ విలువతో కూడిన ఒక షేరును రూపాయి ముఖ విలువతో కూడిన 5 షేర్లుగా విభజించనుంది. ఈ బ్యాంక్ 2010 లోనూ రూ.10 ముఖవిలువ కలిగిన షేరును రూ.5 ముఖవిలువతో కూడిన 2షేర్లుగా విభజించింది. రిటైల్ ఇన్వెస్టర్లకు తమ షేరు అందుబాటు ధరలో ఉండేందుకు వీలుగా ఈ విభజన జరుపుతున్నట్లు పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ



హైదరాబాద్	640	విజయవాడ	660
వరంగల్	642	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	106
వరంగల్	112	గుంటూరు	108
కరీంనగర్	112	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	105	అనంతపురం	109
గోదావరి	106		

యూరప్ టిప్స్‌తో యూపీఐ అనుసంధానం

ముంబై: యూరోపియన్ యూనియన్ (ఈయూ)కు చెందిన తక్షణ చెల్లింపుల వ్యవస్థ 'టార్గెట్ ఇన్‌స్టంట్ పేమెంట్స్ సెటిల్‌మెంట్' (టిప్స్)తో మన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ను అనుసంధానించనున్నట్లు ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపింది. ఇందుకోసం యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్‌తో ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్‌ఐపీఎల్) కలిసి కసరత్తు చేస్తున్నాయి. కాగా, క్రాస్ బార్డర్ రెమిటెన్స్ లావాదేవీలను సైతం అమలులోకి తెచ్చేందుకు యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్‌తో కలిసి పనిచేస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది.

కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు రూ.319 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్.. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.319.24 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకుంది. ఈ మేరకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ (ఎల్ఓఏ) అందుకున్నట్లు తెలిపింది. ఆర్డర్‌లో భాగంగా ఈపీసీ విధానంలో మీరాలం ట్యాంక్ మీద ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించాల్సి ఉంటుందని పేర్కొంది. 24నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపింది.

నాట్కో ఫార్మా చెన్నై, మనాలీలోని యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) ప్లాంట్‌పై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) ఏడు అభ్యంతరాలు లేవనెత్తింది. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు ఎఫ్‌డీఏ ఈ ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించి ఈ మేరకు ఏడు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫారమ్-483 జారీ చేసిందని నాట్కో ఫార్మా తెలిపింది. అయితే ఎఫ్‌డీఏ లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరిస్తామని పేర్కొంది.

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ).. కనెక్టెడ్ మొబిలిటీ ఇన్‌సైట్స్‌లో నైపుణ్యం కలిగిన టెక్ స్టార్టప్ రావిటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో 7.84 శాతం ఈక్విటీ వాటాను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఇందుకోసం కంపెనీ ఇన్నోవేషన్ ఫండ్ ద్వారా సుమారు రూ.2 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈ భాగస్వామ్యం తమ డేటా ఆధారిత మొబిలిటీ సేవలను మరింత బలోపేతం చేస్తుందని మారుతి తెలిపింది.

అయ్యో.. రూపాయే!



సరికొత్త రికార్డు కనిష్ఠానికి రూపాయి మారకం విలువ

- ఒక్కరోజే 98 పైసల పతనం
- తొలిసారిగా రూ. 89 దాటిన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు

రూ.89.66 వద్ద ముగింపు

ముంబై: భారత కరెన్సీ సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం ఏకంగా 98 పైసలు నష్టపోయి రూ.89.66 వద్ద ముగిసింది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.89 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. అంతేకాదు, గడిచిన 3 ఏళ్లకు పైగా కాలంలో రూపాయికి ఇదే అతిపెద్ద ఒక్కరోజు క్షీణత. 2022 ఫిబ్రవరి 24న రూపాయి మారకం విలువ 99 పైసలు క్షీణించింది. రూపాయి మారకం విలువకు క్రితం ఆల్‌టైం ఇంట్రాడే కనిష్ఠం సెప్టెంబరు 30న రూ.88.85 వద్ద నమోదు కాగా.. అక్టోబరు 14న రూ.88.81 వద్ద క్రితం ఆల్‌టైమ్ ముగింపు నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూపాయి విలువ 4.6 శాతం మేర తగ్గింది. ఆసియాలోకెల్లా అత్యధికంగా తరిగిపోయిన కరెన్సీ మనదే.

కరెన్సీ క్షీణతకు కారణాలు

- దేశీయ దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరగడం
- ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేస్తున్న ఓ భారత కంపెనీపై అమెరికా ఆంక్షలు విధించింది
- అంతర్జాతీయంగా 6 ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ మళ్లీ బలపడటం. డాలర్ ఇండెక్స్ 100కు చేరుకుంది
- టెక్నాలజీ షేర్లలో భారీగా అమ్మకాల కారణంగా దేశీయంగా, అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో కొనసాగాయి
- ట్రంప్ సుంకాలతో పెరిగిన వాణిజ్య సంబంధ అనిశ్చితులు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ మన కరెన్సీపై గడిచిన కొన్ని నెలలుగా ఒత్తిడి పెంచాయి
- గత నెల ఎగుమతులు 11 శాతానికి పైగా క్షీణించి, బంగారం దిగుమతులు భారీగా పెరగడంతో వాణిజ్య లోటు రికార్డు స్థాయికి పెరగడమూ కరెన్సీ మారకంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది
- అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జాప్యమవుతుండటమూ ఇన్వెస్టర్లను కలవరపెడుతున్నది.

త్వరలోనే రూ.90 దాటొచ్చు..

రూపాయి మారకం విలువ మున్ముందు మరింత క్షీణించవచ్చని యా వెల్త్ గ్లోబల్ రీసెర్చ్ డైరెక్టర్ అనూజ్ గుప్తా అన్నారు. డిసెంబరులో ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న ఆశలు ఆవిరైపోతుండటంతో డాలర్ మళ్లీ పుంజుకుంటోందన్నారు. ఇప్పటికే 100కు చేరిన డాలర్ ఇండెక్స్ త్వరలో 102-103కు చేరుకోచ్చని, దేశీయంగా డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు త్వరలోనే రూ.90కి చేరవచ్చని గుప్తా అభిప్రాయపడ్డారు.

పర్మినెంట్ ఉద్యోగులెందుకు..

ఫ్రీలాన్స్ నిపుణులుండగా..!

రూటు మార్చిన కంపెనీలు | ఏటా 40% చొప్పున వృద్ధి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో ఉద్యోగాల స్వరూపం రోజురోజుకు మారిపోతోంది. గతంలోలా కంపెనీలు పర్మినెంట్ ఉద్యోగులను తీసుకునేందుకు పెద్దగా ఇష్టపడడం లేదు. తమ అవసరాలకు అవసరమైన వృత్తి నైపుణ్యాలు ఉన్న ఫ్రీలాన్సర్ల వైపు మొగ్గు చూపుతున్నాయి. తమకు కావలసిన నైపుణ్యాలు ఉన్న ఫ్రీలాన్సర్లు లభిస్తే రెగ్యులర్ ఉద్యోగులకు చెల్లించే జీతాల కంటే 30-40 శాతం అధికంగా చెల్లించి మరీ నియమించుకుంటున్నాయి. టెక్ ప్రాజెక్టుల్లో ఫ్రీలాన్స్ నిపుణలకు డిమాండ్ మరింత ఎక్కువగా ఉంది. ఏటా వీరి డిమాండ్ 40 శాతం చొప్పున పెరుగుతున్నట్టు కంపెనీలు-వృత్తి నిపుణలను అనుసంధానం చేసే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'ఫ్లెక్సింగ్ ఐటీ' పేర్కొంది. గత ఏడాది కాలంగా చూసినా ఫ్రీలాన్సింగ్/గిగ్ నియామకాలు 25 నుంచి 30 శాతం పెరిగినట్టు టీమ్‌లీజ్ డిజిటల్ తెలిపింది.

వీరికి మరింత డిమాండ్: ప్రస్తుతం ఐటీ, టెక్ కంపెనీలతో పాటు దాదాపు అన్ని కంపెనీలు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ అమలు చేస్తున్నాయి. దీంతో కృత్రిమ మేధ (ఏఐ), దాని అప్లికేషన్లు, సైబర్ సెక్యూరిటీ, ఐటీ గవర్నెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో పట్టున్న ఫ్రీలాన్సర్లకు మంచి డిమాండ్ ఉంది. ఐటీ, టెక్ కంపెనీలు వీరిని ఇట్టే తన్నుకుపోతున్నాయి. ఇందుకోసం రెగ్యులర్ ఉద్యోగుల కంటే మంచి మంచి ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నాయి. కార్మిక చట్టాల బాదరబందీ లేకపోవడంతో కంపెనీలు కూడా ఫ్రీలాన్సర్ల వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల్లో ఈ తరహా జాబ్ వర్క్ కంపెనీలకూ అనువుగా మారింది.

ఈ కంపెనీల్లో ఎక్కువ: ఫ్రీలాన్స్ నిపుణుల పట్ల మొగ్గు చూపుతున్న కంపెనీల్లో పారిశ్రామిక సేవలు, కన్సల్టెన్సీ, హెల్త్‌కేర్ కంపెనీలు ముందున్నాయి. గత ఏడాది మొత్తం డిమాండ్‌లో 60 శాతం ఈ మూడు రంగాలకు చెందిన కంపెనీల నుంచే వచ్చింది. ఐటీ, టెక్నాలజీ నుంచి వచ్చిన డిమాండ్ 10 శాతానికి మించి లేదు.

ఎఫ్ఎంసీజీ, ఆటోమోటివ్ కంపెనీలు కూడా ఫ్రీలాన్స్ నిపుణులను పెద్దఎత్తున నియమించుకుంటున్నాయి. కొన్ని కంపెనీల్లో ఫ్రీలాన్స్ నిపుణులు చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ), చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (సీఐఓ) వంటి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు.

డిజిటల్ గోల్డ్ మా పరిధిలో లేదు

- వాటిని నియంత్రించే యోచనా లేదు
- 'రీట్స్'ను సూచీల్లో చేర్చే ప్రతిపాదన
- సెబీ చైర్మన్ పాండే



న్యూఢిల్లీ: డిజిటల్ లేదా ఈ-గోల్డ్ నియంత్రణలపై సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టత ఇచ్చారు. వీటి నియంత్రణ తమ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. వీటి అమ్మకాలను నియంత్రించే యోచన కూడా లేదన్నారు. రీట్స్, ఇన్విట్స్‌పై జరిగిన ఒక సదస్సుకు హాజరైన పాండే మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం స్పష్టం చేశారు. మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందించే గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్టులు, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీప్ట్స్ మాత్రమే ప్రస్తుతం తమ నియంత్రణ పరిధిలో ఉన్నట్టు పాండే చెప్పారు. కాగా రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (రీట్స్)ను స్టాక్ మార్కెట్ సూచీల్లో చేర్చే విషయాన్ని పరిశీలిస్తామని పాండే వెల్లడించారు. అయితే సంబంధిత అన్ని వర్గాలతో చర్చించిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ప్రతిపాదన ఆచరణకు నోచుకుంటే రీట్స్ లిక్విడిటీ (లభ్యత) చెప్పుకోదగ్గ స్థాయిలో పెరుగుతుందన్నారు.

డిసెంబరు 17న సెబీ బోర్డు భేటీ

సెబీ బోర్డు డిసెంబరు 17న భేటీ అవుతోంది. ఈ భేటీలో అనేక కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా ఎంఎఫ్‌ల నిబంధనలు, స్టాక్ బ్రోకర్ల నియంత్రణ అంశాలను సమగ్రంగా సమీక్షించనున్నారు. ఎప్పుడో రూపొందించిన ఈ నిబంధనలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సవరించే విషయాన్ని ఈ సమావేశంలో కూలంకషంగా చర్చిస్తారని భావిస్తున్నారు.

'ఎంఎఫ్'ల ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్లు బంద్!

పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ)కు వచ్చే ముందు కంపెనీలు జారీ చేసే షేర్ల ప్రీ-ప్లేస్‌మెంట్‌లో మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)లు పాల్గొనడాన్ని సెబీ నిషేధించినట్టు సమాచారం. అయితే ఐపీఓకు ఒకటి రెండు రోజుల ముందే జరిగే యాంకర్ ఇన్వెస్ట్‌మెంట్ కోటాలో పాల్గొనేందుకు మాత్రం సెబీ అనుమతించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఐపీఓకు వచ్చే కంపెనీల షేర్ల లభ్యత (లిక్విడిటీ)తో పాటు వాటి విలువ మదింపులో పారదర్శకత పెంచేందుకు ఈ చర్య తోడ్పడుతుందని భావిస్తున్నారు.

11 వేల టయోటా హైరైడర్స్ రీకాల్

న్యూఢిల్లీ: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం).. 11,500 యూనిట్ల మిడ్-సైజ్ ఎస్‌యూవీ అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కార్లను స్వచ్ఛందంగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. 2024 డిసెంబర్ 9 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 29 మధ్య కాలంలో తయారైన ఈ వాహనాల్లో డాష్‌బోర్డ్‌లోని కాంబినేషన్ మీటర్‌లో లోపం ఉండటంతో ఈ కార్లను రీకాల్ చేస్తున్నట్లు తెలిపింది.



బీసీ జేఏసీ సమావేశంలో అభివాదం చేస్తున్న బండారు దత్తాత్రేయ, వీహెచ్, జస్టిస్ చంద్రకుమార్, జాజుల , జూలూరు గౌరీశంకర్, గుజ్జ కృష్ణ

నూతన బీసీ జేఏసీ ఆవిర్భావం

» చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్

బర్కత్‌పుర, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నూతన బీసీ జేఏసీ ఆవిర్భావించింది. జేఏసీ చైర్మన్‌గా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, వర్కింగ్ చైర్మన్‌గా గుజ్జ కృష్ణ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ రిజర్వేషన్లు, సర్పంచ్ ఎన్నికలు, భవిష్యత్ కార్యాచరణ అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు పార్టీల నేతలు, ప్రజా సంఘాలు, బీసీ కుల సంఘాల నేతలు పాల్గొన్నారు. నూతన బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు తెగించి పోరాడుతామన్నారు. రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 25న రాష్ట్రవ్యాప్తంగా బీసీ ద్రోహుల పార్టీల దిష్టిబొమ్మల దహనం, 30న రాజకీయ యుద్ధ భేరీ పేరుతో ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాది మంది బీసీ కుల వృత్తిదారులతో సుందరయ్యపార్కు నుంచి ఇందిరా పార్కు వరకు మహాప్రదర్శన జరుగుతుందని, అనంతరం రాజకీయ యుద్ధ భేరీ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 8, 9 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి పార్లమెంట్‌ను ముట్టడిస్తున్నామన్నారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ ద్వారానే 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధ్యమవుతాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోదీని కలవాలని సూచించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ చట్టాలు, న్యాయస్థానాలు అగ్రకులాలకు చుట్టాలుగా మారుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు మాట్లాడుతూ రిజర్వేషన్లు సాధించుకోవడానికి ఢిల్లీ స్థాయిలో ఉద్యమం చేపట్టాలని, ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీని కలిసి పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు పెట్టిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ప్రముఖ సినీ నిర్మాత శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ కుల సంఘాలు, అఖిల పక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్ కృష్ణయ్య, మధుసూదనాచారి, సినీ నటుడు నారాయణమూర్తి తదితరులు

స్థానిక సంస్థల్లో బీసీలకు 42% ఇవ్వకపోతే అగ్నిగుండమే:ఆర్ కృష్ణయ్య

ఖైరతాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 శాతానికి కుదిస్తూ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకాలో తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ, ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాలు, బీసీ అఖిలపక్ష నేతలు, ఉద్యోగ సంఘాల నేతలతో భవిష్యత్ కార్యాచరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని, చట్టబద్ధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, పార్టీ పరంగా ఇస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ఇండియా కూటమికి పార్లమెంటులో 240 మంది ఎంపీలున్నారని, ఒక్క రోజైనా వారు ఈ విషయంపై సభలో ప్రశ్నించలేదన్నారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రభుత్వం బీసీలకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయంపై గుణపాఠం నేర్పాల్సిందేనన్నారు. సినీనటుడు ఆర్ నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం పేరున్న న్యాయవాదులను నియమించి కేసు గెలిచేలా కృషి చేయాలన్నారు. 130 బీసీ కుల సంఘాలు, 45 బీసీ సంఘాల ప్రతినిధులతో పాటు ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్న రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు.

రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి:పొన్నం

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా తగ్గించి, మరణాల రేటును నియంత్రించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో శుక్రవారం రవాణా శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.."రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన 33 జిల్లా స్థాయి, మూడు రాష్ట్ర స్థాయి బృందాలు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచే తనిఖీలు చేపట్టాలి. మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ అధిక లోడుతో వాహనాలు తిరగకుండా నియంత్రించాలి. ఒకసారి అధిక లోడుతో సీజ్ చేసిన వాహనం రెండోసారి పట్టుబడితే పర్మిట్లు, డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయాలి. రవాణా శాఖలో పెండింగ్‌లో ఉన్న ఖాళీలు భర్తీ చేయడంతో పాటు పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి"అని మంత్రి అధికారులను ఆదేశించారు. గత 10 రోజుల్లో రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 4,748 కేసులు నమోదుచేసి, 3,240 వాహనాలు సీజ్ చేసినట్లు అధికారులు పొన్నం ప్రభాకర్‌కు వివరించారు.

15-18 ఏళ్ల యువతులతో ప్రత్యేక ఎస్‌హెచ్‌జీలు

» కోటిమందికి సభ్యత్వ కల్పనే లక్ష్యం: జి.చిన్నారెడ్డి

రాష్ట్రంలో 4.30 లక్షల స్వయం సహాయక బృందాలు(ఎస్‌హెచ్‌జీ) ఉన్నాయని, వాటిలో 65 లక్షలమంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, ఈ సంఖ్యను కోటికి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో స్వయం సహాయక బృందాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్) జాతీయ స్థాయి సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళల ఆర్థిక బలోపేతానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని చిన్నారెడ్డి చెప్పారు. వారికి ఆర్థిక స్వేచ్ఛ ఉంటే అన్ని రంగాల్లో రాణిస్తారని, నిధుల నిర్వహణలో ఎవరూ సాటిరారని అన్నారు. రాష్ట్రంలో 15-18 ఏళ్ల యువతులతో ప్రత్యేక స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా దీన్ని వరంగల్, గద్వాల జిల్లాల్లో అమలు చేయనున్నామన్నారు.

కమలాపూర్ ఎస్‌హెచ్‌జీకి జాతీయ అవార్డు

హనుమకొండ జిల్లా కమలాపూర్ సాయి కృప మండల్ మహిళా సంఘానికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. దీని కింద రూ.లక్ష నగదు పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. జాతీయ స్థాయిలో ద్వితీయ, తృతీయ పురస్కారాలు ఝార్ఖండ్ రాష్ట్రం చాత్రా జిల్లా సిమర్ల, ఇట్‌ఖోరి మహిళా సంఘాలకు దక్కాయి.

నేటి నుంచి కామన్వెల్త్ ఏఐ గ్లోబల్ సమ్మిట్

బంజారాహిల్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ (సీఎంఎ), గ్లాస్గోలోని రాయల్ కాలేజీ ఆఫ్ ఫిజిషియన్స్ అండ్ సర్జన్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సంయుక్తాధ్వర్యంలో 22, 23 తేదీల్లో కామన్వెల్త్ ఏఐ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు కామన్వెల్త్ లండన్ కన్వీనర్ డాక్టర్ ప్రభుకుమార్, శ్రీలంక వైద్య శాఖ అధ్యక్షులు డాక్టర్ వజ్రదిశ నాయకే తెలిపారు. శుక్రవారం వారు సమ్మిట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 51లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ సమ్మిట్ జరుగుతుందని, దీనికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలను ఆహ్వానించినట్లు చెప్పారు.

సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు

» కలెక్టర్లకు డెడికేటెడ్ కమిషన్ నివేదిక

» రిజర్వేషన్ల ఖరారుకు నేడు మార్గదర్శకాలు

హైదరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం అంతా సిద్ధమవుతోంది. డెడికేటెడ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా మండలాల వారీగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి కసరత్తు వేగంగా సాగుతోంది. బీసీ రిజర్వేషన్లు 23శాతం చొప్పున ఉండేలా ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్ ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించగా, దాన్ని మంత్రులకు పంపి ఆమోదముద్ర పడేలా ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంది. ఆ తర్వాత ఆ కమిషన్ నివేదికను అందులో బీసీల రిజర్వేషన్‌లను ఏ జిల్లాలో, ఏ మండలంలో ఎంతచొప్పున ఖరారు చేశారన్న అంశాలను అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపించారు. కలెక్టర్లు దాన్ని పరిశీలించి మండలాలకు కూడా పంపించారు. దాని ప్రకారం మండల స్థాయిలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాలకు బీసీ రిజర్వేషన్లకు సంబంధించి మొత్తం కసరత్తు పూర్తయింది. ఇందులో డెడికేటెడ్ కమిషన్ చెప్పినదానికి, మండలాల స్థాయిలో అదే ప్రకారం సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాలకు బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ఎలాంటి ఇబ్బంది లేదని నిర్ధారించుకున్నారు. దీంతో శనివారం రాష్ట్రవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ల ఖరారు ఎలా చేయాలన్న దానిపై ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఇప్పటికే అనధికారికంగా మండల స్థాయిలో పూర్తిచేసిన బీసీ రిజర్వేషన్ల చార్ట్ సిద్ధంగా ఉండడంతో అధికారికంగా మార్గదర్శకాలు ఇచ్చిన వెంటనే మళ్లీ ఒకసారి వాటిని పరిశీలిస్తారు. ఆదివారం నాటికి ఆ జాబితాలను అధికారికంగా ఖరారు చేసి అన్ని జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి పంపిస్తారు. 24న(సోమవారం) హైకోర్టులో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కేసు ఉంది. ఆ కేసు సందర్భంగా ప్రభుత్వం తాము ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని చెప్తూ, తాము చేసిన కసరత్తు వివరాలను కూడా సమర్పించనుంది. అనంతరం 25వ తేదీన మంత్రివర్గ సమావేశం ఉంది. 26వ తేదీన గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూలు వెలువడే అవకాశాలున్నాయని సమాచారం. కాగా, ఇప్పుడు చేస్తున్న కసరత్తు అంతా బీసీల రిజర్వేషన్లకు సంబంధించే. రాష్ట్ర ప్రభుత్వం చేసిన బీసీ కులగణన ఆధారంగా డెడికేటెడ్ కమిషన్ గతంలో 42శాతానికి బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలని చెప్పింది. దాని ప్రకారమే ఈ సెప్టెంబరులో రిజర్వేషన్లను క్షేత్రస్థాయిలో ఖరారు చేశారు. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీలకు కూడా 2011జనాభా లెక్కల ఆధారంగా సర్పంచ్, వార్డుల్లో రిజర్వేషన్లు ఖాయం చేశారు. అయితే బీసీ రిజర్వేషన్లు 42శాతం అనేది అమలు సాధ్యం కానందున ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలో బీసీలకు 23శాతం చొప్పున సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నారు. మొత్తం మీద రిజర్వేషన్లు 50శాతం మించకుండా మాత్రం చూసుకుంటున్నారు.

5 లక్షల కోట్ల భూ కుంభకోణం!

(మొదటిపేజీ తరువాయి)



జరుగుతోందన్నారు. తద్వారా రేవంత్‌రెడ్డి అండ్ గ్యాంగ్ రూ.5 లక్షల కోట్ల భూ కుంభకోణానికి పాల్పడబోతోందని తెలిపారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హెచ్‌ఐఎల్‌టీపీ) ప్రజా ప్రయోజన పాలసీ కాదని, దేశంలోనే అతిపెద్ద భూ కుంభకోణమని ఆరోపించారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ ముసుగులో సీఎం రేవంత్ రెడ్డి తన అనుయాయులకు తక్కువ ధరకు కట్టబెట్టి.. భూ కుంభకోణానికి తెరలేపారన్నారు. బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, అజామాబాద్ సహా హైదరాబాద్‌లోని కీలకమైన పారిశ్రామిక క్లస్టర్లలో ఉన్న 9,292 ఎకరాల విలువైన భూమిని క్రమబద్ధీకరించడానికి ఈ పాలసీ ద్వారా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ భూముల మార్కెట్ విలువ ప్రస్తుతం ఎకరాకు రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఉందని, దీని మొత్తం విలువ రూ.4 లక్షల కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. కానీ, రేవంత్‌రెడ్డి సర్కారు ఈ భూములను ప్రభుత్వ విలువలో కేవలం 30 శాతానికే అప్పగించాలని చూస్తోందని ధ్వజమెత్తారు.

ఎవరికి లాభం చేకూర్చడానికి?

బీఆర్ఎస్ ప్రభుత్వం అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు ఎస్ఆర్‌వో రేట్ల కంటే 100 శాతం నుంచి 200 శాతం అధికంగా వసూలు చేసేలా చట్టం చేసిందని కేటీఆర్ తెలిపారు. మార్కెట్ ధరలు.. ఎస్ఆర్‌వో విలువ కంటే నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉన్నాయని, అలాంటిది కాంగ్రెస్ సర్కారు కనీసం ఎస్ఆర్‌వోను కూడా పూర్తిగా వసూలు చేయడం లేదని అన్నారు. ఎవరికి లాభం చేకూర్చడానికి ఈ పని చేస్తున్నారని ప్రశ్నించారు. హెచ్‌ఐఎల్‌టీపీ పాలసీని ప్రభుత్వం ఆమోదించే వేగం, ఏడు రోజుల్లో దరఖాస్తులు, ఏడు రోజుల్లో ఆమోదాలు, 45 రోజుల్లో పూర్తి క్రమబద్ధీకరణ చేయాలని చెప్పడంపై అనుమానం కలుగుతోందన్నారు. లక్షల కోట్ల విలువైన భూముల అంశంలో ఎందుకీ తొందర? ఎందుకీ వేగవంతమైన ప్రక్రియ? అని నిలదీశారు. "ముంబై లాంటి మెట్రో నగరాల్లో ప్రభుత్వాలు ఇలాంటి భూములను వేలం వేసి.. ప్రజల ఆస్తిని ప్రభుత్వ ఖజానాకు చేరుస్తుంటే.. ఇక్కడ మాత్రం అప్పనంగా ప్రైవేట్ వ్యక్తుల లబ్ధి కోసం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఈ అంశంపై బీజేపీ నేతలు స్పందించాలి. కాంగ్రెస్, బీజేపీ మధ్య అక్రమ రాజకీయ సంబంధం లేకుంటే రూ.5 లక్షల కోట్ల భూ కుంభకోణానికి జరుగుతున్న ప్రయత్నాన్ని అడ్డుకోవాలి" అని కేటీఆర్ అన్నారు.

ఇప్పటికే సీఎం సోదరుల ఒప్పందాలు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర పాలన కంటే తానొక ఏజెంటులాగా రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని కేటీఆర్ అన్నారు. సీఎం చుట్టూ భూ డీలర్లు ఉన్నారని, సీఎం సోదరులు, సన్నిహితులు, మధ్యవర్తులు ఇప్పటికే ఈ భూముల కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఆరోపించారు. అందుకే పాలసీ అమలుకు తొందర పెడుతున్నారని చెప్పారు. పరిశ్రమలకు కేటాయించిన భూములు వినియోగంలో లేనప్పుడు.. అందులో కనీసం 50 శాతం భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, మిగతా భూములను మార్కెట్ విలువ ఆధారంగా ధర నిర్ణయించి క్రమబద్ధీకరించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, శ్మశాన వాటికలకు కూడా భూమి దొరకని నగరంలో.. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలనే ప్రయత్నాన్ని రేవంత్‌రెడ్డి మానుకోవాలని, కొత్తగా తెచ్చిన ఈ పాలసీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ భూములను ఎవరూ కొనవద్దన్నారు. "హెచ్‌ఐఎల్‌టీపీ కింద ఒప్పందాలు కుదుర్చుకునే వారిని ముందుగానే హెచ్చరిస్తున్నా. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. మీరు ఈ పాలసీ కింద భూమి కొనుగోలు చేస్తే నష్టపోతారు. పారిశ్రామికవేత్తలు, డెవలపర్లు భవిష్యత్తులో నష్టపోవాల్సివస్తుంది. మేం రాగానే ఆ భూమిని తిరిగి తీసుకుంటాం.. క్రమబద్ధీకరణను రద్దు చేస్తాం. దీనిపై పూర్తివిచారణ జరిపి కుంభకోణంలో ఉన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటాం. ఎవరినీ వదిలిపెట్టం" అని కేటీఆర్ హెచ్చరించారు.

ఈ-కార్ రేసు కేసులో ఏమీ లేదని రేవంత్‌రెడ్డికీ తెలుసు..

ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో ఏమీ లేదని కేటీఆర్ అన్నారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తెలుసునన్నారు. తన అరెస్టు జరగదని, అరెస్టు చేసే ధైర్యం రేవంత్‌కు లేదని చెప్పారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, చేసుకుపోనివ్వాలని వ్యాఖ్యానించారు. తాను ఏ తప్పూ చేయలేదని, ఈ విషయాన్ని ఎప్పటినుంచో చెబుతున్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వం నడుస్తోందని, దేశంలోనే ఇంత అక్రమ బంధం ఎక్కడా ఉండదని విమర్శించారు.

కడియంను కాపాడే ప్రయత్నం జరుగుతోంది

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో విచిత్ర రాజకీయాలు చేస్తోందని కేటీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిని సాంకేతికంగా సాకులు చూపించి కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. మరో ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో రాజీనామా చేయించి.. ఆయనకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ గుర్తుపై సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి దొరికిపోయిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడితే పరువు పోతుందని రాజీనామా చేసినట్లు చూపుతున్నారని విమర్శించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక కంటే ముందే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

భూమేతగా.. భూ భారతి

» అవినీతి, అక్రమాలు, వసూళ్లకు వాడుతున్నారు

» రేవంత్.. భూ సమస్యల పరిష్కారం ఏమైంది?: మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు తెచ్చిన భూ భారతి.. భూ హారతిగా మారిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. అవినీతి, అక్రమాలు, అడ్డగోలు వసూళ్లతో దాన్ని భూమేతకు వాడుకుంటున్నారని ఆరోపించారు. 30-40 శాతం లంచాలు ఇస్తే తప్ప రేవంత్‌రెడ్డి పాలనలో భూ సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. రిజిస్ట్రేషన్ల పేరిట మధ్యవర్తులు, ఏజెంట్లు, కాంగ్రెస్ నాయకులు.. రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వస్తే 3 నెలల్లో భూ సమస్యలు పరిష్కరిస్తామన్న హామీ ఏమైందని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ధరణిపై అడ్డగోలుగా మాట్లాడిన సీఎం.. గొప్పగా తెచ్చిన భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కరించడంలో ఎందుకు విఫలమవుతున్నారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన రెవెన్యూ సంస్కరణలు చెత్తగా ఉన్నాయని.. కాంగ్రెస్ నాయకులు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు భూ భారతి.. మంగళ హారతి అయిందని విమర్శించారు. ఆపదకో, అవసరానికో ఉన్న భూములు అమ్ముకోలేక.. అధిక వడ్డీకి రుణాలు తీసుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న భూ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతు ఆత్మహత్యలు చేసుకోకుండా నివారించాలని హరీశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల తండ్రిని కోల్పోయిన హరీశ్‌రావును పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఏపీ మాజీ మంత్రి రఘువీరారెడ్డి పరామర్శించారు.

ఫార్ములా- ఈ రేసు కేసు తప్పు దారి పట్టించడానికే..

» సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఆరోపణలు: కాంగ్రెస్ నేతల ధ్వజం

» కేసీఆర్‌లా సొంత వారికి సీఎం రేవంత్ పదవులిచ్చారా: చామల

» మతి తప్పి పులికేశిలా: బల్మూరి

» తెలంగాణను సొంత ఎస్టేట్‌లా భావిస్తున్న కేటీఆర్: చనగాని

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ నేతలు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ కుటుంబాన్ని బ్లేమ్ చేయడం తప్ప ఆయనకు మరో పనేమీ లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ మాదిరిగా సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులకేమైనా పదవులిచ్చారా? అని శుక్రవారం ఓ ప్రకటనలో కేటీఆర్‌ను నిలదీశారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడేమీ చేయకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధికి సహకరించక పోగా వ్యాపారవేత్తలను బెదిరించడమేమిటని, వ్యవస్థ ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు ఓడించినా ఆయనకు బుద్ధి రాలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. ఫార్ములా- ఈ రేసు కేసుపై సమాధానమివ్వలేక.. ఆ కేసును తప్పు దారి పట్టించడానికే సీఎం రేవంత్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కేసుపై ఏసీబీ అధికారులు ప్రశ్నించినప్పుడు ఒక మాట, బయటొక మాట మాట్లాడటాన్ని ప్రజలు గమనిస్తున్నారన్న బల్మూరి.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితంతో మతి తప్పిన కేటీఆర్.. పులికేశిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఫార్ములా-ఈ రేసు కేసు విచారణను ఎదుర్కొనేందుకు కేటీఆర్ భయ పడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణను సొంత ఎస్టేట్‌లా భావిస్తున్న కేటీఆర్.. ఇకనైనా అది మానుకుని హుందాతనంతో వ్యవహరించాలని హితవు చెప్పారు. బీఆర్ఎస్‌లో కేటీఆర్, హరీశ్‌రావు ఆధిపత్య పోరు నడుస్తోందని, బల ప్రదర్శనలో ఇద్దరూ పోటీ పడుతున్నారని అన్నారు.

సర్కారుపై కేటీఆర్ దుష్ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)



దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలకు లీజుకిచ్చిన భూములపై బీఆర్ఎస్ ప్రభుత్వమే యాజమాన్య హక్కులు కల్పించిందని, ఇందుకు సంబంధించి 2023లో ఎన్నికలకు నాలుగు నెలల ముందు 'ఫ్రీహోల్డ్ రైట్స్' పేరిట మూడు జీవోలు జారీ చేసిందని తెలిపారు. అప్పుడు ఎన్ని లక్షల కోట్లు వసూలు చేసుకున్నారో కేటీఆర్ చెప్పాలన్నారు. ఆ జీవోల విషయం దాచిపెట్టి ప్రభుత్వంపై నిరాధార నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్ చెబుతున్న 9,292 ఎకరాల భూమిలో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసి కేటాయించింది 4,740 ఎకరాలేనని, మిగిలిన భూమిని రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించామని తెలిపారు. ఈ కేటాయింపులు ఒక్కరోజులో చేసినవి కాదని, పరిశ్రమల అభివృద్ధి కోసం దశాబ్దాలుగా ఇస్తూ వచ్చినవని వెల్లడించారు. అందులో భాగంగా అజామాబాద్, కూకట్‌పల్లి, హఫీజ్‌పేటల్లోని పరిశ్రమల భూములకు ఫ్రీ హోల్డ్ పేరిట యాజమాన్య హక్కులు కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఇందుకు సంబంధించి ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్టుమెంట్ 2023 ఆగస్టులో జీవో నెం.19, 20, 21లను జారీ చేసిందని తెలిపారు. ఇప్పుడు ఆ భూములకే తాము కన్వర్షన్ అవకాశం కల్పిస్తున్నామని, 30 శాతం, 50 శాతం స్లాబులతో ఇంపాక్టు ఫీజు నిర్ణయిస్తూ ఈ నెల 17న జరిగిన క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

జూబ్లీహిల్స్ ఓటమితో పగలే చుక్కలు..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ఓటమితో కేటీఆర్‌కు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. వారి పార్టీ ప్రసార సాధనాలు బీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలుస్తున్నట్లు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాయన్నారు. ఇప్పుడు వారి పత్రికలే లేని దానిని కుంభకోణంగా అభివర్ణిస్తే ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. ఏదైనా కుంభకోణం జరిగి ఉంటే బీఆర్ఎస్ హయాంలోనే జరిగి ఉండాలని వ్యాఖ్యానించారు. పరిశ్రమల యజమానులు హక్కుల పొందాలంటే రిజిస్ట్రేషన్ విలువపై 100 శాతం చెల్లించాలని, అవి చేతులు మారితే 200 శాతం కట్టాలంటూ జీవోలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ భూములు మరొకరి పరమైతే హక్కులు ఎలా కల్పిస్తారో వారికే తెలియాలని అన్నారు. వారిచ్చిన యాజమాన్య హక్కులు ఉన్నవారికి భూ వినియోగ మార్పిడి చేసుకునే అవకాశం మాత్రమే తాము కల్పించామని వెల్లడించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పరిశ్రమల కమిషనర్లు పరిశ్రమల సంఘాలతో పలు దఫాలుగా చర్చలు జరిపి 30 శాతం, 50 శాతం స్లాబులను ప్రతిపాదించారని తెలిపారు. కన్వర్షన్ ఇంపాక్టు చార్జీల ద్వారా ప్రభుత్వానికి రూ.4 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్నామన్నారు. అది కూడా అందరూ దరఖాస్తు చేసుకుంటేనే అని చెప్పారు. యాజమాన్య హక్కులు లేనివారు కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకోలేరని పేర్కొన్నారు.

సీఎం సోదరులపై అభూత కల్పనలు..

సీఎం సోదరులు అగ్రిమెంట్లు చేసుకున్నారంటూ కేటీఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు తప్పుబట్టారు. వారెవరూ ప్రభుత్వంలో లేరని, పదేళ్లు మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా అభూత కల్పనలు ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. ఆధారాలేవైనా బయటపెడితే ప్రభుత్వం ఏమి చేయాలో అది చేస్తుందని తెలిపారు. కేటీఆర్ ఆలోచనల్లో ఇప్పటికైనా మార్పు రావాలని కోరుకుంటున్నామన్నారు. బీఆర్ఎస్ ఆర్థిక అరాచకత్వానికి పాల్పడి వెళ్లిపోతే.. తాము రెండేళ్లుగా దానిని సరిదిద్దుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తుంటే.. దానికి ఎలా గండికొట్టాలా అని చూడటమే బీఆర్ఎస్ ప్రధాన లక్ష్యంగా మారిందని విమర్శించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం పాటుపడుతోందని చెప్పారు. ప్రతిపక్షంగా సహకరించకపోయినా ఫర్వాలేదు కానీ.. అబద్ధాలతో రాష్ట్ర ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నాలు, బెదిరింపు ధోరణులు మానుకోవాలని హితవు పలికారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలను వెలుపలకు తరలిస్తామని తాము మొదటి నుంచీ చెబుతున్నామని, గాలి కాలుష్యం, నీటి కాలుష్యం లేకుండా చేయడానికి పరిశ్రమలను బయటకు తరలిస్తున్నామని అన్నారు. పరిశ్రమలను ఆకర్షించడానికి కొన్ని రాష్ట్రాలు ఎకరం భూమిని 99 పైసలకే కేటాయించడం చూస్తున్నామని మంత్రి వ్యాఖ్యానించారు. విద్యుత్తు, పన్ను రాయితీలను 20 ఏళ్ల పాటు ఇస్తున్నారని తెలిపారు. మన దగ్గర భూముల విలువ ఎక్కువ, లభ్యత కూడా తక్కువ అని, అయినా పరిశ్రమలకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ ఉండాలని అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పరిశ్రమలు, ఐటీ కంపెనీలు వస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, రాష్ట్రం కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

సర్కారు బడులపై సోలార్ రూఫ్‌టాప్

» 289.25 కోట్లు అవుతాయని అంచనా

» టెండర్ల పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి కమిటీ

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 9,937 పాఠశాలలపై సోలార్ రూఫ్‌టాప్‌లను పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని విద్యా సంస్థలకు కొన్ని నెలలుగా ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందిస్తోంది. అయితే ప్రభుత్వ పాఠశాలల పైకప్పులపై సోలార్ రూఫ్‌టాప్ పెడితే.. వినియోగించుకున్న తర్వాత మిగిలిన విద్యుత్‌ను డిస్కమ్‌లకు విక్రయించే అవకాశం ఉంటుంది. సోలార్ విద్యుత్ ఉత్పాదన ఉదయం 8:30 గంటల నుంచే ప్రారంభమై.. సాయంత్రం 6 గంటల దాకా జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల దాకా పనిచేస్తాయి. పాఠశాలలు పనిచేస్తున్నంతసేపు జరిగే విద్యుత్ ఉత్పత్తిని స్కూళ్లు వాడుకుని.. సాయంత్రం 4 గంటల తర్వాత జరిగే విద్యుత్‌ను డిస్కమ్‌లకు విక్రయించనున్నారు. పాఠశాలల్లో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో పాటు ఐదేళ్లపాటు సమగ్ర నిర్వహణ కాంట్రాక్టుకు కలిపి రూ.289.25 కోట్లు అవుతాయని అంచనా వేశారు. ఒక్కో పాఠశాలలో వినియోగం ఆధారంగా కిలో వాట్, రెండు కిలోవాట్లు, గరిష్ఠంగా ఐదు కిలోవాట్ల దాకా ప్లాంట్ పెట్టే అవకాశాలున్నాయి. ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేయడానికి వీలుగా టెండర్ డాక్యుమెంట్ ఖరారు చేయడం, బిడ్ ప్రక్రియను పరిశీలించడం, టెండర్ దక్కించుకున్న సంస్థ లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేయడం వంటి పనుల కోసం ప్రభుత్వం రాష్ట్ర స్థాయి కమిటీని వేసింది. ఈ కమిటీకి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా ఉండగా.. ఇంధన శాఖలో డిప్యూటీ కార్యదర్శి స్థాయి అధికారి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ, సమగ్ర శిక్ష రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు డైరెక్టర్లు సభ్యులుగా.. తెలంగాణ రెడ్‌కో వీసీఎండీ మెంబర్ కన్వీనర్‌గా ఉండనున్నారు. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం జీవో 52ను జారీ చేశారు.





ఖమ్మం జిల్లా వీ వెంకటాయపాలెంలో విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఏకగ్రీవం అయిన పంచాయతీలకు 10 లక్షల చొప్పున ప్రోత్సాహకం

- ఏకగ్రీవ ఎన్నికల ద్వారా పల్లెల అభివృద్ధి
- ఏడాదిన్నరలో చేనేత రంగానికి వెయ్యి కోట్లు: తుమ్మల

రఘునాథపాలెం/హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): "రానున్న గ్రామ పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం ద్వారా పల్లెలు సజావుగా అభివృద్ధి చెందుతాయి. ఏకగ్రీవం అయిన గ్రామ పంచాయతీలకు రూ.10లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుంది" అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెంలో 33కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌లోని చేనేత భవన్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) ప్రయోగశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి వెయ్యి కోట్లు కేటాయించిందని తెలిపారు. కోటి మంది మహిళలకు ఇందిరా మహిళాశక్తి చీరెలు పంపిణీ చేయటంతో చేనేత రంగానికి చేయూత లభించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వెంకటగిరిలో మాత్రమే ఐఐహెచ్‌టీ ఉండేదని, సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి ఒప్పించి ఐఐహెచ్‌టీని తెలంగాణకు మంజూరు చేయించారని తెలిపారు. దీనికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టినట్లు చెప్పారు.

రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కండి

- పెట్టుబడులకు కేంద్రంగా ఫ్యూచర్ సిటీ: భట్టివిక్రమార్క



హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలో కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో శుక్రవారం కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'మీ అందరి సహకారంతో 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యం సాధించాల్సి ఉంది' అని పేర్కొన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం ఆర్థిక పరిపుష్టి, సానుకూల వాతావరణం, నిపుణులైన మానవ వనరులతో తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామమన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 లక్షల కోట్ల డాలర్లకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో తమ సర్కారు పని చేస్తోందని చెప్పారు. డెల్లాయిట్, ఈవై, కేపీఎంజీ, బీసీజీ, పీడబ్ల్యూసీ, జెఎల్ఎల్ తదితర సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశంలోని అత్యుత్తమ పోలీసు వ్యవస్థల్లో తెలంగాణ పోలీసు ఒకటని, శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉంటాయని ఆయన తెలిపారు.

మత్స్యకారుల జీవితాల్లో మార్పుకోసం కృషి చేస్తా

- వారిని బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చేందుకు ప్రయత్నిస్తా
- పశు సంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



కొల్లాపూర్/హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న మత్స్యకారుల జీవితాల్లో మార్పు కోసం కృషి చేస్తానని, వారిని బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ లోకి మార్చే ప్రయత్నం చేస్తానని పశు సంవర్థక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు. ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజధానిలో 5 కోట్ల రూపాయలతో 5 ఎకరాల్లో ముదిరాజ్ భవనం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. మత్స్యకారుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. మత్స్యకారులు అందరికీ పౌష్టికాహారం అందిస్తారని, కానీ వారు మాత్రం ఆకలితో ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ఉన్న మత్స్య కార్మికులకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.

700 కోట్ల విలువైన స్థలాన్ని కాపాడిన హైడ్రా

హైదరాబాద్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ కొండాపూర్‌లో సుమారు రూ.700కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నాలుగెకరాల స్థలం కబ్జాకు గురైనట్లు గుర్తించింది. శ్రీ వెంకటేశ్వర హెచ్‌ఏఎల్ కాలనీలో ఉన్న స్థలాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. కొండాపూర్‌లోని 57.20 ఎకరాల స్థలంలో అభివృద్ధి చేసిన లే అవుట్‌లో.. 1.20 ఎకరాల చొప్పున రెండు ప్రాంతాల్లో, మరో చోట 2 ఎకరాల స్థలాన్ని పార్కుల కోసం, 1000 చదరపు గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. అయితే ఈ స్థలాలు ఖాళీగా ఉండడంతో కొందరు కబ్జాదారులు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించినట్లు హైడ్రా గుర్తించింది. ఈ నాలుగెకరాల స్థలాన్ని బై నెంబర్ల ద్వారా మూడు భాగాలు చేసి.. 11 ప్లాట్లుగా విభజించి ప్రవాసీలకు అమ్మినట్లు నిర్ధారించింది. వీరి నుంచి కొన్ని ప్రైవేటు నిర్మాణ సంస్థలు ఆ ప్లాట్లు కొనుగోలు చేసి బౌన్సర్లను ఏర్పాటు చేశారు. దీంతో పార్కు స్థలాల వైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న కాలనీ వాసులు.. హైకోర్టులో పిటిషన్ వేయడంతో పాటు హైడ్రా, ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేయడంతో అధికారులు రంగంలోకి దిగారు.

పెండింగ్ బిల్లుల కోసం 480 కోట్లు విడుదల

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పలు పెండింగ్ బిల్లులకు సంబంధించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు, రాష్ట్ర ఆర్థిక శాఖ శుక్రవారం రూ.480 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తంలో సన్నధాన్యం బోనస్ బిల్లులకు రూ.200 కోట్లు, ఎల్పీజీ మహాలక్ష్మి పథకానికి సంబంధించి రూ.60 కోట్లు, మైనారిటీ సంక్షేమ శాఖకు సంబంధించిన బిల్లుల కోసం రూ.220 కోట్లు కేటాయించారు. డిప్యూటీ సీఎం కార్యాలయం ఈ విషయాన్ని ప్రకటించినప్పటికీ, దీనికి సంబంధించిన జీవోను మాత్రం ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదు.

టెక్నాలజీతో రైతుల ఆదాయం రెట్టింపు

- పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే శక్తి టెక్నాలజీకి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, పర్యాటక శాఖల ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. మొక్కజొన్న, వరి, పత్తి పంటల సాగు దశల్లో ఉపయోగించటానికి వీలుగా 80కి పైగా టెక్నాలజీలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గుర్తించిందని తెలిపారు. వీటిని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధన క్షేత్రాల్లో పరీక్షిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో నాబార్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎర్త్ సమ్మిట్-2025 ముగింపు సదస్సులో జయేశ్ రంజన్ మాట్లాడారు. వ్యవసాయ సాంకేతిక రంగంలో పెద్దఎత్తున నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాగా డిసెంబరు 9న విడుదలయ్యే తెలంగాణ రైజింగ్ విజన్-2047 పత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.

యుద్ధప్రాతిపదికన చేవెళ్ల, మన్నెగూడ రహదారి విస్తరణ

- పనులు సకాలంలో పూర్తవ్వాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- మర్రిచెట్ల కేసు ఉపసంహరించుకున్న పర్యావరణవేత్తలకు సన్మానం
- 954 మర్రిచెట్ల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని సీఎం హామీ



సేవ్ బనియన్స్ ప్రతినిధులు రూపొందించిన టీషర్టును ఆవిష్కరిస్తున్న సీఎం

చేవెళ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పోలీసు అకాడమీ నుంచి చేవెళ్ల, మన్నెగూడ వరకు రహదారి విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చెయ్యాలని సూచించారు. ఈ హైవే విస్తరణలో భాగంగా 954మర్రిచెట్లను తొలగించకుండా సంరక్షించాలని కోరు తూ 'సేవ్ బనియన్స్' సంస్థ గతంలో గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసి ఇటీవల ఉపసంహరించుకుంది. ఈ నేపథ్యంలో సేవ్ బనియన్స్ ప్రతినిధులు బలంత్రాపు తేజ, పలువురు పర్యావరణవేత్తలు.. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. కేసు ఉపసంహరించుకున్న పర్యావరణవేత్తలను సీఎం ఈ సందర్భంగా సత్కరించారు. సేవ్ బనియన్స్ సంస్థ పర్యావరణ వేత్తలు తయారు చేసిన టీషర్టును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 954 మర్రిచెట్లను సంరక్షించే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. చెట్లకు నష్టం జరగకుండా చూస్తామని, పర్యావరణవేత్తలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రహదారి పనుల్లో జాప్యం జరిగి, ఆ రోడ్డు ప్రాణాంతకంగా మారిందని, ఆ మార్గంలో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదం అందరినీ కలిచివేసిందని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎన్‌హెచ్‌ఏ అధికారులు పాల్గొన్నారు.

రాజీనామా బాటలో దానం?





రాజుయాదవ్‌కు కాంగ్రెస్ టికెట్ కేటాయించాలంటూ ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ; రప్పా రప్పా అంటూ సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పోస్టు

(మొదటిపేజీ తరువాయి)

అనర్హత వేటు వేయాలంటూ కేటీఆర్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. గురువారం నాటికి దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల పిటిషన్లపై విచారణను పూర్తి చేశారు. అనర్హత పిటిషన్లపై ఈ నెల 23కల్లా వివరణ ఇవ్వాల్సిందిగా గురువారం దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అయితే, నోటీసులు అందుకున్న రోజే దానం కాంగ్రెస్ పెద్దలను కలిసేందుకు ఢిల్లీ వెళ్లారు. ఫిరాయింపు పిటిషన్లపై విచారణ దాకా వెళ్లకుండా, రాజీనామా చేయడమే మేలన్న భావనలో ఉన్న ఆయన.. అధిష్ఠానం అనుమతి కోసమే ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం.

అక్కడి దాకా వెళ్తే వేటే..!

విచారణ పూర్తయిన 8 మంది ఎమ్మెల్యేలతో పాటు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకూ స్పీకర్ నోటీసులు ఇచ్చినా.. వివరణ ఇచ్చేందుకు వారు గడువు అడిగి తీసుకున్నారు. నాలుగు వారాల్లో అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తి చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించడంతో పిటిషన్లపై ఈ నెల 23కల్లా వివరణ ఇవ్వాలంటూ దానం, కడియంకు స్పీకర్ మళ్లీ నోటీసులు జారీ చేశారు. అయితే బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం.. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయన పార్టీ మారినట్లుగా స్పష్టమైన ఆధారం ఉన్నట్లయింది. తనపై విచారణ కొనసాగితే అనర్హత వేటు పడే అవకాశం ఉందని, అంతవరకూ వెళ్లకుండా తన పదవికి రాజీనామా చేయాలని దానం భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన పలు ప్రతిపాదనలతో ఢిల్లీ వెళ్లారని అంటున్నాయి. ఏప్రిల్‌లో ఖాళీ కానున్న రాజ్యసభ సీటును తనకు కేటాయించడం లేదా ఎమ్మెల్సీని చేసి మంత్రివర్గంలో చోటు కల్పించడం లేదా క్యాబినెట్ హోదాలో నామినేటెడ్ పదవి ఇవ్వడం వంటి ప్రతిపాదనలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని, గెలిచాక మంత్రివర్గంలో చోటు కల్పించాలన్న ప్రతిపాదన కూడా ఉన్నట్లు చెబుతున్నారు. గతంలో కాంగ్రెస్‌లోనే మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న దానం.. తనకున్న పాత పరిచయాలతో అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారని అంటున్నారు. అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే దానం తన పదవికి రాజీనామా చేస్తారని పేర్కొంటున్నారు. వెంటనే అనుమతి వస్తే.. ఒకటి, రెండు రోజుల్లోనే రాజీనామా చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఒకవేళ అధిష్ఠానం సమయం తీసుకుంటే.. దానం స్పీకర్‌ను కలిసి వివరణ ఇచ్చేందుకు మరికొంత గడువు కోరే అవకాశం ఉందని చెబుతున్నారు.

కడియం పరిస్థితి ఏంటి..?

కడియం శ్రీహరి విషయంలోనూ కాంగ్రెస్ నేతలు సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన కడియం శ్రీహరి.. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన తన కూతురు కావ్యకు మద్దతుగా ప్రచారం చేశారు. కావ్య నామినేషన్ పత్రాల్లో ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ సంతకం కూడా చేసినట్లు సమాచారం. కడియంపై అనర్హత పిటిషన్‌లో ఇది బలమైన ఆధారంగా మారనున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నోటీసులకు వివరణ ఇచ్చి, విచారణలో పాల్గొనడమా? లేక ఆయనతో కూడా రాజీనామా చేయించి ఉప ఎన్నికలను ఎదుర్కొనడమా? అన్న దానిపై కాంగ్రెస్ వర్గాలు తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. కడియం కూడా రాజీనామా చేయక తప్పదన్న ప్రచారం జరుగుతోంది.

స్పీకర్‌ను సమయం కోరిన కడియం

అనర్హత పిటిషన్‌పై వివరణ ఇచ్చేందుకు మరికొంత గడువు కావాలని కడియం శ్రీహరి స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. స్పీకర్‌ను శుక్రవారం ఆయన నివాసంలో కలిసిన కడియం శ్రీహరి.. అఫిడవిట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకోవాల్సి ఉందని, వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. తన వినతి పట్ల స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు కడియం తెలిపారు.

ఖైరతాబాద్‌లో అప్పుడే ప్రచారం!

- ఉప ఎన్నికలు వస్తాయనే ఊహాగానాలు
- తనకే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలంటూ రాజుయాదవ్ ఫ్లెక్సీల ఏర్పాటు
- రప్పా రప్పా అంటూ బీఆర్ఎస్ పోస్టు

బంజారాహిల్స్ నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక హడావుడి ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతుండగా ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పొలిటికల్ జోష్ మొదలైంది. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయనే ఊహాగానాలు వినిపిస్తుండటంతో ప్రచార యుద్ధం మొదలైంది. సోషల్ మీడియాలో పోస్టులు రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలిచిన దానం నాగేందర్.. ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వెళ్లారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు విషయంలో సుప్రీం కోర్టు సీరియస్ అవ్వడంతో అసెంబ్లీ స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితి ఎలా ఉన్నా.. దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ నుంచి పోటీ కారణంగా పార్టీ మారినట్టు స్పష్టం అవుతుండటం, దాంతో ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేస్తారని ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా ఖైరతాబాద్‌లో రాజకీయ సందడి నెలకొంది. మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు రాజు యాదవ్ ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక వస్తే 30 ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్న తనకు కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని కోరుతూ ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌తో పాటు పలు కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మరికొందరు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి టికెట్ ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. ఇక బీఆర్ఎస్ రప్పా రప్పా అంటూ సోషల్ మీడియాలో పోస్టులకు తెరతీసింది. ఉప ఎన్నికలకు తాము సిద్ధమనే సంకేతాలతో కూడిన పోస్టింగ్‌లు చేస్తుండటం చర్చనీయాంశంగా మారాయి.

ఆట మధ్యలో రూల్స్ మార్చడం కుదరదు

- పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటాలో 85% తెలంగాణ స్థానికులకు ఇవ్వాలని సవరణ తెచ్చిన ప్రభుత్వం
- సదరు సవరణ ఈ ఏడాదికి వర్తించదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీజీ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ మొదలైన తర్వాత మధ్యలో నిబంధనలు మార్చడం సరికాదని హైకోర్టు పేర్కొంది. ఆట మొదలయ్యాక మధ్యలో రూల్స్ మార్చడం కుదరదు అని స్పష్టం చేసింది. ప్రైవేటు, అన్‌ఎయిడెడ్, మైనారిటీ, నాన్‌మైనారిటీ, పీజీ మెడికల్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటాలోని సబ్ కేటగిరి-1లో 85% సీట్లు తెలంగాణ స్థానికులకు ఇవ్వాలని ఈనెల 3న ఇప్పటికే ఉన్న రూల్స్‌కు సవరణ చేస్తూ సర్కారు జీవో జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ అన్‌ఎయిడెడ్, నాన్ మైనారిటీ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (రెగ్యులేషన్ ఆఫ్ అడ్మిషన్స్ ఇన్‌టు పోస్ట్ గ్రాడ్యుయేషన్ మెడికల్ అండ్ డెంటల్ ప్రొఫెషనల్ కోర్సెస్) రూల్స్ - 2017కు తాజా జీవో 200 ద్వారా సవరణ చేసింది.

కాగా పీజీ మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ గత నెల 4వ తేదీనే ప్రారంభమైందని.. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఈనెల 3న ఇప్పటికే ఉన్న రూల్స్‌కు సవరణ చేస్తూ జీవో జారీచేయడం చెల్లదని పేర్కొంటూ ఇతర రాష్ట్రాలకు చెందిన పీజీ మెడికల్ అభ్యర్థులు స్వరూప్ మరికొంతమంది హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రాథమికంగా పరిశీలిస్తే అడ్మిషన్ల ప్రక్రియ మొదలైన తర్వాత సవరణ జీవో తెచ్చారని పేర్కొంది. మధ్యలో రూల్స్ మార్చడం చెల్లదు కాబట్టి.. ప్రస్తుతం కొనసాగుతున్న 2025-26 విద్యాసంవత్సరానికి సవరణ జీవో 200 వర్తించదని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ హెల్త్ వర్సిటీకి నోటీసులు జారీచేసింది. ధర్మాసనం తదుపరి విచారణను జనవరి 19కి వాయిదా వేసింది.

ఓయూ రిజిస్ట్రార్ హాజరుకు కోర్టు ఆదేశాలు

హైదరాబాద్ నల్లకుంటలోని హిందీ మహావిద్యాలయ కళాశాలను అటానమస్ కాలేజీల జాబితాలో చేర్చి.. పీజీ, యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతించాలని పేర్కొంటూ హైకోర్టు గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను అమలు చేయలేదని.. తమ కాలేజీని అటానమస్ జాబితాలో చేర్చలేదని పేర్కొంటూ హిందీ మహావిద్యాలయ సంస్థ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని పేర్కొంటూ ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ గడ్డం నరేశ్‌రెడ్డికి ఫారం-1 నోటీసు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

టీశాక్‌లో కలెక్షన్ కింగ్!



(మొదటిపేజీ తరువాయి)

వర్గాలు వెల్లడించాయి. సదరు అధికారి ఎన్జీవోల నుంచి వసూళ్ల చేసే పనిని ఓ కాంట్రాక్టు ఉద్యోగికి అప్పగించగా చేతివాటం ప్రదర్శించాడు. దీంతో సదరు ఉన్నతాధికారి కాంట్రాక్టు ఉద్యోగిని పెద్దపోస్టు నుంచి తప్పించి పనిలేని విభాగానికి బదిలీ చేశారు. ఈ బదిలీ వల్ల వసూళ్ల విషయం బయటికొచ్చింది.

న్యాకో నిధుల్లో వాటాలు

హెచ్ఐవీ వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ శాక్స్ ఏర్పాటైంది. రాష్ట్ర విభజన తర్వాత టీశాక్‌గా మారింది. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ కార్యక్రమాల అమలులో ఎన్జీవోల భాగస్వామ్యం కీలకం. అర్హత ఉన్న ఎన్జీవోలను ఎంపిక చేసి వాటితో ఎంఓయూ చేసుకుని టీశాక్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంది. హెచ్ఐవీకి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనే ఎన్జీవోలు రాష్ట్రంలో 63 ఉన్నాయి. ఫీమేల్ సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, డ్రగ్స్ ఇంజక్షన్స్ ద్వారా వ్యాప్తి చేసేవారు, హిజ్రాలు-ట్రాన్స్ జెండర్స్ ట్రక్ డ్రైవర్లు, వలస కార్మికులు.. ఈ ఆరు విభాగాల్లో ఒక దానిని ఎంపిక చేసుకొని ఎన్జీవోలు పని చేస్తుంటాయి. కొన్ని సంస్థలు కేవలం మహిళా సెక్స్ వర్కర్లపై, మరికొన్ని గే(మెన్‌టూమెన్ సెక్స్)ల కోసం, ఇంకొన్ని అన్ని రకాల వారి కోసం సేవలందిస్తుంటాయి. హెచ్ఐవీపై అవగాహన కల్పించడం, కండోమ్స్ వాడకం, ప్రతీ 3 నెలలకోసారి ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు చేయించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్సకు మద్దతివ్వడం వంటి కార్యక్రమాలను ఎన్జీవోలు చేపడతాయి. ఎన్జీవోలకు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రతీ ఏటా లక్ష్యం నిర్దేశిస్తుంది. ఆ లక్ష్యం (హెచ్ఐవీ రోగులు, ప్రభావితులు) ఆధారంగా టీశాక్ బడ్జెట్ కేటాయిస్తుంది. ఈ నిధులు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(న్యాకో) నుంచి శాక్స్‌కు వస్తాయి. లక్ష్యాన్ని బట్టి రాష్ట్రంలోని ఒక్కో సంస్థకు ప్రస్తుతం సగటున రూ.30 లక్షల నుంచి కోటిన్నర వరకు టీశాక్ బడ్జెట్ ఇస్తోంది. మూడు నెలలకు ఓసారి బడ్జెట్ విడుదల అవుతుంటుంది. ఎన్జీవోలకు చేరే ఈ నిధుల నుంచే టీశాక్ అధికారులు వాటాలు తీసుకుంటున్నారు.

10 శాతం కమీషన్

టీశాక్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి ఏటా ఒక్కో ఎన్జీవోకు కేటాయించే బడ్జెట్ నుంచి 10% మొత్తాన్ని నగదు రూపంలో కమీషన్‌గా ఇవ్వాలని హుకుం జారీ చేశారు. ఆ ఉన్నతాధికారి తరఫున హైదరాబాద్‌లోని టీశాక్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ హోదా కలిగిన ఓ కాంట్రాక్టు ఉద్యోగి వసూళ్లు చేసేవారు. నేరుగా తామే వెళ్లి వసూళ్లకు పాల్పడితే సమస్యలు వస్తాయని భావించి ఇందుకోసం ప్రైవేటు వ్యక్తులను కూడా రంగంలోకి దించారు. ఉదాహరణకు ఖమ్మం జిల్లాలో వసూళ్ల కోసం ఓ మహిళను పంపారని సమాచారం. అడిగినంత ఇవ్వకపోతే టీశాక్‌తో ఉన్న ఎంవోయూను రద్దు చేస్తామని బెదిరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఒక్కసారి ఒప్పందం రద్దు అయితే ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయి. దీంతో స్వచ్ఛంద సంస్థలు కూడా చేసేది లేక అడిగినంత ఇచ్చుకున్నట్లు సమాచారం. కొన్ని సంస్థలు 5% ముట్టజెప్పినట్టు తెలుస్తోంది. ఇలా, సగటున ఒక్కో సంస్థ నుంచి, వారి బడ్జెట్ ఆధారంగా రూ.3లక్షల నుంచి రూ.10లక్షల మధ్య వసూ లు చేసినట్లు చెబుతున్నారు. ఎన్జీవోల కోసం టీశాక్ బడ్జెట్‌లో రూ.39 కోట్లు కేటాయించగా.. 10% కమీషన్ కింద గత రెండు నెలల్లోనే మూడు కోట్ల వసూలు చేశారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కొన్ని ఎన్జీవోలు తమ ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్టే ఇచ్చి(బ్యాంకు ఖాతాల్లో జమ చేసి) వెంటనే నగదు రూపంలో వెనక్కు తీసుకుంటున్నాయి. స్వచ్ఛంద సంస్థల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న టీశాక్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎన్జీవోలు కోరుతున్నారు.

ఖమ్మం జిల్లా.. కమ్యూనిస్టుల ఖిల్లా

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ప్రజా పోరాటాలకు స్ఫూర్తి .. కమ్యూనిస్టుల ఐక్యతతోనే బీజేపీ ఆగడాలకు అడ్డుకట్ట

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- మావోల్లారా.. మాతృ సంస్థ సీపీఐలో సమీకృతం కండి:చాడ



కొత్తగూడెంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం టౌన్/ఇల్లెందు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల ఖిల్లా అని, కమ్యూనిస్టుల ఐక్యతతో మత ఛాందసవాదాన్ని నిలువరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సీపీఐ శతవసంత ఉత్సవాలను పురస్కరించుకుని 15న గద్వాల జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన ప్రచారయాత్ర శుక్రవారం రాత్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ (పోస్టాఫీస్ సెంటర్) కు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ శ్రేణులు విప్లవ గీతాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం కూనంనేని, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. దేశంలో నూరేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నుంచి అలుపెరగని పోరాటాల్లో కీలక పాత్ర పోషించిందని, సీపీఐ పోరాటాలను, త్యాగాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సహజవనరులకు నిలయమైన జిల్లాలో అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకు అపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తోందని ఆరోపించారు. 'రాష్ట్రాన్ని కాపాడండి.. దేశానికి రక్షణ కల్పించాలి' అన్న నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో డిసెంబరు 26న ఖమ్మంలో జరగనున్న భారీ బహిరంగ సభను ఐదు లక్షల మందితో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా ఎర్రజెండాలంటే కేంద్రప్రభుత్వం వణికిపోతోందని, తమ దోపిడీ సంస్థలకు ఆదివాసీ సంపదలు కట్టబెట్టడానికే మావోయిస్టులను అమానుషంగా కాల్చి చంపుతోందని సీపీఐ సీనియర్ నేత చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం సీపీఐ శత వసంతాల ముగింపు ప్రచారంలో భాగంగా ఇల్లెందు పాత బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలను, వారికి అండగా ఉన్న మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేస్తున్నారని విమర్శించారు. లొంగిపోయిన మావోయిస్టులకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. సీపీఐ నాయకత్వంలో పోరాటాలకు ఎర్ర జెండాల మాతృ సంస్థ సీపీఐలో సమీకృతం కావాలని పిలుపునిచ్చారు. ఎర్రజెండాల ఐక్యతతోనే కేంద్రం ఫాసిస్టు శక్తులకు అడ్డుకట్ట పడుతుందన్నారు. వరవరరావు, సాయిబాబా వంటి మేధావులపై అర్బన్ నక్సలైట్ల ముద్ర వేసి అక్రమ నిర్బంధాలకు కేంద్రం పూనుకొందన్నారు. చివరకు సుప్రీంకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించిందన్నారు. మేధావులను ప్రశ్నించే వారిని అక్రమ నిర్బంధాలకు గురిచేస్తూ ఎన్‌కౌంటర్ల పేరిట అమానుషంగా హత్యలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న ఫాసిస్టు చర్యలను నిరసించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

భూమి పోతుందేమోననే
మనస్తాపంతో రైతు ఆత్మహత్య

కల్హేర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోర్టు పరిధిలో ఉన్న భూమి తనకు వస్తుందో రాదోనన్న మనస్తాపంతో ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం కల్వోని కుంట గ్రామ పంచాయతీ పరిధి రత్న్యానాయక్ తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. కల్హేర్ ఎస్ఐ రవీగౌడ్ వివరాల ప్రకారం.. దేవునిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 232లో రమావత్ అంబ్ర్యానాయక్‌కు మరొకరికి మధ్య భూ వివాదం నెలకొంది. దీంతో ఇరుపక్షాలు కోర్టును ఆశ్రయించాయి. ఈక్రమంలో సదరు భూమి తనకు వస్తుందో రాదోనన్న మనస్తాపంతో అంబ్ర్యానాయక్ శుక్రవారం అదే భూమిలో చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల బలవన్మరణం


మల్లేష్, సంతోషి దంపతులు(ఫైల్)

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక కూరగాయలు విక్రయించే దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన జి.మల్లేష్(45), సంతోషి(37) భార్యాభర్తలు. వీరు కొత్తపేట మార్గదర్శి కాలనీలో నివాసం ఉంటూ రైతుబజార్ ముందు ఫుట్‌పాత్‌పై కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వీరు కొద్ది రోజుల క్రితం తమ స్వగ్రామంలో ఉన్న రెండు ఎకరాల భూమిని విక్రయించినా అప్పులు తీరలేదు. దీంతో దంపతులిద్దరూ మానసికంగా ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో మల్లేష్, సంతోషి నడక కోసం బయటకు వెళ్లారు. ఆ సమయంలో వారి కుమారుడు, కుమార్తెలు శివ, మేఘన, మౌనిక నిద్రిస్తున్నారు. ఉదయం 7.45 గంటలయినా తల్లిదండ్రులు ఇంటికి రాకపోవడంతో కుమారుడు శివ తండ్రికి ఫోన్ చేయగా ఎంతకూ ఎత్తలేదు. కొద్దిసేపటి తరువాత తన పేరు మీద రూ.20 లక్షలు, తల్లి పేరు మీద రూ.20 లక్షలు ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి వస్తాయని మల్లేష్ కుమారుని సెల్‌కు వాయిస్ మెసేజ్ పంపించి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన కుమారుడు శివ బంధువులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అతడి ఫిర్యాదు మేరకు చైతన్యపురి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తట్టిఅన్నారంలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలో విషం తాగి అపస్మారక స్థితిలో ఉన్న దంపతులిద్దర్నీ పోలీసులు గుర్తించారు. పరిశీలించగా సంతోషి అప్పటికే మృతి చెందింది. అపస్మారక స్థితిలో ఉన్న మల్లేష్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం అతడు మృతి చెందినట్లు వెల్లడించారు.

ఆన్‌లైన్ మోసాల కేసులో నిందితుడి అరెస్టు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలకు సంబంధించి సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా మ్యూల్ ఖాతాల వ్యవహారంలో విదేశీ లింకులున్న చిలకలూరిపేటకు చెందిన షేక్ బాషా సుల్తాన్‌ను అరెస్టు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన 26 సైబర్ క్రైం మోసాల్లో ఇతను నిందితుడని బ్యూరో అధికారులు గుర్తించారు. విదేశీ సైబర్ నేరగాళ్లకు కమీషన్ పద్ధతిలో బ్యాంకు ఖాతాలను షేక్ బాషా అందిస్తున్నాడని, దుబాయ్‌లో ఉన్న ఇద్దరు నేపాల్ వాసులతో ఇతనికి పరిచయాలున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. నేపాల్‌కు చెందిన రామేశ్వర్ సహన్, రాజేష్ షాలు విదేశీ హ్యాండర్లుగా పనిచేస్తున్నారని, ఆన్‌లైన్ మోసాల ద్వారా సంపాదించిన డబ్బును మనీలాండరింగ్ చేయడానికి భారతీయ బ్యాంకు ఖాతాలను వీరు బాషా ద్వారా సేకరించినట్టు ఆమె పేర్కొన్నారు. చైనా లింక్ ఉన్న సైబర్ నేరగాళ్లకు దుబాయ్‌లోని నేపాల్ వాసులు సహకరిస్తున్నారని, ఈ మోసంలో బాషా చురుకైనా పాత్ర పోషించాడని తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుడి అరెస్టు

- పిస్తాహౌస్ ఆర్థిక వ్యవహారాలతో సంబంధం!

శంషాబాద్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన వినోద్ కుమార్ గేదాల అనే ప్రయాణికుడిని ఆదాయ పన్ను శాఖ అధికారులు ఎయిర్‌పోర్ట్‌లోనే అరెస్ట్ చేశారు. విశాఖ నుంచి ఇండిగో విమానంలో వినోద్‌కుమార్ గురువారం రాత్రి 11.47 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ముందస్తు సమాచారం అందుకున్న ఐటీ శాఖ అధికారులు ఎయిర్‌పోర్టులో అతన్ని అదుపులోకి తీసుకుని హైటెక్ సిటీలోని ఐటీశాఖ కార్యాలయానికి తరలించారు. ఇటీవల హైదరాబాద్‌లోని పిస్తా హౌస్‌లో ఐటీశాఖ దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. దీని ఆర్థిక వ్యవహారాలు వినోద్‌కుమార్ చూస్తున్నట్టు తెలిసింది. దాడుల సమయంలో ఈయన పరారీలో ఉండగా గురువారం ఎయిర్‌పోర్ట్‌లో అతన్ని అరెస్ట్ చేశారు.

అమెరికాలో అగ్ని ప్రమాదం.. అంబర్‌పేట విద్యార్థికి గాయాలు..!

అంబర్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఫ్లోరిడాలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో.. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి గాయపడ్డాడు. అయితే ప్రమాదం జరిగిన తర్వాత నుంచి తమ కుమారునికి సంబంధించిన సమాచారం తెలియడం లేదంటూ విద్యార్థి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. అంబర్‌పేట తురాబ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అమీర్ హుస్సేన్ (23).. ఫ్లోరిడాలో స్థానికంగా హాస్టల్లో ఉంటూ ఎంఎస్ చదువుకుంటున్నాడు. భారత కాలమాన ప్రకారం ఈ నెల 20వ తేదీ ఉదయం అమీర్ ఉంటున్న హాస్టల్ నుంచి తల్లిదండ్రులతో వీడియో కాల్ మాట్లాడుతున్నాడు. అదే సమయంలో అకస్మాత్తుగా గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో అమీర్ వీపు భాగం, ముఖం కాలినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. స్థానికంగా ఉండే ఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారంటూ తెలిసింది. సహాయం కోసం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో పాటు భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించినట్లు విద్యార్థి తండ్రి ఆరిఫ్ హుస్సేన్ తెలిపారు. ఈ విషయంపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు.

సీసీఎస్ అదుపులో ఘరానా ఆర్థిక నేరగాడు..?

- బ్యాంకులతోపాటు సామాన్యులకు 3,339 కోట్లకు టోకరా
- పట్టుకున్న టీం ఎస్ఐకే రూ.కోట్లలో ఆఫర్
- పథకం ప్రకారం నిందితుడిని వదిలేసిన ఎస్ఐపై వేటు

హైదరాబాద్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అతడొక ఘరానా ఆర్థిక నేరగాడు. షెల్ కంపెనీలు సృష్టించి రూ.3,316 కోట్ల రుణాలు తీసుకుని బ్యాంకులకు టోకరా వేసిన వ్యక్తి పేరు ఉప్పల సతీశ్. ఇలా బ్యాంకులను మోసగించిన సతీశ్, ఆయన సోదరిలను మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గతంలో అరెస్టు చేశారు. ఈ కేసు దర్యాప్తు నడుస్తున్నప్పుడే అతడు.. తన ఐటీ వ్యాపారంలో పెట్టుబడులకు తక్కువ సమయంలోనే అధిక లాభాలిస్తానని మరోమారు మోసానికి పాల్పడ్డాడు. సతీశ్ మాటలు నమ్మిన ఏపీలో ప్రముఖ రాజకీయ నాయకుడి కుమారుడు, వైద్యుడితోపాటు పలువురు పెట్టిన పెట్టుబడి సుమారు రూ.23 కోట్లు కొల్లగొట్టి.. తర్వాత బిచాణా ఎత్తేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడ్ని పట్టుకోవడానికి పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దించిన టాస్క్‌ఫోర్స్ టీం.. సాంకేతిక ఆధారాల ప్రకారం నిందితుడు సతీశ్.. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని అందేరీలో తలదాచుకున్నట్లు గుర్తించడంతోపాటు గత నెలలో అరెస్టు చేశారు. తర్వాత హైదరాబాద్‌కు తీసుకొస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం ఎస్ఐకే సతీష్ రూ.కోట్లు ఆఫర్ చేశాడు. డీల్ కుదిరాక పథకం ప్రకారం నిందితుడ్ని వదిలేసిన ఎస్ఐపై సస్పెన్షన్ వేటు పడింది. మరోవైపు, తప్పించుకున్నాక అజ్ఞాతంలోకి వెళ్లిన సతీశ్‌ను పట్టుకోవడాన్ని చాలెంజ్‌గా తీసుకున్న సీసీఎస్ పోలీసులు నెల రోజులుగా గాలించారు. ఎట్టకేలకు అతడ్ని అరెస్టు చేసినట్లు సమాచారం.

ఆలయ ఆదాయం నుంచి జీఎస్టీ కట్టాల్సిందే!



- రాష్ట్రంలోని పలు ఆలయాలకు నోటీసులు జారీ
- అర్చన, అభిషేకం, వసతి గృహాలు, షాపుల అద్దెలు, ప్రసాదాలు, తలనీలాల విక్రయంపై పన్ను విధింపు
- గత ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న బకాయిలు
- మినహాయింపు కోరుతున్న దేవాదాయ శాఖ

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇష్టదైవానికి భక్తితో అర్చన, అభిషేకం, ఇతర ప్రత్యేక పూజలు చేయించినా... కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ప్రసాదం కొనుగోలు చేసి తీసుకెళ్లినా... జీఎస్టీ చెల్లించాల్సిందేనట. ఈ మేరకు తెలంగాణలోని అన్ని ప్రముఖ ఆలయాలకు సంబంధిత అధికారులు వరుసగా నోటీసులు పంపుతుండడంతో దేవాదాయ శాఖ అధికారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. యాదగిరి గుట్ట, వేములవాడ, భద్రాచలం, కొండగట్టు, కొమరవెల్లి మల్లన్న, బాసర సరస్వతి ఆలయాలతోపాటు మరి కొన్ని చిన్న ఆలయాలకు ఈ తరహా నోటీసులు జారీ అయ్యాయి. అర్చన, అభిషేకం వంటి ఆర్జిత సేవలు, ఆలయాల వద్ద గదులు, వ్యాపార సముదాయాలు అద్దెకు ఇవ్వడం, ప్రసాదాల విక్రయం, ఆలయానికి సంబంధించిన ఫొటోలు, వెండి, బంగారు ప్రతిమల విక్రయం తదితర మార్గాల్లో ఆలయాలకు ఆదాయం సమకూరుతుంది. ఈ ఆదాయంపైనే జీఎస్టీ విధిస్తున్నారు. వ్యాట్ (విలువ ఆధారిత పన్ను) విధానం అమలులో ఉన్నప్పుడు ఆలయాలకు మినహాయింపు ఉండేది. 2017 నుంచి జీఎస్టీ అమల్లోకి రాగా, ఆలయాలకు వచ్చే ఆదాయంపైనా పన్ను విధిస్తున్నారు. జీఎస్టీ నుంచి ఆలయాలను మినహాయించాలని స్థానిక అధికారులు పలుమార్లు కోరినా.. ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఒక్కో ఆలయం కోట్లాది రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉంది. బకాయిలపై అప్పీలుకు వెళ్లాలన్నా.. విధించిన జీఎస్టీపై 10% ఫీజు చెల్లించాల్సి ఉండటంతో దేవాదాయ శాఖ అధికారులు సాహసించడం లేదు. "భక్తులు హుండీలో వేసే కానుకలు, విరాళాలకు మాత్రమే పన్ను మినహాయింపు ఉంది. ఆర్జిత సేవలు, గదులు, వ్యాపార సముదాయాల అద్దె, కొబ్బరి చిప్పల విక్రయం తదితరాలపై కేంద్రం జీఎస్టీ విధిస్తోంది. ఆలయ నిర్వహణ, పలు నిర్మాణాలకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసే సమయంలోనే జీఎస్టీ చెల్లిస్తున్నాం. మరోసారి ఆలయ ఆదాయంపై జీఎస్టీ విధించడం సరికాదు. జీఎస్టీపై అప్పీలుకు వెళ్దామన్నా.. 10%ఫీజు చెల్లించాల్సి ఉండడం ఆర్థికంగా భారంగా మారింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటే భక్తులకు మేలు జరుగుతుంది" అని దేవాదాయ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఆలయాల్లో నిర్వహించే ఆర్జిత సేవలకూ పన్ను విధించడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

సాదాబైనామాకు
సాంకేతిక అడ్డంకులు

- ఉమ్మడి జిల్లా నుంచి కొత్త జిల్లాకు దరఖాస్తు బదిలీ వీలుకాని పరిస్థితి
- మీ సేవలో విస్తీర్ణం తప్పు పడినా... సరిదిద్దేందుకు వెసులుబాటు లేదు
- సాఫ్ట్‌వేర్ లోపంతో ఒక్కో దరఖాస్తుకు వందల సర్వే నంబర్లు చూపుతున్న పోర్టల్
- 9 లక్షలకు పైగా పెండింగ్ దరఖాస్తులు
- ఇప్పటిదాకా పరిష్కరించినవి కేవలం 5,295



హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామా దరఖాస్తుల అంశం ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతోంది. నాలుగేళ్లుగా నిరీక్షించిన దరఖాస్తుదారులకు కొత్త చట్టంతో పరిష్కారం దొరుకుతుందని ఆశించినా ఫలితం అంతంతమాత్రంగానే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఇప్పటి వరకు క్రమబద్ధీకరణకు నోచుకున్నవి కేవలం 5,295 మాత్రమే. సాంకేతిక సమస్యలు ఎదురవుతుండడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఉమ్మడి జిల్లాల్లో పెట్టుకున్న దరఖాస్తును ప్రస్తుతం దరఖాస్తుదారు ఉన్న జిల్లాకు బదిలీ చేయాలంటే పోర్టల్‌లో అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రతి జిల్లాలో ఈ తరహా కేటగిరీ కింద పదుల సంఖ్యలో దరఖాస్తులు ఉన్నాయని, వాటిని ఆయా జిల్లాల పరిధిలోకి బదలాయించేందుకు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని కోరినా సీసీఎల్ఏ నుంచి స్పందన లేదని క్షేత్ర స్థాయి రెవెన్యూ అధికారులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు విస్తీర్ణంలో తప్పులను గుర్తించి.. వాటిని సవరించాలని చూసినా అందుకు కూడా సాఫ్ట్‌వేర్‌లో వెసులుబాటు లేదని చెబుతున్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో మీ సేవా కేంద్రాల్లో జరిగిన పొరపాట్లను ఇప్పుడు సరిదిద్దలేకపోతున్నామని పేర్కొంటున్నారు. పరిష్కరించే అవకాశం ఉన్న దరఖాస్తులను సైతం మండలస్థాయి రెవెన్యూ అధికారులు ఏదో ఒక సాకుతో పక్కన పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అఫిడవిట్ అవసరం లేదని సీసీఎల్ఏ స్పష్టత ఇచ్చినా కొన్నిచోట్ల దరఖాస్తులను తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల్లో గందరగోళం

పోర్టల్‌లో సాంకేతిక లోపం వల్ల సాదాబైనామా దరఖాస్తులకు, సర్వే నంబర్లకు పొంతన లేకుండాపోయిందని అధికారులు చెబుతున్నారు. ఒక్కో దరఖాస్తుకు వందలకొద్దీ సర్వే నంబర్లు కనిపిస్తున్నాయని, ఈ సమస్యను ఎలా అధిగమించాలో అర్థం కావడం లేదని అదనపు కలెక్టర్లు తలపట్టుకుంటున్నారు. తమ జిల్లాల్లో ఉన్న దరఖాస్తులకు, చూపుతున్న సర్వే నంబర్లకు సంఖ్యాపరంగా భారీ వ్యత్యాసం కనిపిస్తోందని, సాంకేతిక లోపం వల్లనే ఈ సమస్య తలెత్తిందని వారు చెబుతున్నారు. సీసీఎల్ఏ లెక్కల ప్రకారం 9,00,880 సాదాబైనామా దరఖాస్తులు ఉంటే.. వాటికి 11,49,316 సర్వే నంబర్లు కనిపిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో దరఖాస్తులు 15 వేలు ఉంటే.. సర్వే నంబర్లు 22 వేలు కనిపిస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 51,347 దరఖాస్తులు ఉంటే 73,797 సర్వే నంబర్లు, సిద్దిపేటలో 44 వేల దరఖాస్తులకు 61,180 సర్వే నంబర్లు ఉన్నాయి. అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో అధికారులు గందరగోళానికి గురవుతున్నారు. ఇలా ఉంటే ఎలా క్లియర్ చేయాలని కొన్ని జిల్లాల అధికారులు ప్రశ్నిస్తున్నారు. అన్ని సర్వే నంబర్లు క్లియర్‌చేయాలని, దరఖాస్తుదారు పేర్కొన్న సర్వే నంబరును గుర్తించి చట్టబద్ధమైన అనుమతులు ఇవ్వాలని సూచించడంతో కిందిస్థాయి అధికారులు నిర్ణయం తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. సర్వే నంబర్ల విషయంలో సాంకేతిక సమస్యలను తొలగించి స్పష్టత ఇవ్వాలని తహసీల్దార్లు, అదనపు కలెక్టర్లు కోరుతున్నారు.

పరిష్కారం కన్నా.. తిరస్కారమే ఎక్కువ

- భూభారతి దరఖాస్తులను తిరస్కరిస్తున్న తహసీల్దార్లు
- పెండింగ్‌లో ఉంటే ఉన్నతాధికారులకు వివరణ ఇవ్వాల్సి వస్తుందనే..
- తిరస్కరణకు కారణాలు చెప్పాల్సిందేనని గతంలోనే ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు
- అయినా పట్టించుకోని తహసీల్దార్లు.. తీవ్ర ఆందోళనలో రైతులు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతోనైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనుకున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. సమస్యలను సహేతుకంగా పరిష్కరించాల్సిన అధికారులు.. ఏదో ఒక సాకుతో దరఖాస్తులను తిరస్కరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెండింగ్‌లో ఉంటే ఉన్నతాధికారులకు వివరణ ఇవ్వాల్సి వస్తుందని తహసీల్దార్లు దరఖాస్తులను తిరస్కరించి చేతులు దులుపుకొంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా పరిష్కరిస్తున్న దరఖాస్తుల కంటే తిరస్కరిస్తున్నవే ఎక్కువగా ఉంటున్నాయి. ఏప్రిల్ 14న భూభారతి చట్టం అమల్లోకి రాగా, ప్రభుత్వం అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. సుమారు 30 రకాల భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. సర్వే నంబర్లలో లోపాలు, పట్టాదార్ పాసుపుస్తకాలు కావాలని, కోర్టు వివాదాలు, పోడు భూములకు హక్కు పత్రాలు, పేర్ల సవరణ, విస్తీర్ణంలో లోపాలు వంటి సమస్యలు ఉన్నాయి. ఈ దరఖాస్తులను ఉచితంగా పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8.58 లక్షల దరఖాస్తులు రాగా అందులో సాదాబైనామా, అసైన్డ్ భూ సమస్యల మీద వచ్చిన దరఖాస్తులు పోగా మిగిలినవి 4,05,156 ఉన్నాయి. ఇందుకు సంబంధించిన సర్వే నంబర్లు 25,76,851 ఉన్నాయి. వాటిల్లో అధికారులు 1,11,093 సర్వే నంబర్లను మాత్రమే ఆమోదించారు. 2,17,486 సర్వే నంబర్లను తిరస్కరించారు. ఇంకా 22లక్షలకు పైగా సర్వే నెంబర్లకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

సీసీఎల్ఏ ప్రత్యేక ఫార్మాట్‌లో నమోదు చేయాల్సి ఉన్నా..

భూ సమస్యల్లో న్యాయపరమైన వాటికి పరిష్కారం చూపాలని, దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణం ఏంటనేది రాతపూర్వకంగా స్పష్టం చేయాలని ఉన్నతాధికారులు తహసీల్దార్లను ఆదేశించారు. అయితే క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న అధికారులు ఏదో ఒక సాకుతో కారణాలు చెప్పకుండానే దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. దరఖాస్తుల తిరస్కరణకు గల కారణాలను తెలిపేందుకు సీసీఎల్ఏ ప్రత్యేక ఫార్మాట్‌ను తయారు చేసి తహసీల్దార్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ ఫార్మాట్‌లో నమోదు చేయాల్సి ఉన్నా వారు పట్టించుకోవడంలేదు.

బెట్టింగ్ యాప్స్ కేసులో సీఐడీ విచారణకు హాజరైన శ్రీముఖి

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు విచారణలో భాగంగా సీఐడీ సిట్ ఎదుట శుక్రవారం పలువురు సెలబ్రిటీలు హాజరయ్యారు. సినీ హీరోయిన్లు నిధి అగర్వాల్, అమృతా చౌదరి, యాంకర్ శ్రీముఖి సిట్ అధికారుల వద్ద తమ వాంగ్మూలాలను నమోదు చేశారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కోసం వారు ఎంత మొత్తం పారితోషికం తీసుకున్నారు? ఒప్పందాల వివరాలు, డబ్బు చెల్లింపులు ఏ విధంగా జరిగాయన్న విషయాలపై సిట్ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. ఈ క్రమంలో వారి బ్యాంకు స్టేట్‌మెంట్లను కూడా పరిశీలించారు. నిధి అగర్వాల్ 'జీత్ విన్'కు, శ్రీముఖి 'ఎం 88'కు, అమృతా చౌదరి 'యోలో 247', 'ఫెయిర్ ప్లే' యాప్‌లకు ప్రమోషన్ చేశారు. మియాపూర్, పంజాగుట్ట పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల ఆధారంగా సిట్ దర్యాప్తు జరుపుతున్న సంగతి విదితమే.

పైరసీదారుల నుంచి కొని
ఐ బొమ్మలో అప్‌లోడ్

- సినిమాలు కొనడానికి డబ్బుల కోసం బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్
- ఆర్థిక లావాదేవీలంతా క్రిప్టో కరెన్సీలోనే
- పోలీసుల విచారణలో ఐ బొమ్మ రవి వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పైరసీ చేసినవారి(థర్డ్ పార్టీ) నుంచి సినిమాలు కొనుగోలు చేసి ఐ బొమ్మ రవి తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవాడని, సినిమాల కొనుగోలుకు అవసరమైన డబ్బును బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయడం ద్వారా సంపాదించేవాడని పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ ద్వారా తనకు వచ్చే డబ్బు.. సినిమాల కొనుగోలుకు తను చెల్లించే డబ్బు లావాదేవీలంతా క్రిప్టో కరెన్సీ రూపంలోనే జరిగేవని, ఈ మేరకు రవి పోలీసుల విచారణలో వెల్లడించాడని సమాచారం. సినిమాలను పైరసీ చేసి అమ్మిన వారెవరు అనే అంశంతో పాటు బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్, మనీ లాండరింగ్, కాపీరైట్స్ ఉల్లంఘన, ఇతర దేశాల్లో నెట్‌వర్క్ గురించి పోలీసులు రవి నుంచి సమాచారం రాబడుతున్నట్లు తెలిసింది. ఫ్రీజ్ చేసిన బ్యాంకు ఖాతాలు, అందులో ఆర్థిక లావాదేవీలపై లోతుగా విచారిస్తున్నారు. రవికి చెందిన సుమారు 35 బ్యాంకు ఖాతాల్లోకి వందల కోట్లు నగదు క్రిప్టో రూపంలో బదిలీ అయిందని పోలీసులు గుర్తించారు. సినిమా పైరసీ కోసం అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌తో పాటు రవి ఇంకా ఏఏ దేశాల్లో సర్వర్లను ఏర్పాటు చేశాడో తెలుసుకోవడంతో పాటు, ఐ బొమ్మ వెబ్‌సైట్ 110 డొమైన్లకు సంబంధించిన పూర్తి వివరాలను రాబడుతున్నారు. ఒక సైట్‌ను బ్లాక్ చేస్తే మరొకటి ఓపెన్ అవుతూ పైరసీ సినిమాలు విడుదల అవుతున్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని క్లోజ్ చేసే దిశగా విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. అందుకు రవి వినియోగిస్తున్న హై అండ్ టెక్నాలజీపై ఆరా తీస్తున్నారు.

సంతృప్తితో వీడ్కోలు చెబుతున్నా

అంబేడ్కర్ స్ఫూర్తితోనే కర్తవ్య నిర్వహణ

- సంపన్న ఎస్సీలకు రిజర్వేషన్లు ఉండొద్దు
- వీడ్కోలు సమావేశంలో జస్టిస్ గవాయ్



న్యూఢిల్లీ, నవంబరు 21: పూర్తి సంతోషం, సంపూర్ణ సంతృప్తితో న్యాయస్థానాలను వీడుతున్నట్టు సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. శుక్రవారం చివరి పనిదినం కావడంతో ఆయన బాధ్యేగానికి లోనయి అనుభవాలను గుర్తుకు తెచ్చుకున్నారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా నాలుగు దశాబ్దాల పాటు న్యాయ వ్యవస్థతో ఆయనకు అనుబంధం ఉంది. ఆదివారం ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో సాయంత్రం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆయనను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 'నేను రాజ్యాంగాన్ని పట్టుదలతో చదివే విద్యార్థిని. రాజ్యాంగ విలువలైన సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభాతృత్వం నా హృదయానికి దగ్గరగా ఉంటాయి' అని అన్నారు. తన మూలాలను గుర్తు చేసుకుంటూ మహారాష్ట్రలోని అంతగా ప్రాచుర్యంలేని లేని ప్రాంతం నుంచి వచ్చానని తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి వరకు ఎదిగానని, తల్లిదండ్రులు నేర్పిన విలువలే తనను ఈ స్థానానికి తీసుకొచ్చాయని తెలిపారు. ఆ పదవిని చేపట్టిన తొలి బౌద్ధ, రెండోదళిత వ్యక్తి ఆయనే కావడం విశేషం. ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ క్రీమీలేయర్ పరిధిలోకి వచ్చే ఎస్సీలకు ఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్లు ఉండకూడదని తీర్పు ఇచ్చారు. దీనిని ప్రస్తావిస్తూ 'ఎస్సీలందరికీ రిజర్వేషన్ల కారణంగా వ్యవసాయదారుడి కుమారుడు ఢిల్లీలోని ప్రఖ్యాత విద్యా సంస్థల్లో చదివే సీనియర్ ఐఏఎస్ అధికారి కుమారుడితో పోటీ పడాల్సిన పరిస్థితి వస్తోంది. నా వద్ద పని చేసే లా క్లర్క్.. సీనియర్ ఐఏఎస్ అధికారి కుమారుడు. ఎస్సీలకు లభించే సౌకర్యాలనేవీ తాను తీసుకోబోనని ఆయన చెప్పాడు. ఒక యువకుడికి అర్థమయిన విషయం రాజకీయ నాయకులకు ఎందుకు అర్థం కాదో తెలియదు' అని అన్నారు. ఉదయం జరిగిన లాంఛనప్రాయ ధర్మాసనంలోనూ జస్టిస్ గవాయి తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 1985లో తాను లా విద్యార్థిగా కోర్టులో ప్రవేశించానని, ఇప్పుడు జస్టిస్ విద్యార్థిగా కోర్టును విడిచిపెడుతున్నానని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌తో తన తండ్రి చాలా సన్నిహితంగా మెలిగేవారని, అది తనపై ప్రభావం చూపిందని తెలిపారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం కోసం అంబేడ్కర్ చూసిన నిబద్ధతే తనను మార్గదర్శనం చేసిందని అన్నారు. అందుకే ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య సమతౌల్యం ఉండేలా చూసేవాడినని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ తనకు ఇష్టమైన అంశమని చెప్పారు. ప్రజల హక్కులను కాపాడుతునే పర్యావరణం, వన్యప్రాణి రక్షణ కోసం ప్రయత్నించానని అన్నారు. అందరికీ కృతజ్ఞతలు చెప్పిన సమయంలో స్వరం గద్గదమయింది. లాంఛనప్రాయ ధర్మాసనంలో ఆశీనులైన తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తన ప్రసంగంలో జస్టిస్ గవాయ్‌ను ప్రశంసించారు. ఆయన సహచరుడు మాత్రమే కాదు, సోదరుడని అన్నారు. జస్టిస్ గవాయ్ కేసులను గౌరవం, సహనంతో వినేవారని ప్రశంసించారు. యువ లాయర్లను ప్రోత్సహించేవారని చెప్పారు. జరిమానా విధిస్తానంటూ ప్రతి రోజూ న్యాయవాదులను బెదిరించేవారని, కానీ నిజానికి ఒక్క రోజు కూడా అలా చేయలేదని అన్నారు.

రాష్ట్రపతి ప్రశ్నలపై 'స్వదేశీ భాష్యం'

అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదించకుండా తాత్సారం చేస్తున్న సమస్యపై రాష్ట్రపతి లేవనెత్తిన ప్రశ్నలకు 'స్వదేశీ భాష్యం' చెప్పి సమాధానాలు ఇచ్చినట్టు జస్టిస్ గవాయ్ తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి విదేశీ కోర్టుల తీర్పును కూడా ప్రస్తావించలేదని అన్నారు.

పెట్రోల్ ధరలు పెరుగుతాయా?

- రష్యాపై అమెరికా ఆంక్షల ప్రభావం

న్యూఢిల్లీ, నవంబరు 21: దేశంలో కొన్నాళ్లుగా నిలకడగా ఉన్న పెట్రోల్ ధరలు సమీప భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉందా? అంటే సంబంధిత వర్గాలు అవుననే అంటున్నాయి. రష్యా నుంచి భారత్‌కు చవకగా లభిస్తున్న ముడి చమురు దిగుమతులు తగ్గిపోతుండడమే ఇందుకు కారణమని చెబుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశ చమురు సంస్థలపై అమెరికా విధిస్తున్న ఆంక్షలు భారత్‌పై పరోక్షంగా ప్రభావం చూపుతున్నాయని పేర్కొంటున్నాయి. రష్యా చమురు తక్కువ ధరకు లభించడంతో భారత్ కొంతకాలంగా దేశీయంగా చమురు ఉత్పత్తుల ధరలను నిలకడగా కొనసాగిస్తోంది. కానీ, అమెరికా ఆంక్షలతో రష్యా నుంచి భారత్‌కు దిగుమతులు క్రమంగా తగ్గిపోతున్నాయి. రష్యాకు చెందిన రోస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్ సంస్థలపై అమెరికా విధించిన ఆంక్షలు శుక్రవారం అమలులోకి రాగా 4.8 కోట్ల ముడి చమురు బ్యారెళ్లు నడి సంద్రంలో నిలిచిపోయాయి. రష్యా నుంచి బయలుదేరిన ఈ చమురు బ్యారెళ్లలో అధిక శాతం భారత్, చైనాకు చేరాల్సి ఉందని సమాచారం. ఆయా నౌకలలోని చమురును దిగుమతి చేసుకునేందుకు చాలా పోర్టులు, రిఫైనరీలు నిరాకరిస్తుండగా.. అవి భారత్‌కు చేరే అవకాశం కనిపించడం లేదు. మరోపక్క, రోస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్ సంస్థల నుంచి ఐవోసీ(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) సహా పలు భారతీయ సంస్థలు డిసెంబరు, జనవరి కొనుగోళ్లను ఇప్పటికే ఆపేశాయి. అమెరికా ఆంక్షలు విధించని సంస్థల ద్వారా రష్యా నుంచి ముడి చమురు వచ్చే అవకాశం ఉన్నా.. అది ఎంత కాలమో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా, అమెరికాకు చెందిన చమురు సరఫరాదారులను భారత్ ఇటీవల ఆశ్రయిస్తోంది. అయితే, ఈ దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకుంటే రష్యాతో పోలిస్తే రవాణా ఖర్చులు ఐదింతలు పెరగనున్నాయి. దిగుమతి ఖర్చులు పెరిగి రిఫైనరీల ఆదాయంపై ప్రభావం పడనుంది. ఫలితంగా సమీప భవిష్యత్తులో భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

హోం సహా కీలక శాఖలు బీజేపీకే

- బిహార్లో మంత్రులకు శాఖల కేటాయింపు

బెట్టియా/పట్నా, నవంబరు 21: బిహార్ నూతన క్యాబినెట్‌లోని మంత్రులకు కీలక శాఖల కేటాయింపు పూర్తయ్యింది. సీఎం నితీశ్ నేతృత్వంలో మొత్తం 26 మంది మంత్రులు గురువారం ప్రమాణస్వీకారం చేయగా అందులో 18 మందికి శుక్రవారం వివిధ శాఖలను కేటాయించారు. కీలకమైన శాఖలను బీజేపీ సొంతం చేసుకుంది. ఎప్పుడూ తనవద్దే ఉంచుకునే హోంశాఖను సీఎం నితీశ్ ఈసారి బీజేపీకి కేటాయించడం విశేషం. బీజేపీ శాసనసభాపక్ష నేత సామ్రాట్ చౌదరికి ఆ బాధ్యతలను అప్పగించారు. మరోవైపు తాను బిహార్ ఉప ముఖ్యమంత్రి పదవిని కోరుకోవడం లేదని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ స్పష్టం చేశారు. బిహార్ క్యాబినెట్‌లో ఎల్‌జేపీ (రాంవిలాస్)కి రెండు పదవులు కేటాయించినందుకు ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఒకరోజు మౌనదీక్ష చేసిన జన్‌సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ శుక్రవారం నూతన క్యాబినెట్‌పై మండిపడ్డారు. ప్రమాణస్వీకారం చేసిన మంత్రులందరూ అవినీతి, నేరారోపణలు ఉన్నవారేనని ఆరోపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.